ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 01.05.2026 | సంపుటి : 12 సంచిక : 281 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



సామాన్యుని స్వరం






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## హాస్టళ్లకు, స్కూళ్లకు

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం



### జవాబుదారీతనం పెంచేందుకే ఈ నిర్ణయం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు మిగతా 2లో..

### ప్రభుత్వ సలహాదారుగా హనుమంతరావు

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం 2లో..

## ప్రజా ప్రభుత్వ పాలనలో

# కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

**అంతర్జాతీయ కార్మిక దినోత్సవ సందర్భంగా కార్మిక వర్గానికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు**

**హైదరాబాద్(జనంసాక్షి):** మే డే(మే 1వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం మిగతా 2లో..

## పోలీసు చరిత్రలో డీజీపీ శివధర్ రెడ్డి

# ఓ గొప్ప మైలురాయి

### హైదరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు గౌరవ వీడ్కోలు

- నా సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో జ్ఞాపకాలు.. మరెన్నో అనుభవాలు మిగిలాయి
- నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ, డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు
- పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితుల్లో పెద్ద మార్పులు వచ్చాయి
- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం:డీజీపీ శివధర్‌రెడ్డి
- యువ పోలీస్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకురావాలి
- 32 ఏళ్లపాటు శివధర్‌రెడ్డి ప్రజలకు విశిష్ట సేవలు అందించారు: సీపీ ఆనంద్



హైదరాబాద్ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో డీజీపీ శివధర్‌రెడ్డికి పోలీసు ఉన్నతాధికారుల గౌరవ వీడ్కోలు

> 32 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ జీవితంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో జ్ఞాపకాలు, తీపిగుర్తులు, ఒత్తిడిలు. అన్నింట్లోనూ నాతో ముందుడి, పక్కనుంచి నడిపించి వెన్నుతట్టి నడిపినటువంటి సీనియర్స్‌కు ధన్యవాదాలు. వారు చూపించిన పథంలోనే పోలీస్‌శాఖ నడుస్తుందని భావిస్తున్నాను. ఒకప్పటితో పోలిస్తే పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి" - డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** తన 32 ఏళ్ల పోలీస్ జీవితంలో అనేక అనుభవాలు, జ్ఞాపకాలు మిగిలాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా హైదరాబాద్ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు గౌరవ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ఇప్పటి పరిస్థితుల్లో పెద్ద మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్, ప్రజల మధ్య దూరం తగ్గించేందుకు ఫ్రెండ్లీ మిగతా 2లో..

### రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాతో కూడిన ఈ పదవిలో మూడేళ్ల పాటు సేవలు 2లో



# ఎల్‌ఆర్‌ఎస్‌పై 25% రాయితీ

- మే 1నుంచి జులై 31 వరకు అవకాశం
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని ,అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు , ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020 కు సవరణలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక మిగతా 9లో..

## అణ్వస్త్ర కార్యక్రమాన్ని జాతీయ సంపదలా

# కాపాడుకుంటాం

- విదేశీయులకు సముద్ర జలాల అడుగునే చోటు
- గల్ఫ్‌లో, హర్మూజ్‌లో కొత్త అధ్యాయం మొదలుకానుంది
- అమెరికా రహిత పర్షియన్ గల్ఫ్‌కు ఉజ్వల భవిష్యత్తు
- హర్మూజ్‌పై శత్రువు దురాగతాలను ఇరాన్ నిర్మూలిస్తుంది
- ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ సందేశం



**టెహ్రాన్(జనంసాక్షి):** అణ్వస్త్ర కార్యక్రమం, మిస్సైల్ సామర్థ్యాలను జాతీయ సంపదలా కాపాడుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ ప్రకటించారు. కొత్త మేనేజ్‌మెంట్ హర్మూజ్ జలసంధి మార్గంలో శాంతిని స్థాపిస్తుందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ ప్రాంతాన్ని రక్షించడంతో పాటు హర్మూజ్ మార్గంపై శత్రువు చేస్తున్న దురాగతాలను ఇరాన్ నిర్మూలిస్తుందని ముజ్తబా తెలిపారు. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ జలాలకు ఇరువైపులా ఉన్న దేశాలకు, ఇరాన్‌కు ఒకే గమ్యం ఉందని ఆయన చెప్పారు. వేల కిలోమీటర్ల దూరం నుంచి దురాశతో వచ్చి, దురుద్దేశంతో ప్రవర్తించే విదేశీయులకు సముద్ర జలాల అడుగున తప్ప మరెక్కడా స్థానం లేదని ముజ్తబా ఖమేనీ స్పష్టంచేశారు. దేవుడి సహాయం, శక్తితో అమెరికా రహితంగా పర్షియన్ గల్ఫ్ ప్రాంతానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఇది అక్కడి మిగతా 2లో..

## అణు ఒప్పందం కుదిరే వరకు

# దిగ్బంధనం

- ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే మా షరతులకు ఒప్పుకోవాల్సిందే
- అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు
- నేనసలే మంచి వాడిని కాను
- మరోసారి హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇరాన్‌తో అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం కొనసాగుతుందని అధ్యక్షుడు ట్రంప్ తాజాగా స్పష్టం చేశారు. దిగ్బంధనాన్ని ఎత్తివేయాలనే ఇరాన్ ప్రతిపాదనపై రాజీ పడే ప్రసక్తే లేదని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సైనిక చర్యతో పోలిస్తే.. ఓడరేవుల దిగ్బంధనమే ప్రభావవంతంగా పని చేస్తోందని, దీంతో టెహ్రాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోందన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ తీవ్ర ఒత్తిడిలో ఉందని, చర్చలకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. సంఘర్షణను ప్రజల పురోగతి, సౌకర్యం, శ్రేయస్సుకు మిగతా 2లో..

### అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం

అమెరికాకు ఇరాన్ నేవీ కమాండర్ హెచ్చరిక 2లో..

### ఇరాన్ విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గాల్సిందే..

టెహ్రాన్‌పై మళ్లీ సైనిక చర్యకు దిగితే.. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది : పుతిన్



## అర్హులైన జర్నలిస్టులందరికీ

# అక్రిడిటేషన్ కార్డులు

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్30(జనంసాక్షి):** జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

- ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- టీఆర్ఎస్ తనకే రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్

**హైదరాబాద్(జనంసాక్షి):** 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు మిగతా 2లో..



## అత్యాచార బాధితుల విషయంలో మీ చట్టాలను

# మార్చాల్సిందే..

### 5 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో కేంద్రానికి సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో గురువారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో 30 వారాల గర్భవిచ్ఛిత్తికి బాలికకు ఇటీవల అత్యున్నత న్యాయస్థానం అనుమతిచ్చింది. అయితే దీనిపై ఎయిమ్స్ క్యూరేటివ్ పిటిషన్ వేసింది. ఈ దశలో గర్భాన్ని తొలగిస్తే.. ఆ బాలిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం సూచనలు చేసింది. అత్యాచార బాధితుల కోసం చట్టాలను సవరించాలని సూచించింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళ మరీ ముఖ్యంగా మిగతా 2లో..

### శరవేగంగా సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ వర్సిటీ

- యూనివర్సిటీ పనులు త్వరలో ప్రారంభం
- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 2లో..

### చిన్నారుల అక్రమ రవాణా.. హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల తనిఖీలు

# బెంగాల్ ప్రజలు మావెంటే..

- అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ముమ్మాటికీ టిఎంసిదే
- ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగే అవకాశముంది
- కార్యకర్తలు లెక్కింపు కేంద్రాల్లో 24 గంటలు నిఘా పెట్టాలి
- వీడియో సందేశం విడుదల చేసిన మమతా బెనర్జీ



**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 కంటే ఎక్కువ సీట్లను టీఎంసీ గెలుస్తుందని స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు మిగతా 9లో..

### ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అదుపుతప్పి..

# లోయలో పడిన జీపు..

- 17 మంది మృతి
- నేపాల్‌లో ఘోర ప్రమాదం



9లో..

## అణ్వస్త్ర కార్యక్రమాన్ని జాతీయ సంపదలా కాపాడుకుంటాం

రాసిన లేఖలోని వివరాలతో ప్రభుత్వ టీవీ ఛానల్‌లో ఓ కథనాన్ని ప్రసారం చేశారు.గల్ఫ్‌లో, హర్మూజ్‌లో కొత్త అధ్యాయం"ఇజ్రాయెలీ జియోనిజంతో పాటు రక్తదాహం కలిగిన అమెరికాకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన ఎంతో మందికి మాత్రమే ఇరాన్ జాతి జాగృతి పరిమితం కాలేదు. దేశం లోపల, వెలుపల ఉన్న 9 కోట్ల మంది ఇరానీయులు నానోటెక్నాలజీ, బయోటెక్నాలజీ నుంచి అణు, క్షిపణి సామర్థ్యాల వరకు ఇరాన్ గుర్తింపు ఆధారిత, ఆధ్యాత్మిక, మానవ, శాస్త్రీయ, పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలన్నింటినీ జాతీయ ఆస్తులుగా భావిస్తారు. ఇరానియన్లు దేశ జలాలను, భూమిని, గగనతలాన్ని ఎలాగైతే కాపాడుకుంటారో, అలాగే వీటిని కూడా కాపాడుకుంటారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో జరిగిన యుద్ధం వల్ల గల్ఫ్ ప్రాంతంతో పాటు హర్మూజ్ జలసంధి మార్గంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇరాన్ ప్రతిఘటనా విధానాలు, ప్రాంతీయ సమీకరణాల్లో వచ్చిన మార్పులతో రూపుదిద్దుకున్న నూతన వ్యవస్థకు ఇదొక ఆరంభం. దేవుడి అండ, శక్తితోనే ఇరాన్‌కు ఈ విజయం లభించింది" అని ముజ్తబా ఖమేనీ తెలిపారు.ఖమేనీ ప్రస్తావించిన కొత్త మేనేజ్‌మెంట్ ప్రకారం, హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే ఏ నౌక అయినా ఇరాన్ లేదా ఒమన్ నుంచి ముందస్తు అనుమతిని తీసుకోవాల్సి ఉంటుందని సమాచారం. జలసంధి మార్గాన్ని ఉపయోగించుకునే విదేశీ నౌకల నుంచి రుసుమును వసూలు చేస్తారని తెలుస్తోంది. తాజా పశ్చిమాసియా యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారాన్ని చెల్లిస్తేనే అమెరికా, ఇజ్రాయెల్ లాంటి దేశాల నౌకలను హర్మూజ్ మీదుగా రాకపోకలకు అనుమతించే అవకాశాలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను చేపట్టాలని ఇరాన్ సైన్యం భావిస్తోందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు.పోర్చుగీసు పాలకులు 1507లో హర్మూజ్ జలసంధి మార్గాన్ని కబ్జా చేశారు. హర్మూజ్, దాని పక్కనే ఉండే గెష్మ్ దీవిని వాళ్లు ఆక్రమించుకున్నారు. హర్మూజ్, గెష్మ్ దీవులను కేంద్రంగా చేసుకొని పర్షియన్ గల్ఫ్ సముద్ర మార్గం మీదుగా జరిగే నౌకా వాణిజ్యాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే ప్రతి నౌక నుంచి పోర్చుగీసు పాలకులు భారీగా పన్నులను వసూలు చేసేవారు. ఈ పరిణామం ఆనాడు ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు నష్టాన్ని కలిగించింది. ఈ పరిస్థితుల్లో 1622లో షా అబ్బాస్ ఎ సారథ్యంలోని ఇరాన్ సైన్యం పోర్చుగీస్ నౌకాదళాన్ని ఓడించి హర్మూజ్ జలసంధి నుంచి తరిమికొట్టింది. ఈ విజయం దాదాపు 100 ఏళ్ల పోర్చుగీసు ఆక్రమణకు ముగింపు పలికింది. దీన్ని స్మరించుకుంటూ ఏటా ఏప్రిల్ 30వ తేదీన గల్ఫ్ జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

## అణు ఒప్పందం కుదిరే వరకు దిగ్బంధనం

దోహదపడుతుందన్నారు. గురువారం (ఏప్రిల్ 30) పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా ఈమేరకు ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబాము గించాలని వారు కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు. కాగా దాదా పు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరా న్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు .

## ఇరాన్ విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గాల్సిందే..

**టెహ్రాన్‌పై మళ్లీ సైనిక చర్యకు దిగితే.. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది ● పుతిన్ హెచ్చరిక**

మాస్కో(జనంసాక్షి):ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ గట్టి హెచ్చరికలు చేశారు. టెహ్రాన్‌పై మళ్లీ సైనిక చర్యకు దిగితే.. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని పుతిన్ హెచ్చరించినట్లు క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉషాకోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఇరుదేశాల నేతలు 90 నిమిషాలకు పైగా ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ పొడిగించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని పుతిన్ స్వాగతించారని ఉషాకోవ్ తెలిపారు. ఈ చర్యతో దౌత్య చర్చలకు మార్గం సుగమమవుతుందని వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఒకవేళ అమెరికా- ఇజ్రాయెల్ మరోసారి ఇరాన్‌పై దాడులకు దిగితే.. పశ్చిమాసియాతో సహా మొత్తం అంతర్జాతీయ సమాజం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పుతిన్ హెచ్చరించినట్లు వెల్లడించారు. ఇరాన్‌తో ఉద్రిక్తతలు ముగించేందుకు సాధ్యమయ్యే దౌత్య ప్రయత్నాలకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ పునరుద్ఘాటించారన్నారు. ఉక్రెయిన్ సరిహద్దు వెంబడి పరిస్థితులను గురించి ఇరుదేశాల నేతలు చర్చించుకున్నట్లు తెలిపారు.

**ఇరాన్ యురేనియం విషయంలో పుతిన్ సాయం: ట్రంప్**

పుతిన్‌తో సంభాషణలో ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వల గురించి మాట్లాడుకున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఈ నిల్వలను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ పేర్కొన్నట్లు వెల్లడించారు. అయితే, 'మీరు నాకు సహాయం చేసే ముందు, నేను మీ యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నాను' అని తాను బదులిచ్చినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్వరలో ఉక్రెయిన్ (జుఎతీజీతినివ)లో కాల్పుల విరమణకు అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. రష్యా అధ్యక్షుడు కొద్ది రోజుల కాల్పుల విరమణను సూచించారని, దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడవచ్చని ట్రంప్ తెలిపారు.

## అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం

**అమెరికాకు ఇరాన్ నేవీ కమాండర్ హెచ్చరిక**

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రమవుతోన్నాయి. ఈ క్రమంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడనున్నట్లు తెలిపారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయపెడుతుందని హెచ్చరించారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హర్మూజ్‌ను తెరుస్తామంటూ ఇరాన్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారు. ఈ క్రమంలో ఇరాన్ నుంచి తాజా హెచ్చరికలు వచ్చాయి. 'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని షారమ్ ఇరానీ పేర్కొన్నారు. అయితే, ఆ ఆయుధం ఏంటి అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. హర్మూజ్ ను దిగ్బంధించి.. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, చర్చలకు తీసుకురావాలనే అమెరికా వ్యూహాన్ని ఆయన కొట్టిపారేశారు. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై తమ దళాలు దాదాపు ఏడు క్షిపణులతో విరుచుకుపడ్డాయన్నారు. దీంతో అది కొన్ని రోజులు కార్యకలాపాలను నిర్వహించలేకపోయిందన్నారు. అమెరికా దిగ్బంధనం ఉన్నప్పటికీ.. నౌకలు కొన్ని తమ ఓడరేవుల నుంచి వెళ్తున్నాయన్నారు. మరికొన్ని వాటి గమ్యస్థానాలకు కూడా చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈసందర్భంగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బ కొడతామన్నారు.

## హాస్టళ్లకు,స్కూళ్లకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం



సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అ వకతవకలకు ఆస్కారం ఉండేదన్నా రు. అటు వంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరు గుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాద న్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, ఎఅచిఖీఎఖా కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు.కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

## డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా

**● కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తొద్దు**

**● విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

## శరవేగంగా సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ వర్సిటీ

**- యూనివర్సిటీ పనులు త్వరలో ప్రారంభం**

**- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. "హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమ య్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**చిన్నారుల అక్రమ రవాణా..**

## హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల తనిఖీలు

**హైదరాబాద్(జనంసాక్షి):**

చిన్నారుల అక్రమ రవాణా కేసుకు సంబంధించి గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ కేసులో మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో గుజరాత్ పోలీసులు హైదరాబాద్‌కు వచ్చారు. మురుగన్ గ్యాంగ్‌కు ఇక్కడ ఎవరెవరు సహకరించారనే దానిపై సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్‌లోని కొన్ని ఫెర్టిలిటీ సెంటర్‌లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. కొంత సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. గతేడాది ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఇటుకల బట్టీలో మురుగన్ కార్మికుడిగా పనిచేస్తూ చిన్నారులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు విక్రయించాడు. దీంతో అరెస్టు అయ్యి మూడు నెలల తర్వాత విడుదల అయ్యాడు. గతేడాది వెలుగుచూసిన చైతన్యపురి పీఎస్‌లో నమోదైన కేసులోనూ మురుగన్ పేరు బయటకు వచ్చింది. మురుగన్ భార్య కృష్ణవేణి ఇంకో గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు మురుగన్ గ్యాంగ్‌ను ఇప్పటికే గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలో 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడు దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ సలహాదారుగా హనుమంతరావు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబినెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా ఈ రోజు పదవీ విరమణ చేయనున్న బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

## కవిత పార్టీ పేరు 'తెలంగాణ రక్షణ సేన'

చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణలే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

## అత్యాచార బాధితుల విషయంలో మీ చట్టాలను మార్చాల్సిందే..

ఒక బాలికను బలవంతం చేయలేమని ఇటీవల ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. అలాగే ఆ గర్భాన్ని తొలగించేందుకు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ సుప్రీంలో పిటిషన్ వేసింది. "ఎంతో ఆవేదనతో ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను తీసుకువస్తున్నాం. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు. ఆ మైనర్ తల్లి ఆరోగ్యంపై సుదీర్ఘకాలంలో తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇక్కడొక అవకాశం ఉంది. డెలివరీకి ఇంకా నాలుగు వారాలే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించొచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే" అని ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు వెల్లడించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. "బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆమె ఎంత బాధపడి ఉంటుందో ఊహించుకోండి. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించాలి. ఈ ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వారు తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలి. అందుకే ఈ విషయంలో నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నాం" అని పేర్కొంది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని ఈసందర్భంగా కేంద్రానికి సూచనలు చేసింది.



## పోలీసు చరిత్రలో డీజీపీ శివధర్‌రెడ్డి ఓ గొప్పమైలురాయి

పోలీసింగ్ విధానం అమలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పోలీసింగ్ చేపట్టినట్లు చెప్పారు. డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువ పోలీస్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కొత్త డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్‌కు అభినందనలు తెలిపారు.1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిపించామని తెలిపారు. భవిష్యత్తుకు అనుగుణంగా పోలీస్ శాఖను సిద్ధం చేశామని చెప్పారు. 'నా స్వరాష్ట్రానికి నన్ను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. సీఎం ఎన్నో కీలక బాధ్యతలు అప్పగించారు. నేను ఈ స్థాయికి రాడానికి కారణమైన నా గురువులకు ధన్యవాదాలు. యంగ్ పోలీస్ వల్ల పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. పోలీస్ పవర్ అంటే గౌరవంగా జీవించడం. సమష్టి కృషి వల్లే ఈ స్థాయిలో ఉన్నాను. నా కుటుంబసభ్యులకు ధన్యవాదాలు. మంచి ఛాలెంజింగ్ అధికారి రాబోతున్నారు.. రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్‌కు అభినందనలు' అని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

**విశిష్ట సేవలు అందించారు: సీవీ ఆనంద్**

పదవీ విరమణ పొందుతున్న డీజీపీ శివధర్‌రెడ్డికి, నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. 32 ఏళ్లపాటు శివధర్‌రెడ్డి ప్రజలకు విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో కీలకంగా పని చేశారని, ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల సరెండర్‌లో కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్ విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. "భారీగా మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం, లొంగుబాటు సాధన కోసం కృషి చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటం పోలీసు బాధ్యతగా పేర్కొన్నారు. 2016 నుంచి కలిసి పలువురు అధికారులతో కలిసి పని చేశా. వారి సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని ఆనంద్ పేర్కొన్నారు.

**పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు**

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, తనదైన ముద్ర వేసిన డిజిపి బి. శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు.కార్యక్రమ ఆరంభంలో, శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతి భద్రతల డిజిపి మహేష్ ఎం. భగవత్ కు అప్పగించారు. నూతన డిజిపి గా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు, ఇన్చార్జ్ డీజీపీగా మహేష్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం, వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపిఎస్ అధికారులు, సిబ్బంది కి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు.అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి, అందరికీ చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపిఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని తాగుతుండగా, ఇతర సిబ్బంది డిజిపి పై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే, ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, టిఎస్ఎల్పిఆర్బి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పిఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయకుమార్ లతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా, ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

**దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న 35 మంది ఇన్స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతులు**

దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 35 మంది ఇన్స్పెక్టర్లకు డిఎస్పీలుగా పదోన్నతులు కల్పించామని డిజిపి బి. శివధర్ రెడ్డి తెలిపారు. డిజిపి కార్యాలయంలో గురువారం నాడు పదోన్నతులు పొందిన 35 మంది డిఎస్పి లతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల వల్ల ఇతర ఇతర సమస్యల వల్ల దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించామని తెలియజేశారు. శాంతి భద్రతల అడిషనల్ డీజీపీ మహేష్, భగవత్, అడిషనల్ డిజిపి , పర్సనల్ డిఎస్ చౌహాన్, మల్టీ జోన్ వన్ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, రైల్వే ఐ జి పి రమేష్ నాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి నియామకం

పదవీ విరమణ అనంతరం తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారు(స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ ఫర్ తెలంగాణ)గా శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాతో కూడిన ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు పనిచేయనున్నారు.కాగా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌కు చెందిన శివధర్ రెడ్డి 1994 ఐపీఎస్ బ్యాచ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏఎస్పీగా, అదనపు ఎస్పీగా, ఎస్పీగా పలు జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యతల్ని స్వీకరించారు. అనంతరం పర్సనల్ విభాగంలో ఐజీపీగా నియమితులై అక్కడే అదనపు డీజీపీగా ప్రమోషన్ పొందారు. రోడ్డు భద్రతా విభాగం అదనపు డీజీపీగానూ విధులు నిర్వర్తించారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం మళ్లీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు. గతేడాది అక్టోబరులో ఆయనను డీజీపీగా నియమించారు.

## మళ్లీ భగ్గుమన్న చమురు ధరలు..

**బ్యారెల్ ధర 120 డాలర్లకు పైనే**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్ ఓడరేవులను అమెరికా దిగ్బంధించడంతో చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఇరాన్ అణుఒప్పందం చేసుకునే వరకు హర్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడంతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దీంతో అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 6 శాతం పెరిగి, 120 డాలర్లు దాటింది. 2022 తర్వాత ఇంతగా పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. నేడు ఒక దశలో 125 డాలర్లకు కూడా ఎగబాకింది. అమెరికా హర్మూజ్‌ను దిగ్బంధించడంతో చమురు ధరలు పెరిగాయని ట్రంప్ యంత్రాంగాన్ని ఉద్దేశించి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ వ్యంగ్యంగా స్పందించారు. మూడు రోజుల్లో ఇరాన్ చమురు బావులు పేలుతాయని ఏప్రిల్ 26న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేశారు. "మూడు రోజులు అయింది. అలాంటిది ఏమీ జరగలేదు. దానిని 30 రోజులకు పొడిగించి, ప్రత్యక్ష ప్రసారం చేయండి " అని ఘాలిబఫ్ పోస్టు పెట్టారు.

## తెలంగాణ టెట్ పోటీ పరీక్షపై
# టీ-సాట్ స్పెషల్ లైవ్




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలలో నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పై అవగాహన కల్పించేందుకు టి-సాట్ నెట్వర్క్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. మే నెల ఒకటవ తేది శుక్రవారం ఉదయం 11 గంటలకు మ్యాథమెటిక్స్, ఎన్విరాన్ మెంటల్ స్టడీస్, చైల్డ్ డెవెలప్ మెంట్ అండ్ పెడగాజి, సోషల్ స్టడీస్ వంటి నాలుగు సబ్జెక్టులపై అనుభవం కలిగిన ఉపన్యాసకులచే స్పెషల్ లైవ్ ఏర్పాటు చేశామమని, టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు లైవ్ కార్యక్రమం ద్వార తమ తమ సందేహాలు తీర్చుకుని సమాధానాలు పొందవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నాలుగు విడతలుగా టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ నిర్వహించిందని, ఐదవ సారి జూన్ నెలలో నిర్వహించబోతోం దన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అన్ లైన్ ధరఖాస్తు పూర్తి చేసుకుని ఉన్నందున లైవ్ కార్యక్రమం పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

### ప్రత్యేక డిజిటల్ ప్రసారాలు

జూన్ 15వ తేది నుండి 30వ తేది వరకు జరిగే టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు 90 గంటల డిజిటల్ కంటెంట్ ను మే నెల ఒకటవ తేది నుండి జూన్ 14వ తేది వరకు సుమారు 45 రోజులు 180 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నామని సీఈవో బోదన పల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అరగంట నిడివిగల పాఠ్యాంశాలు విద్య ఛానల్ లో ఉదయం ఎనిమిది నుండి పది గంటల వరకు, అవే పాఠ్యాంశాలు నిపుణ ఛానల్ లో సాయంత్రం ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు పున: ప్రసారమౌతాయని సీఈవో వివరించారు. ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ కంటెంట్ టి-సాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యూట్యూబ్, యాప్ లోనూ అందుబాటులో ఉంటాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

## కళాకారులకు అన్ని విధాలా అండగా ఉంటాం




- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా




హైదరాబాద్ (జనంసాక్షి) : కళాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'ఇంటర్నేషనల్ డాన్స్ డే సెలబ్రేషన్ - 2026' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెగా టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథి గా హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. కార్యక్రమంలో దత్తాత్రేయ, ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ కళలకు సమాజంలో ఎంతో ప్రాధాన్యం ఉందని, యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మంది కళాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు బాబ్జీ, ప్రముఖ న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ, అంతర్జాతీయ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త బొంతల రాధిక పాల్గొని కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపారు. అలాగే కూచిపూడి నృత్య గురువులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో నిర్వహించబడింది. కీర్తి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ బిందు లిమ్మ గారు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కళాభిమానులు హాజరై విజయవంతం చేశారు.

## చిన్నపాటి మందలింపుకే ఆత్మహత్య

- మృత్యువుతో పోరాడుతూ బాలిక మృతి
- టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వర్షిత

ఖమ్మం, ఏప్రిల్ 30 (జనంసాక్షి) : ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరం. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన ఒక విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం చింతగుర్తి గ్రామానికి చెందిన దారెల్లి వర్షిత (16) అనే విద్యార్థిని విషాదకరంగా ప్రాణాలు కోల్పోయింది. ఏప్రిల్ 24వ తేదీన ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందుకు తల్లి మందలించగా, ఆవేశానికి లోనైన వర్షిత ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వర్షిత పరిస్థితి విషమించడంతో ముందుగా ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు ఆమెను బతికించడం కోసం ప్రయత్నాలు చేసిన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వర్షిత బుధవారం విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 530 మార్కులు సాధించి చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## పాసయ్యాడని తెలియకముందే ప్రాణం పోయింది



పాలకుర్తి, ఏప్రిల్ 30(జనంసాక్షి) : పదో తరగతి ఫలితాలు వెలువడ్డాయి. తన పేరు చూసుకుంటే అందరిలానే ఆ అబ్బాయి ఎంతో సంతోషంతో కేరింతలు కొట్టేవాడు.కానీ విధి రాత మరోలా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గూడూరుకు చెందిన కాసోజు ఉపేంద్ర, బ్రహ్మాచారి ద్వితీయ కుమారుడు సాయి సంగీత్ ఈ నెల 25న స్నేహితుడుతో కలిసి ట్రాక్టర్ పై బయటకు వెళ్లి అదుపుతప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తాజాగా వెలువడిన టెన్త్ ఫలితాల్లో సాయి సంగీత్ 426 మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో దానిని. తలుచుకొని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. బ్రతికి ఉంటే తనకు కుమారుడు కళాశాలకు వెళ్లేవాడని ప్రయోజకుడు అయ్యేవాడని కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆగని పంటల ఆహుతి

## ఒకే రోజు 42 ఎకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధం..!

- కన్నీరు మున్నీరవుతున్న రైతులు








కుభీర్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలో అగ్ని ప్రమాదాలు రైతులకు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గురువారం ఒకేరోజు 42.34 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దగ్ధమయ్యాయి. కుభీర్ మండలంలోని దార్ కుభీర్, పార్డి(కె),నిగ్వ గ్రామ శివారులో మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా ఫలితం లేకుండా పోయింది. వడగలుపులతో మంటలు పరుగులు పెట్టాయి. చేతికి వచ్చిన పంటలు కళ్ళ ముందే కాలిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేశామని చేతికి వస్తుందన్న సమయంలో అగ్ని ప్రమాదాలు జరగడంతో అప్పుల ఊబిలో కురుకుపోయామన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించారు. సుమారు రూ.28 లక్షల పంట నష్టం వాటిలినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

### ఫైర్ స్టేషన్ కుబీర్‌లో ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు : ఓం ప్రకాష్ రైతు పార్డి (కే)



అగ్ని ప్రమాదం సంభవించిందని ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేస్తే పంట కాలిపోయిన తర్వాత వచ్చిందని, కుబీర్ లో ఫైర్ స్టేషన్ ఉంటే ఇంత నష్టం జరిగేది కాదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుబీర్ లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

### ట్రాన్స్ఫార్మర్, విద్యుత్ లైన్ల సమీపంలో కుప్పలు వేసుకోవద్దు : విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య




రైతులు విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని ఏఈ ఆదిత్య అన్నారు. రైతులు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల, విద్యుత్ తీగల క్రింద, సమీపంలో పంట కుప్పలను వేయకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈదురు గాలులతో విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి అగ్ని ప్రమాదాలు జరుగే ప్రమాదం ఉంటుందని అన్నారు. ఎక్కడైతే విద్యుత్ అవసరం ఉండదో అధికారులకు సమాచారం ఇస్తే జంపర్ కట్ చేయడం జరుగుతుందని ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

### పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలి : మహేష్ రైతు పార్డి (కే)



ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట కళ్ళ ముందే కాలిపోయింది. అప్పులు తెచ్చి పంటను సాగు చేశాను పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా కనిపించింది. పంట చేతికి వస్తే కష్టాలు తీరుతాయనుకున్న సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి జీవితాన్ని అంధకారంలోకి తోసిందని రైతు ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

## అగ్ని ప్రమాదంలో జొన్న పంట దగ్ధం



బోథ్, ఏప్రిల్ 30(జనంసాక్షి) : అగ్ని ప్రమాదంలో జొన్న పంట దగ్ధం అయిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది..స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సింగం రమణ అనే రైతు తనకున్న 8 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు.పరిసరాల్లో కొందరు పంట కోత కోయగా ఇతడి పంట కోత దశలో ఉంది..చేను పక్కన ఉన్న వ్యక్తి తన చేనులో ఉన్న చెత్తకు నిప్పంటించడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి.దీంతో జొన్న పంట కు వ్యాపించి పంట మొత్తం కాలిపోయింది.అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పడానికి వచ్చిన అప్పటికి దీంతో జొన్న పంటకు వ్యాపించి పంట మొత్తం కాలి బూడిదైయింది.దీంతో చాలా వరకు నష్టం వాటిల్లింది అని రైతు ఆవేదన చెందుతున్నాడు.

## పెంబి అగ్ని ప్రమాదంపై స్పందించిన ముఖ్యమంత్రి

### సీఎంఓ అధికారులకు ఆదేశాలు జారీ



నిర్మల్ ఏప్రిల్30 (జనంసాక్షి) : ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా నిర్మల్ జిల్లా పెంబి మండల కేంద్రంలో గోస్కుల శ్రీను అనే రైతు యొక్క చేతికొచ్చిన 10ఎకరాల మొక్కజొన్న పంట కాలిపోయినా ఘటన పై రైతులు ఆవేదనలో ఉన్నారన్న సమాచారంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెంటనే స్పందించారు. ఆ సంఘటన పూర్తి వివరాలు పరిశీలించి నష్టపోయిన రైతులకు తగిన విధంగా ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంఓ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు, జిల్లా కలెక్టర్ అవసరమైన చర్యలు చేపట్టారు.

## కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

- కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ
- హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం
- సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి

జనగామ, ఏప్రిల్30 (జనంసాక్షి) : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఆస్తిపన్ను తగ్గించేందుకు లంచం

- ఎసిబికి పట్టుబడ్డ కాంట్రాక్ట్ ఉద్యోగి



సంగారెడ్డి, ఏప్రిల్30 (జనంసాక్షి) : జిల్లాలోని సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. ఆస్తి పన్ను తగ్గించడానికి బిల్లు కలెక్టర్ ఒక వ్యక్తి నుంచి రూ.35 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే బాధితుడి నుంచి రూ. 20 వేలు తీసుకున్నాడు. మిగిలిన నగదు కూడా ఇవ్వాలంటూ బాధితుడిపై నిఖిల్ రెడ్డి ఒత్తిడి పెంచాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. గురువారం రూ.15 వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు నిఖిల్ రెడ్డి చిక్కాడు. అనంతరం సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో గురువారం సోదాలు చేపట్టారు. దాదాపు 4 గంటల పాటు ఈ సోదాలు కొనసాగాయి. నిఖిల్ రెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో నిఖిల్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు

## పాత భవనాలు కూలే ప్రమాదముంటే హైడ్రాకు ఫోను చేయండి

- ముప్పునుంచి ముందే జాగ్రత్తపడదామన్న హైడ్రా

హైదరాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) : నివాలతో పాటు.. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న కట్టడాలుంటే 9000113667కు సమాచారం అందించాలని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో కోరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న పురాతన భవనాలను ముందే గుర్తించి భద్రంగా కూల్చేయడం ద్వారా ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటోంది హైడ్రా. బెంగళూరులో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి శివాజీనగర్‌లోని బోర్వింగ్ అండ్ లేడీ కర్జన్ ఆసుపత్రి సమీపంలోని ప్రహరీ కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. మన నగరంలో కూడా పురాతన భవనాలు కూలి ప్రాణ నష్టం సంభవించిన ఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా హైడ్రా ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని పేర్కొంది. ప్రజలు కూడా ఇందులో భాగస్వామ్యమై.. సమాచారం అందివ్వాలని కోరింది. ఏ ప్రాంతంలో ఉంది... ఆ భవనం లేదా కట్టడం ఫొటోతో పాటు.. కరెంటు లొకేషన్‌ను పై నంబరుకు షేర్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హైడ్రా తెలిపింది. వర్షాకాలంలోనే పురాతన భవనాల ముప్పు పొంచి ఉంటుందనే ఆలోచనలో ప్రజలు ఉండొద్దని.. అకాల వర్షాలు పడుతున్న వేళ ఎప్పుడైనా ప్రమాదం ఉంటుందని గ్రహించి సమాచారం ఇవ్వాలని కోరింది. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కట్టడాల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

## మెరుగైన పౌర సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ రూరల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) : తహసిల్దార్ కార్యాలయాల్లో ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం పట్టణంలోని, అర్బన్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రతీ రిజిస్టరు, రికార్డును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఆయా పౌర సేవల ధ్రువీకరణ పత్రాలకు చేసుకున్న దరఖాస్తులు వెంట వెంటనే మంజూరు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ పౌర సేవల ధ్రువీకరణ పత్రాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా ప్రతి రోజు కేంద్ర కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకల్యాణి, తహసిల్దార్ రాజు, కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## మే2న నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, ఏప్రిల్30 (జనంసాక్షి) : నగరంలోని పలు ప్రాంతాలకు మే 2వ తేదీన 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తుతుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ఉన్న 1.36ఎంఎల్ సామర్థ్యం గల పాత బ్యాలెన్సింగ్ ట్యాంక్ శుభ్రపరిచే పనులను మే 2న ఉదయం 6గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు చేపట్టనున్నారు. ఈ పనుల నేపథ్యంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో లోప్రెజర్‌తో నీటిసరఫరా, గోషామహల్, కార్వాన్, గోల్కొండ, కవాడిగూడ, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధుల్లో సరఫరాలో అంతరాయాలు తలెత్తనున్నాయని తెలిపారు. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# శీతల పానీయాలతో జర జాగ్రత్త!



పిల్లల నుంచి పెద్దవారి వరకు కూల్ డ్రింక్స్ ఎంతో ఇష్టపడి తాగుతూ ఉంటారు.నిజానికి ప్రతి రోజు కూల్ డ్రింక్స్ తాగేవారు కూడా ఉంటారు.ఇలా తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు.వేసవికాలంలో చల్లదనం కోసం వీటిని మరింతగా తాగుతారు.ఇందులో ఉండే రసాయనాలు ఎముకల సమస్యలతో పాటు ఎన్నో రకాల దీర్ఘకాలిక వ్యాధులకు దారీ తీస్తుంది. స్నేహితులతో టైమ్ పాస్ కోసం, తిన్నది అరిగించుకోవడం కోసం, చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు.కొందరికి సందర్భం ఏదైనా చల్లగా ఒక డ్రింక్ కడుపులో పడితే ఆ హాయే వేరు. కానీ, శీతల పానీయమే కదా అని అదే పనిగా తాగితే కొంప మునిగినట్టే. శీతల పానీయాలను ఎక్కువగా తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.చూడడానికి రకరకాల రంగుల్లో, చల్లగా ఉంటాయి కూల్ డ్రింక్స్. ఇటీవల కాలంలో వీటిని తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది.స్నేహితులను కలిసినప్పుడు, రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు ఇలా సందర్భం ఏదైనా కూల్ డ్రింక్స్‌ను తాగుతున్నారు. వేసవి వస్తే ఇంకా ఎక్కువగా శీతల పానీయాలు సేవిస్తున్నారు.కానీ కూల్‌డ్రింక్స్‌ను అదే పనిగా తాగడం వల్ల లేనిపోని రోగాల్ని కొని తెచ్చుకున్నట్లే అని వైద్యులు చెబుతున్నారు.అతిగా కూల్ డ్రింక్స్ తాగడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తున్నారు.కూల్ డ్రింక్స్ తాగడం వలన పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువ శాతం సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. లివర్ క్యాన్సర్తో పాటు ప్రెగ్నెన్సీ , గుండెపోటు ఇలాంటి జబ్బులు వచ్చే అవకాశం ఉంది. ఈ శీతల పానీయాలు తాగడం వలన మహిళల్లో ఫ్రై బ్రోస్ , ఫిరోసిస్ వంటి కాలేయంలో మంట వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి ప్రమాదానికి దారితీస్తుంది.సాధారణంగా 250 -300 మిల్లీ లీటర్ల కూల్ డ్రింక్‌లో 150-200 క్యాలరీలు ఉంటాయి. కూల్ డ్రింక్‌లో అధిక ఫ్రక్టోజ్ ఉంటుంది. దీని వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా డయాబెటిస్, బీపీ, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంది. రోజూ కూల్ డ్రింక్స్ తాగే వారిలో అందులో ఉన్న ఫాస్ఫరిక్ యాసిడ్ వల్ల జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. తిన్న ఆహారం జీర్ణం కావడానికి ఉపయోగపడే కాంపనెంట్ హైడ్రాలిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. ఇది మన పొట్టలోనే ఉత్పత్తి అవుతుంది. కూలా డ్రింక్స్ తాగినప్పుడు అందులో ఉండే రసాయనం ఈ యాసిడ్‌తో కలిసినప్పుడు జీవక్రియల మీద విపరీతమైన ప్రభావం పడుతుంది.ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కూల్డ్రింక్ కంపెనీలు ఏటా ఏడు వేల కోట్లు దోచుకుంటున్నాయి. ప్రజల డబ్బుతో హీరోగా, క్రీడాకారులుగా, అవార్డు గ్రహీతలు పెద్దమనుషులుగా చలామణి అవుతున్నవారు కోట్లల్లో డబ్బు తీసుకుని ప్రజా ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసే వాణిజ్య ప్రకటనలు ఇస్తున్నారు. వీరిపై క్రిమినల్ కేసులు బనాయించాల్సిన ప్రభుత్వం వీరిని, అవార్డులతో సత్కరించడం సిగ్గుచేటు. కూల్డ్రింకులు పిహెచ్ శాతం టాయిలెట్ క్లినర్స్ యాసిడ్‌తో సమానంగా ఉంటుంది. ఇది శరీరానికి చాల ప్రమాదకరం. స్థూలకాయం, ఊపిరి తిత్తులు, బి. పి, షుగర్, ఎముకల మెత్తబడి పోవడం, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి. జీర్ణ వ్యవస్థను ధ్వంసం చేసి, రీనల్ ఫైల్యూర్ కు దారి తీస్తుంది. గర్భిణీ స్త్రీలు కూల్డ్రింకులు సేవిస్తే పుట్టబోయే పిల్లలు -- పిండం పై ప్రభావం ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు, కిడ్నీ, లివర్, క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. తరచుగా అధిక మొత్తంలో చక్కెరతో కూడిన శీతల పానీయాలు మన దైనందిన జీవితంలో పాతుకుపోయాయి.శీతల పానీయాలలో అధిక చక్కెర కంటెంట్ ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది మరియు టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది, చక్కెర శీతల పానీయాల అధిక వినియోగం రక్తంలో చక్కెర స్థాయిలు మరియు హృదయనాళ ఆరోగ్యంపై వాటి ప్రభావం కారణంగా రక్తపోటు, కరోనరీ ఆర్టరీ వ్యాధి స్ట్రోక్‌తో సహా గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది.శీతల పానీయాలలో అధిక స్థాయి చక్కెర మరియు కెఫిన్ పురుషులు మరియు స్త్రీలలో పునరుత్పత్తి ఆరోగ్యం మరియు సంతానోత్పత్తిని ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు. సాఫ్ట్ డ్రింక్స్‌లో ఫాస్ఫోరిక్ యాసిడ్ ఉంటుంది, ఇది కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తుంది, ఎముక సాంద్రత నష్టానికి దోహదం చేస్తుంది, ముఖ్యంగా పిల్లలు మరియు పెద్దలలో బోలు ఎముకల వ్యాధి, పగుళ్ల ప్రమాదాన్ని పెంచుతుంది.కూల్ డ్రింక్స్ తాగడం వల్ల బరువు పెరగడం, దంత సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం, డీహైడ్రేషన్, కిడ్నీ సమస్యలు మరియు క్యాన్సర్ వచ్చే ప్రమాదం వంటి అనేక ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు ఉంటాయి.ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శీతల పానీయాల వినియోగాన్ని పరిమితం చేయడం మరియు నీరు, హెర్బల్ టీ లేదా సహజ పండ్ల రసాలు వంటి ఆరోగ్యకరమైన పానీయాల ఎంపికలను ఎంచుకోవడం ఉత్తమం.మజ్జిగ, కొబ్బరినీళ్లు ఇవి అందుబాటులో లేకపోతే ఇంటిలోనే అల్లంతో చేసినటువంటి నీళ్లు,పుదీనా, కొత్తిమీర, టమాట, కరివేపాకు, మునగాకు వంటి ఆకులను ఉపయోగించి తయారు చేసినటువంటి వాటిని తాగితే ఆరోగ్యానికి మంచిది. ఇంకా ఈ వేసవికాలంలో నిమ్మరసంలో ఉప్పు వేసుకుని తాగిన, వేసుకోకుండా తాగిన కూడా ఆరోగ్యానికి మంచిదే. అందుకే ఇంట్లో ఉన్నటువంటి వస్తువులతో మాత్రమే మనం జ్యూస్ చేసుకుని తాగాలి. అలా అయితేనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

## భారత కార్మిక చట్టాల రూప కల్పనలో

# నెహ్రూ, అంబేద్కర్, జగజీవన్ రాం

జవహర్ లాల్ నెహ్రూ భారత దేశ తొలి ప్రధానిగా నవ భారత నిర్మాణంలో బలమైన పునాదులు వేసారు. నెహ్రూ, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, బాబూ జగజీవన్ రాం గారల హయాంలో అనేక కార్మిక సంక్షేమ చట్టాలు రూపొందారు. నెహ్రూ కాలంలో కార్మిక చట్టాల విప్లవం: అంబేద్కర్, జగజ్జీవన్ రామ్, కార్మికోద్యమాల పాత్ర

**పరిచయం:**
భారతదేశ పారిశ్రామికీకరణ కేవలం యంత్రాల స్థాపనతోనే ముగియలేదు; ఆ యంత్రాలను నడిపే 'శ్రమశక్తి'కి గౌరవాన్ని, భద్రతను కల్పించడంలో నెహ్రూ యుగం ఒక స్వర్ణయుగంగా నిలిచింది. 1947 నుండి 1964 మధ్య కాలంలో రూపొందిన కార్మిక చట్టాలు నేటికీ భారత కార్మిక రంగానికి రక్షణ కవచాలుగా ఉన్నాయి. ఈ వ్యవస్థా నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దార్శనికత, బాబు జగజ్జీవన్ రామ్ కార్యదక్షత మరియు వివిధ కార్మిక సంఘాల పోరాటాలు పెనవేసుకుపోయి ఉన్నాయి.

**1. పునాది వేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్**
నెహ్రూ తొలి మంత్రివర్గంలో న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ, అంతకుముందే వైస్రాయ్ కౌన్సిల్‌లో కార్మిక సభ్యునిగా (1942-46) అంబేద్కర్ కార్మిక చట్టాలకు గట్టి పునాది వేశారు. పని గంటల తగ్గింపు: బ్రిటీష్ కాలంలో ఉన్న 12 గంటల పనిదినాన్ని 8 గంటలకు తగ్గించాలని పట్టుబట్టి సాధించింది అంబేద్కరే. మహిళా కార్మికుల రక్షణ: గనుల్లో మహిళలు పనిచేయడాన్ని నిషేధించడం, 'ప్రసూతి సౌకర్యాల చట్టం' (Maternity Benefit Act) కోసం ఆయన వేసిన పునాదులే నెహ్రూ హయాంలో పటిష్టమైన చట్టాలయ్యాయి.

**2. బాబు జగజ్జీవన్ రామ్ - కార్మిక చట్టాల నిర్మాత**
నెహ్రూ తొలి మంత్రివర్గంలో సుదీర్ఘకాలం కార్మిక శాఖ మంత్రిగా (1947-1952) పనిచేసిన జగజ్జీవన్ రామ్, అంబేద్కరు ఆశయాలను చట్ట రూపంలోకి తెచ్చారు.
**ఫ్యాక్టరీల చట్టం, 1948** (Factories Act): ఇది ఒక విప్లవాత్మక చట్టం. పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత మరియు సెలవుల గురించి స్పష్టమైన నిబంధనలను ఇది నిర్దేశించింది.
కనీస వేతనాల చట్టం, 1948 (Minimum Wages Act): కార్మికుడికి జీవన భృతికి సరిపడా కనీస వేతనం ఇవ్వడం యజమాని బాధ్యత అని చట్టబద్ధం చేశారు.
ESI **చట్టం, 1948**: కార్మికులకు అనారోగ్యం కలిగినప్పుడు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సహాయం అందించే 'ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్' పథకం ఆసియాలోనే మొదటిది.



3. కార్మిక సంఘాల పాత్ర మరియు ఉద్యమాలు:
నెహ్రూ కాలంలో కార్మిక సంఘాలు కేవలం డిమాండ్లకే పరిమితం కాకుండా, చట్టాల రూపకల్పనలో కీలక ఒత్తిడి వర్గాలుగా పనిచేశాయి.
AITUC (All India Trade Union Congress): కమ్యూనిస్టు భావజాలంతో ఉన్న ఈ సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్మికుల హక్కుల కోసం, వేతన సవరణ కోసం అనేక సమ్మెలు నిర్వహించింది.
INTUC (Indian National Trade Union Congress - 1947): నెహ్రూ మరియు సర్దార్ పటేల్ ప్రోత్సాహంతో ఏర్పడిన ఈ సంఘం, యజమానులకు-కార్మికులకు మధ్య 'సయోధ్య' (Arbitration) ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చింది.
ఎమీూ (Hind Mazdoor Sabha - 1948): సోషలిస్టు నాయకులు అశోక్ మెహతా వంటి వారి నేతృత్వంలో ఏర్పడి, స్వతంత్ర కార్మిక వాదాన్ని వినిపించింది.
**కీలక ఉద్యమం:** 1960లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భారీ సమ్మె జరిగింది. వేతనాల పెంపు కోసం జరిగిన ఈ పోరాటం తర్వాత 'రెండవ పే కమిషన్' సిఫార్సుల అమలు వేగవంతమైంది.
**4. పారిశ్రామిక వివాదాల చట్టం, 1947** :
కార్మికులను అకారణంగా తొలగించకుండా (Lay-off and Retrenchment), యజమానుల ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ చట్టాన్ని నెహ్రూ ప్రభుత్వం తీసుకువచ్చింది. కార్మిక కోర్టులు, ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు ఇది మార్గం సుగమం చేసింది.
5. కీలక కోర్టు తీర్పులు - న్యాయ రక్షణ నెహ్రూ హయాంలో సుప్రీంకోర్టు కూడా కార్మిక హక్కుల పక్షాన నిలిచింది. Crown Aluminium Works Case (1958): "ఆర్థిక ఇబ్బందుల నెపంతో కార్మికులకు కనీస వేతనం కంటే తక్కువ ఇవ్వడానికి యజమానికి హక్కు లేదు. కనీస వేతనం ఇవ్వలేని పరిశ్రమకు కొనసాగే హక్కు లేదు" అని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది.
**Standard Vacuum Refining Co. Case (1961):** బోనస్ అనేది యజమాని ఇచ్చే విరాళం కాదు, అది కార్మికుడి హక్కు అని ఈ తీర్పు ద్వారా స్పష్టమైంది.
నెహ్రూ యుగం భారత కార్మికుడికి 'బానిసత్వం' నుండి 'భాగస్వామ్యం' వైపు ప్రయాణాన్ని నేర్పింది. అంబేద్కర్ దార్శనికత, జగజ్జీవన్ రామ్ పట్టుదల, కార్మిక సంఘాల నిరంతర పోరాటం వల్లనే నేడు మనం అనుభవిస్తున్న 8 గంటల పనిదినం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు లభించాయి.
న్యాయ సమీక్ష నుండి రక్షణ కోసం తొమ్మిదవ షెడ్యూల్ నిర్మాణం : నెహ్రూ కాలంలో రూపొందించిన విప్లవాత్మకమైన కార్మిక, కర్షక సంక్షేమ చట్టాలకు కోర్టుల నుండి ఆటంకాలు ఎదురైనప్పుడు, ప్రభుత్వం రాజ్యాంగపరమైన పరిష్కారాలను వెతికింది. ముఖ్యంగా భూసంస్కరణలు మరియు జమీందారీ రద్దు చట్టాలను కోర్టులు కొట్టివేసినప్పుడు, 1951లో నెహ్రూ ప్రభుత్వం మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా తొమ్మిదవ షెడ్యూల్‌ను (Ninth Schedule) ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31బీ ప్రకారం, ఈ షెడ్యూల్‌లో చేర్చిన ఏ చట్టమైనా 'న్యాయ సమీక్ష' (జీబఎఱఒఱఝశ్రీ =వజఱవఎ) పరిధిలోకి రాదు, అంటే కోర్టులు ఆ చట్టాలను ప్రాథమిక హక్కుల ఉల్లంఘన నెపంతో కొట్టివేయలేవు.
తొలుత 13 భూసంస్కరణ చట్టాలతో ప్రారంభమైన ఈ షెడ్యూల్, కాలక్రమేణా అనేక ఇతర ప్రజా ప్రయోజన చట్టాలకు రక్షణ కవచంగా మారింది. కార్మికుల కనీస వేతనాలు, పారిశ్రామిక వివాదాల పరిష్కారం మరియు రైతుల భూ హక్కులకు సంబంధించిన కీలక చట్టాలను కోర్టులు అడ్డుకోకుండా ఈ షెడ్యూల్ ద్వారా నెహ్రూ ప్రభుత్వం చట్టబద్ధమైన భద్రత కల్పించింది. అణగారిన వర్గాల కోసం ప్రభుత్వం చేసే సామాజిక న్యాయ పోరాటంలో న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటు సార్వభౌమాధికారమే సుస్థిరమని నిరూపించడంలో ఈ షెడ్యూల్ ఒక బలమైన ఆయుధంగా నిలిచింది. మే డే సందర్భంగా ఈ చట్టాలను కాపాడుకోవడమే వారికి మనమిచ్చే నివాళి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## పరుల వశమై...!!

**సడ్లపల్లె**



భూ మండలంలో
వీడొక
అనుకరణల పుటక.
ఆత్మ విశ్వాసం లేని
కాల జ్ఞానం ఎరుగని
మురుగుడు నీటి
బుడగ.
ఏ మతం బుక్కో
కులం కార్డో
ప్రాంతాల
కరపత్రమో
భాషల బ్యానరో
అందిస్తే చేతి కెవరో
దాన్నే తగిలించుకొని
ఆలోచన్ల నరం
ఆపుచేసి
తలను తీసి ఆ
తట్టు(తాకట్టు) పెట్టి
పరుల వశమై
ఇతర్ల వస్తువై
తనకు తాను లుప్తమై
తరించి పోయే
తందాన తానగాడు!!

## మీ ఇద్దరూ!

బ్రతకటంకోసం
రాజకీయాలు!
రాజకీయాలకోసం
బ్రతుకులు కాదు!
నీ రాజకీయాలతో
ప్రజల జీవితాలను
సంక్షోభానికి
గురిచేయకు!
నీ రాజకీయాలన్నీ
స్వార్థపూరితాలే!
పెద్దనోట్లరద్దునుండి
మహిళాబిల్లువరకు!
కలిసిమెలిసున్న
భారతీయుల్లో
మతాన్ని రెచ్చగొట్టి
ఏం సాధిస్తావ్?
మతంపేరుతో'నువ్వు'
యుద్ధంపేరుతో'వాళ్లు'
ప్రపంచాన్ని -సర్వ
నాశనం చేస్తున్నారు!
ఎటుచూసిన'స్వార్థం'
నీ రాజకీయం!
ఎటుచూసిన -శవాల
గుట్టలు వాళ్ల యుద్ధం!
ప్రపంచానికి'అన్నం'
పెట్టకపోయినా
చంపే హక్కు
మీకు ఎక్కడిది?
సామ్రాజ్యవాద
సంక్షోభానికి
ప్రత్యక్ష నిదర్శనం
మతము యుద్ధము!
సామ్రాజ్యవాదుల
భోగభాగ్యాలకు
ప్రపంచాన్ని
బలిచేస్తారా?
నియంతలెందరినో
మరణంమింగేసింది!
మీ ఇద్దరూ!
శాశ్వతం కాదు!


-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## "మేడే"ను పురస్కరించుకుని

# కార్మిక హక్కులపై అంబేడ్కర్ ముద్ర

పెట్టుబడిదారీ వ్యవస్థలో తమ శరీరాన్ని నమ్ముకొని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్రామికవర్గమే కార్మికులు. పారిశ్రామీకరణతో మొదలైన పెట్టుబడిదారీ వ్యవస్థ ,భూస్వామ్య విధానంలో కార్మికుల హక్కులు నిరాకరించబడ్డాయి. శ్రమదోపిడి మొదలైనది. అప్పుడు కార్మికులు తమ హక్కుల సాధనకై సంఘటితంగా పోరాటం చేసిన రోజే "మే డే". దీన్నే అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పిలుస్తారు. ఈరోజు కార్మికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి తమ హక్కులను సాధించుకొన్న రోజు. భారతదేశంలో చారిత్రకంగా కుల వ్యవస్థ, అంటరానితనం వంటి అనాగరిక శిక్షలు "బానిస" వ్యవస్థను సృష్టించాయి. బానిసలుగా బీసీ ఎస్సీ ఎస్టీల తమ రక్త మాంసాలను దారపోసి ఈ దేశ నిర్మాణంలో భాగమయ్యారు. అయినా వీరికి ఎలాంటి గుర్తింపు లేదు. బ్రిటిష్ వారి రాకతో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాటంతో శ్రమ దోపిడికి గురైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు "కార్మిక" వర్గంగా గుర్తించబడినారు. కార్మికుల్లో చైతన్యం పెరిగింది. ఆ చైతన్యానికి అగ్రవర్ణ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు నాయకత్వం వహిస్తూ 1920లో ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేశారు. భారతదేశంలో 1923 నుంచి మే డేను పాటించడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా "కార్మిక వర్గం" అనే భావన కేవలం ఆర్థిక వర్గీకరణగా ఉంటే, అది భారతదేశంలో కుల వ్యవస్థతో గాఢంగా ముడిపడి ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూలీ పనులు, శారీరక శ్రమ ఆధారిత వృత్తులు ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల చేతిలోనే ఉన్నాయి. చారిత్రకంగా వృత్తులు కులాధారంగా విభజించబడటం వల్ల, ఈ వర్గాలు శ్రమతో కూడిన పనులకే పరిమితమయ్యాయి. వీరికి భూమి, మూలధనం, విద్య వంటి వనరులపై నియంత్రణ లేకపోవడం వల్ల ఇవి కార్మిక వర్గంగా స్థిరపడ్డాయి.

**కార్మికులంటేనే బిసి, ఎస్సీ ఎస్టీలు**
ఈ దేశంలో కార్మికులు అంటే ప్రధానంగా చెప్పుకోవాల్సిన వారు బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలే. కానీ కార్మికుల పేరుతో జరిగే అనేక ఉద్యమాల్లో అగ్రకులాలే నాయకత్వం వహిస్తున్నారు. నేడు కార్మికుల పేరుతో పోరాటం చేస్తున్న నాయకత్వం ఎవరిది? అనేది ప్రధానమైన అంశం. అనేక కార్మిక సంఘాలు, యూనియన్లు అగ్రకులాల ఆధిపత్యంలో ఉన్నాయి. అవి కార్మికుల సమస్యలను ప్రస్తావించినా, వాస్తవ నిర్ణయాల్లో పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వ విధానాలు ఉంటాయి. లిబరలైజేషన్ తర్వాత కార్మిక చట్టాల్లో సడలింపులు పెరిగాయి. కాంట్రాక్ట్ వ్యవస్థ, అసంఘటిత రంగం విస్తరణ వల్ల కార్మిక భద్రత తగ్గింది. భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్మిక సమస్యలను ప్రస్తావించిన మొట్టమొదటి వ్యక్తి. ఆయన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో లేబర్ సభ్యుడిగా పనిచేశారు. భారతదేశంలో కార్మికులకు 8 గంటల పని దినం అమలు చేయడంలో కీలక పాత్ర పోషించా రు. కనీస వేతనాలు, కార్మిక సంక్షేమం, మహిళా కార్మిక హక్కులపై చట్టపరమైన మార్పులు తీసుకొచ్చారు. కుల వ్యవస్థను ధ్వంసం చేయకుండా కార్మిక విముక్తి సాధ్యం కాదు" అనే భావనను అంబేద్కర్ ఆనాడే స్పష్టంగా చెప్పారు. అందుకే అంబేద్కర్ కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం కోసం 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ' ని ఏర్పాటు చేశారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా స్థాపించిన మొదటి పార్టీ ఇదీ. కార్మిక సమస్యలను రాజకీయంగా ప్రస్తావించడం జరిగింది. ఈ పార్టీ బాంబే లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికల్లో(1937) మంచి విజయాన్ని సాధించింది. కార్మికుల పక్షాన కొట్లాడడం జరిగింది. అంబేద్కర్ కృషి ఫలితంగా రాజ్యాంగంలోనీ ఆదేశ సూత్రాల్లో కనీస వేతన చట్టం, కార్మిక బీమా చట్టము, మహిళ ఉద్యోగులకు ప్రత్యేక చట్టం, బాల కార్మిక వ్యవస్థ రద్దు, సమాన పనికి సమాన వేతనం వంటివి చేర్చబడ్డవి.



**కార్మిక విముక్తికి రాజకీయ పోరాటం.**
1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల తర్వాత, లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ విధానాలు దేశ ఆర్థిక దిశను పూర్తిగా మార్చాయి. ప్రభుత్వ రంగాన్ని తగ్గించి, ప్రైవేట్ రంగానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలు విస్తరించాయి. ప్రభుత్వం పరిపాలనా భారాన్ని, ఖర్చులను తగ్గించడం కోసం కొన్ని సేవలను ఆధిపత్య కులాలకు సంబంధించి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. నేడు క్లీనింగ్, భద్రత, డేటా ఎంట్రీ, ఆరోగ్యం, విద్య వంటి అనేక రంగాల్లో ఔట్‌సోర్సింగ్ అమలులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో, పథకాల నిర్వహణలో తాత్కాలిక ఉద్యోగులను నియమిస్తున్నారు. అత్యధికులు బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల వారే. వీరి నియామకాల్లో రిజర్వేషన్ పాటించక రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారు. మధ్యవర్తుల పెత్తనం, ఏజెన్సీల ద్వారా వేతనాలు ఇవ్వడం వల్ల జీతంలో కోతలు పెరుగుతున్నాయి. అదనపు పనిభారం పెరిగింది. ఉద్యోగ భద్రత కూడా కొరవడింది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు న్యాయం కోసం ఇందిరా పార్క్ వేదికగా ధర్నాకు దిగారు. దీనికి బీసీ ఎస్సీ ఎస్టీ జాక్ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుగా నిలవడం జరిగింది. దీంతో వెంటనే ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఇంకా సంఘటిత, అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఇన్సూరెన్స్ సౌకర్యం, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ భద్రత కొరవడింది. నేటి పెట్టుబడిదారి విధానంలో బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వాలు ఏకమై వనరుల దోపిడీ జరుగుతుంది. మరోవైపు బహుళ జాతి కంపెనీల వ్యాపారాన్ని దేశీయంగా అగ్రకులాలు ఆక్రమించుకొని కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. దీంతో కార్మికుల శ్రమ దోపిడికి గురవుతున్నారు. కావున కార్మిక వర్గ శక్తులు ఏకమై అంబేద్కర్ లాగా రాజకీయంగా ప్రతిఘటన పోరాటం చేయాలి. ఇదే బీసీ ఎస్సీ ఎస్టీ కార్మిక విముక్తికి పరిష్కార మార్గం.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# మానవుల దుఃఖ విముక్తి ప్రదాత గౌతమ బుద్ధుడు



విశ్వ మానవాళి నాగరికత పరిణామంలో అద్భుతమైన ఘట్టం గౌతమ బుద్ధుడి జననం. ఎందుకంటే మానవ చరిత్ర గురించి మాట్లాడుకోవాల్సి వస్తే బుద్ధుడికి ముందు బుద్ధుడి తర్వాత చర్చించుకోవాల్సిన అనివార్య చారిత్రక సత్యం దాగి ఉన్నది. బుద్ధుడు ప్రపంచానికి శాంతి, అహింస మరియు కరుణ అనే సందేశాలను అందించిన గొప్ప జ్ఞాని. బౌద్ధమతాన్ని స్థాపించిన ఆయనను "ఆసియా జ్యోతి" అని పిలుస్తారు. ఆయన జీవితం మరియు బోధనల గురించి ముఖ్యమైన అంశాలు ఇక్కడ ఉన్నాయి:

బుద్ధుడి జననం మరియు బాల్యం
గౌతమ బుద్ధుడు క్రీ.పూ. 563 ప్రాంతంలో నేపాల్‌లోని(అఖండ భారత్) లుంబినీ వనంలో జన్మించారు. ఆయన అసలు పేరు సిద్ధార్థుడు. తండ్రి శుద్ధోధనుడు శాక్య వంశపు రాజు, తల్లి మాయాదేవి. సిద్ధార్థుడు పుట్టిన కొద్ది రోజులకే తల్లి మరణించడంతో, పినతల్లి గౌతమి ఆయనను పెంచి పెద్ద చేసింది. అందుకే ఆయనకు 'గౌతముడు' అనే పేరు వచ్చింది.రాజభోగాల మధ్య పెరుగుతున్న సిద్ధార్థుడిని బయటి ప్రపంచంలోని దుఃఖం తాకకుండా తండ్రి జాగ్రత్త పడ్డారు. కానీ ఒకరోజు నగరం బయటకు వెళ్ళినప్పుడు ఆయన నాలుగు దృశ్యాలను చూశారు. అవి 1.ఒక ముసలివాడు 2.ఒక రోగి 3.ఒక శవం 4.ఒక ప్రశాంతమైన సన్యాసి ఈ దృశ్యాలు సిద్ధార్థుడిని తీవ్రంగా కలిచివేశాయి. అయితే సిద్ధార్థుడికి యుక్త వయసు వచ్చే వరకి కూడా మానవ జీవితంలో ముసలితనం, రోగిగా మారడం, మరణించడం, సన్యాసులుగా మారడం అనేటి అంశాల పట్ల అవగాహన లేకుండా రాజభోగాలు అనుభవించాడు. మానవ జీవితంలో అంతిమంగా ముసలితనం, వ్యాధి మరియు మరణం తప్పవని గ్రహించి, శాశ్వతమైన ఆనందం కోసం తన 29 వ ఏట భార్య యశోధరను, కుమారుడు రాహులుని మరియు రాజ్యాన్ని వదిలి, తన రథసారధి అయినా చేన్నడు సహాయంతో అడవికి వెళ్ళిపోయారు.దీనినే మహాభినిష్క్రమణం అంటారు.

**జ్ఞానోదయం**
సిద్ధార్థుడు బుద్ధుడిగా మారకముందు తనలో ఉన్న అనేక ప్రాపంచిక ప్రశ్నలకి ఎంతోమంది పండితులని, సన్యాసులతో చర్చలు, వాదోపవాదములు చేసి సంతృప్తి పడకుండా అనేక రోజుల కఠిన తపస్సు మరియు ధ్యానం తర్వాత, తన 35 వ ఏట బీహార్‌లోని గయలో ఉన్న ఒక నిరంజన నది తీరాన ఉన్న రావి చెట్టు (బోధి వృక్షం) కింద సిద్ధార్థుడికి జ్ఞానోదయం కలిగింది. అప్పటి నుండి ఆయన 'బుద్ధుడు' (జ్ఞాని) గా పిలవబడ్డారు.

**బుద్ధుడి ముఖ్య బోధనలు (ధర్మం)**
బుద్ధుడు తన మొదటి బోధనను వారణాసి సమీపంలోని సారనాథ్‌లో ఐదుగురు శిష్యులకు అందించారు. దీనిని 'ధర్మచక్ర పరివర్తన' అంటారు. ఆయన బోధనల్లో ముఖ్యమైనవి. ప్రపంచమంతా దుఃఖమయం దుఃఖానికి కారణం మానవాళి కోరికలు ఆ కోరికలను అంతమొందించుకుంటే మానవ జీవితం దుఃఖ రహితంగా ఉంటుందని, అందుకు అష్టంగా మార్గాలు పాటించాలని ప్రపంచానికి హితబోధ చేశాడు బుద్ధుడు.ఆ అష్టాంగ మార్గాలు ఏమిటనగా 1.సరైన దృష్టి: చూసేటి ఏ అంశాన్ని అయినా చెడు ఉద్దేశంతో కాకుండా మంచి ఉద్దేశంతో దృష్టిని సరికరించాలని చెప్పాడు. 2.సరైన సంకల్పం: చేసే ఏ పని అయినా మంచి దృఢ సంకల్పంతో చేయాలని చెప్పాడు. 3.సరైన మాట: మనిషిగా నోటి నుండి వచ్చే ప్రతి మాట ఇతరులను నొప్పించకుండా మెప్పించేలాగా ఉండాలని చెప్పాడు. 4.సరైన కర్మ: చేసే ఏ పని అయినా మంచి ఉద్దేశంతో చేయడం ద్వారా ఆత్మసంతృప్తి ఉంటుందని చెప్పాడు. 5.సరైన జీవనం: మానవులుగా ఉన్నతమైన విలువలతో జీవితాన్ని గడపడమే ధర్మమని బోధించాడు. 6.సరైన ప్రయత్నం: చేసే ఏ పని అయినా దృఢ సంకల్పంతో ప్రయత్నిస్తూ విజయాన్ని సాధించేలా కృషి ఉండాలని హితబోధ చేశాడు. 7.సరైన ఆలోచన: మానవ ఆలోచనలు మంచిగా ఉంటేనే దుఃఖ రహిత గడపచ్చని చెప్పాడు. 8. సరైన ధ్యానం: మనిషిగా చేసేటి ధ్యానం మంచి కృషితో ఉంటేనే మంచి ఫలితాలు సాధిస్తూ దుఃఖాన్ని అనుభవించకుండా సుఖాన్ని అనుభవించడం సాధ్యమని, ఈ ఎనిమిది అష్టంగా మార్గ విలువలని ప్రపంచ మానవాళి దుఃఖ నిర్మూలనకి బుద్ధుడు దిశా నిర్దేశం చేశారు. అయితే నాడు గౌతమ బుద్ధుడు మానవ జీవితంలో దుఃఖం లేకుండా ఉండడానికి విపరీతమైన అంతులేని అదుపులేని కోరికలు కలిగి ఉండకూడదు అని క్షత్రియలకు హితబోధ చేయగా, నేడు ఆధునిక ప్రపంచంలో అగ్రకులాల చేత సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా పీడిత కులాలైన 90% బీసీ ఎస్సీ ఎస్టీలు బ్రతకానికి ఉండాల్సిన సహజమైన కోరికలు కూడా కలిగి ఉండకుండా ఆధునిక ప్రపంచంలో కూడా అంతులేని దుఃఖాన్ని అనుభవిస్తున్నారు, కారణం ఏంటంటే మానవుడిగా ఎలాంటి జీవితం గడపాలో కూడా సంపూర్ణమైన అవగాహన లేక అయోమయంలో ప్రతిరోజు తమ దైనందిన జీవితాల్లో దుఃఖాన్ని అనుభవిస్తున్నారు మెజార్టీ ఉన్న బహుజన కులాలు.

బుద్ధుడి మహా పరి నిర్యాణం
బుద్ధుడు తన 80వ ఏట ఉత్తరప్రదేశ్‌లోని కుశీనగరంలో దేహాన్ని చాలించారు. దీనిని బౌద్ధులు 'మహా పరినిర్యాణం' అని పిలుస్తారు.బుద్ధుడి బోధనలు కుల, మత విభేదాలకు అతీతంగా మానవత్వాన్ని చాటిచెప్పాయి. అహింస, సమానత్వం మరియు శాంతిని కోరుకునే వారందరికీ ఆయన మార్గం నేటికీ ఆదర్శప్రాయం. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు నేటికీ ఆయన చూపిన శాంతి మార్గంలో నడుస్తున్నారు. బుద్ధుడు తీసుకొచ్చిన బుద్ధిజం మతంగా చూడడం కంటే, మానవాళికి గొప్ప జీవన విధానాన్ని అందించే ధర్మంగా చూడాలి. భారతీయ ప్రజల దౌర్భాగ్యం ఏంటంటే బుద్ధుడు పుట్టిన భారతదేశంలో బుద్ధ విలువలు కనుమరుగు అవుతుండగా ప్రపంచ మానవ అభివృద్ధి సూచీక లో మానవ అభివృద్ధి నాగరికతలో ప్రథమ స్థానంలో ఉన్న చైనా జపాన్ థాయిలాండ్ మయన్మార్ శ్రీలంక మలేషియా సింగపూర్ తదితర దేశాలలో బుద్ధుడి విలువలతో ఆయా దేశాలు పౌరులకి సంపూర్ణమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రథమ స్థానంలో ఉన్నాయి. కానీ భారతదేశ చరిత్ర గురించి చెప్పుకోవాల్సి వస్తే బుద్ధుడి విలువలకి మనువాద విలువలను పాటించే ఆనాటి బ్రాహ్మణ వాదానికి మధ్య జరిగిన సంఘర్షణనే భారతదేశ చరిత్రగా అనేకమంది చరిత్రకారులు, మేధావులు చెప్తుంటారు. నాడు బుద్ధుడు ప్రాచీన భారతదేశంలో మనువాద అసమానత సిద్ధాంతాన్ని పాటించే బ్రాహ్మణ వాదాన్ని ఖండిస్తూ, మానవ జీవితానికి స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలని సృష్టించి ప్రపంచానికి ఆదర్శవంతమైన విలువలని పరిచయం చేశాడు. ఆనాటి ప్రాచీన భారతదేశంలో అనేకమంది మనువాద విలువలను పాటించే బ్రాహ్మణుల్ని సైతం ఎదుర్కొని తన జ్ఞానంతో ముగ్ధులను చేసి బ్రాహ్మణ పండితులను సైతం బుద్ధిజాన్ని పాటించేలాగా జ్ఞాన బోధ చేశాడు. బుద్ధుడు తాను బ్రాహ్మణ పండితులతో, సామాన్య ప్రజలతో చర్చించేటప్పుడు తాను చెప్పింది సత్యంగా నమ్మకుండా తమ పంచభూతాల ద్వారా అనుభవించి సత్యాన్ని సత్యంగా అసత్యాన్ని అసత్యంగా చూడమని బుద్ధుడు బోధించాడు. బుద్ధుడు కనిపెట్టిన విపస్యన ధ్యానాన్ని తమ దైనందిన జీవితాల్లో అమలుపరిస్తూ ప్రపంచ మానవులు దుఃఖ పూరితమైన జీవితాన్ని అనుభవించకుండా బుద్ధుడు చెప్పిన విలువలతో సంతోషకరమైన జీవితాన్ని గడపగలుగుతున్నారు. అంతిమంగా మానవ నాగరికత ఎంత అభివృద్ధి చెందిన బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి అనేటి సూత్రాల ప్రపంచ మానవాళి జీవనం విధానం కొనసాగినప్పుడే విశ్వ మానవాళి మనుగడకు శ్రేయస్కరం అనేటి చారిత్రక సత్యాన్ని మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.



బి పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
బి9553041549

# నేడు శిల్పారామంలో మెగా జాబ్ మేళా

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర యువజన, క్రీడల శాఖ,పరిశ్రమలు, ఐ.టి.మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం లో మొట్ట మొదటి సారిగా మెగా జాబ్ మేళాను మే 1వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులతో కలిసి శిల్పారామంను సందర్శించి మెగా జాబ్ మేకా నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ మే 1న నిర్వహించబోయే జాబ్ మేళా, తెలంగాణలోనే తొలి మెగా జాబ్ మేళా అని తెలిపారు. మెగా జాబ్ మేళాలో సుమారు 100 ఐ టి., నాన్ ఐ.టి.,ఫార్మా ,ఇతర కంపెనీలు పాల్గొని విద్య,అర్హతలు ననుసరించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తారని,అదే రోజు సాయంత్రం ఎంపికైన అభ్యర్థులకు నియామక ఆఫర్ లెటర్ లు అంద చేస్తారని తెలిపారు10 వ తరగతి పెయిల్ అయిన విద్యార్థుల నుండి బి.టెక్.,ఫార్మా,ఇంటర్,డిగ్రీ,పి.జి.చదివిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా యువత మెగా జాబ్ మేళా లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు ఇందులో 37 స్థానిక కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. అభ్యర్థులు ఞ=కోడ్ ద్వారా మొబైల్ నుండి రిజిస్ట్రేషన్ చేసుకొని నేరుగా పాల్గొన వచ్చని తెలిపారు. శిల్పారామంలో 30 రిజిస్ట్రేషన్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నట్లు,రిజిస్ట్రేషన్ డెస్క్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని అభ్యర్థులు వారి విద్యా అర్హతలు బట్టి ఏర్పాటు చేసిన 100 కంపెనీల లో స్టాల్ లలో వారికి ఇష్టమైన కంపెనీ లో ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చని తెలిపారు. కంపెనీలు స్టాల్ నెంబర్ లు కేటాయించి వాటి వివరాలు ప్లెక్సీ శ్రీఖ ద్వారా ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజున నియామక ఆఫర్ లెటర్ అందచేయడం జరుగుతుందని తెలిపారుశిల్పారామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు చెందిన సుమారు 10,000 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. జాబ్ మేళా ఏర్పాట్లపై రెవెన్యూ,మున్సిపల్, యువజన సర్వీసులు, క్రీడలు, పరిశ్రమలు, పంచాయతీ శాఖ, విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి,, ఉపాధి కల్పన,వైద్య శాఖ,విద్యా శాఖ,సంక్షేమ శాఖల అధికారులకు జాబ్ మేళా ఏర్పాట్లకు సంబంధించి చెవలసిన పనులు, కార్యక్రమాలపై సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ లు ఏర్పాటు పై రద్దే లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు.ఞ= కోడ్ ప్లెక్సీలు శిల్పారామంలో పలు చోట్ల ఏర్పాటుకు ఆదేశాలు జారే చేశారు.వేసవి కనుక టెంట్లు, కుర్చీలు, టేబుళ్లు, త్రాగు నీటి వసతి, మరుగుదొడ్లు, వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే స్టేజీ ఏర్పాటు, స్టాల్ లలో కావలసిన ఏర్పాట్లను రెవెన్యూ మరియు జిల్లా విద్యా శాఖ అధికారులు చూసుకోవాలని అన్నారు. మేళా లో సుమారు 103 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.శిల్పారామంలో వి. ఐ పి పార్కింగ్,జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ట్యాంక్ బండ్ పై టూ వీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ కు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ శాఖ పంచాయతీ కార్యదర్శులను, ఇతర సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని, జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థుల నమోదు ప్రక్రియను వీరి సహకారంతో వేగవంతం చేయాలని సూచించారు. సూచించారు. బీ×జ అధికారులను సరైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, వైద్య శాఖను మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,అదనపు ఎస్.పి. ఎన్.బి.రత్నం, పరిశ్రమల శాఖ జి.ఎం యాదయ్య,రాష్ట్ర యువజన,క్రీడల శాఖ డి.డి.శ్రీనివాస్,డి.ఎం.హెచ్ ఓ డా. కె .కృష్ణ,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మియాపూర్‌లో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** జల్సాల కోలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించడానికి ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నేరస్తుడిని మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ మేరకు కూకట్పల్లి ఏసిపి వివరాలను తెలియజేస్తూ జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధి రామ్ రెడ్డి నగర్ లో నివాసం ఉంటే కల్లూరి లక్ష్మణ్(39) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఈ నేపథ్యంలో జీడిమెట్ల, కూకట్పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాలలో ఎలక్ట్రిషన్ గా పనులను చేస్తూ అతను చూసి సదరు ఇండ్లలోని విద్యుత్ ఉపకరణాలను దొంగిలిస్తుండడం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో నిందితుడు పై నిగా పెట్టిన పోలీసులు గురువారం ఉదయం అతని ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకొని విచారించగా మియాపూర్ లో చేసిన దొంగతనాన్ని అంగీకరించడంతో అతని వద్ద నుండి ఏబిబి కంపెనీకి చెందిన 6 ఎంసిసిబిలను, లారీడ్జ్ క్నుడ్సెన్ కంపెనీకి చెందిన 8 కెపాసిటర్ బ్యాంకులను, టిజి 08ఎల్ 2216 నెంబర్ గల టీవీఎస్ జూపిటర్ మోపెడ్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్ తరలిస్తున్నట్లు కూకట్పల్లి ఏసిపి వివరించారు.

## ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందొద్దు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులలో సరిపడా డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. గురువారం శామీర్‌పేట్ మండలంలోని తూంకుంటలో ఉన్న పెట్రోల్ బంకును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్ నిల్వలు, సరఫరా పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంధన కొరత లేదని, ఆయిల్ డిపోల నుంచి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు భయాందోళనలకు గురికావద్దని సూచించారు. అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతుందని పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరవద్దని, వినియోగదారులు తమ అవసరాల మేరకే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఒక్క పెట్రోల్ బంకు కూడా డ్రై కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా బంకు యజమానులు ముందస్తుగా ఆయిల్ కంపెనీలకు ఇండెంట్ ఇవ్వాలని, ఇండెంట్ వచ్చిన వెంటనే సరఫరా జరిగేలా ఆయిల్ కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా రక్షణే ధ్యేయం




**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళా భద్రత మరియు గృహ హింస నివారణపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుషాల్కర్ మరియు అడిషనల్ డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు .సదస్సును ఉద్దేశించి అడిషనల్ డీసీపీ కుషాల్కర్ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళల రక్షణ కోసం ఉన్న వివిధ చట్టాల గురించి, ముఖ్యంగా గృహ హింస నిరోధక చట్టం మరియు వేధింపులకు వ్యతిరేకంగా ఉన్న సెక్షన్ల గురించి అవగాహన కల్పించారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 'షీ టీమ్స్' సేవలు మరియు డయల్ 100 వినియోగంపై సూచనలు చేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన బాల్య వివాహాలు, సైబర్ వేధింపులు మరియు వరకట్న వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, మహిళలకు గౌరవం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకోవాలి. భయం వీడి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. మహిళల భద్రతకు సిద్దిపేట పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ తెలియజేశారు. అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయడం జరిగినదని. ఈ సదస్సులో స్థానిక పోలీసు అధికారులు ఏసిపి రవీందర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టు టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ , ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గా, న్యాయవాది రోహిణి, డిప్యూటీ డి ఆర్ డి ఓ సుదీర్ బాబు, స్నేహిత ఎన్జీవో ఆర్గనైజేషన్ వసంత మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


## ఓయూలో ఘనంగా ముగిసిన టెక్నోస్మానియా-2కే26 కల్చరల్ ఫెస్ట్



**సికింద్రాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నో-కల్చరల్ ఫెస్ట్ 'టెక్నోస్మానియా-2కే26' గురువారం ముగిసింది. మూడో రోజు ఉదయం టెక్స్ క్రోమా, టెక్నోఫార్మా కాన్ఫరెన్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి హాజరయ్యారు. డీన్ డెవలప్మెంట్ అండ్ యూజీసీ ప్రొఫెసర్ బి. లావణ్య మాట్లాడుతూ.. ఈ ఫెస్ట్ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.శ్రీను నాయక్ మూడు రోజుల పాటు జరిగిన వివిధ సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.రమేష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యంత సమర్థంగా కార్యక్రమాన్ని నిర్వహించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఫార్మసీ ప్రొఫెసర్ చింత సాయిలు, ఫుడ్ టెక్నాలజీ హెడ్ బి.రాజం, టెక్స్టైల్ టెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ జె.హయవదన, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా.బి.పరమేశ్వర్లు, డా.ఎస్.ఐలయ్య, డా.ఎ.పరశురామ్, డా.వి.భాస్కర్, డా.పి.అరుణాదేవి, డా.టి. జ్యోతి. విద్యార్థి కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహప్రతిష్టాపన

● హాజరైన ఎంపి ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**బోడుప్పల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** బోడుప్పల్ ఎస్ఐఎస్ కాలనీలో వెలసిన శ్రీవేంకటేశ్వర, శివాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగవైభవంగా జరిగింది. వందలాది మంది మహిళలు, కాలనీవాసుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి బృందావన రామానుజ జీయర్ స్వామి వారి పవిత్ర హస్తాల మీదుగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు మంద సంజీవరెడ్డి. బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు మీసాల కృష్ణ, కొత్త రవిగౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కాటం రాజిరెడ్డి, బందారం శ్రీధర్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు సుదర్శన్రెడ్డి, డాక్టర్ మర్రి రాంరెడ్డి, శాడగొండ శ్రీకాంత్ రెడ్డి, బజ్జూరి శ్రీనివాస్ గుప్తా యుగేందర్ రెడ్డిలు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర శివాంజనేయ స్వామి దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఏనుగు ప్రతాప్రెడ్డి, కమిటి చైర్మన్ దీటి గణేశ్. ఎస్ఐఎస్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకలశ్రీనివాస్ గౌడ్ ప్రధాన కార్యదర్శి సంగనూరు నాగరాజు. వైస్ చైర్మన్ కొండా అయిలయ్య యాదవ్. కార్యదర్శి పి.ఉమేశ్ రెడ్డి, కోశాధికారి బి.మల్లయ్య, సభ్యులు జి.జితేందర్ రెడ్డి. బి.బాలాజీరావు, ఎ.మల్లేశ్ యాదవ్, చందా కరుణాకర్, డి.శ్రీపాల్ రెడ్డి, ఎం. నాగరాజు, ఎం.సోమయ్య. పబ్బు సత్యనారాయణ. పూర్తి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో కాలనీకి చెందిన అనేకమంది మహిళలు భక్తశ్రద్ధలతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## పీఎండీడీకేవైలో జోగులాంబ గద్వాల జిల్లా ముందుండాలి




**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎండీడీకేవై లో జోగులాంబ గద్వాల జిల్లా ముందుండేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పిఎండిడికేవై అమలుపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. డేటా ఆధారిత పాలన ద్వారా జిల్లాలో అభివృద్ధిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి శాఖ తమ పనితీరును ఖచ్చితమైన సంఖ్యలతో ప్రతిబింబిస్తూ, లక్ష్యాలు మరియు సాధించిన ఫలితాలను సరిగ్గా నిర్దేశిత పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. "సున్నా" నమోదు చేయకుండా, చేసిన ప్రతి పనిని డేటాలో చూపించాలని, చిన్న పురోగతినైనా నమోదు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చి ప్రస్తుత పురోగతిని చూపించడం ద్వారా పనితీరు మెరుగవుతుందని, ప్రతి నెల సమీక్ష ద్వారా డేటాను సరిచేసుకుంటే నివేదికలు మరింత నాణ్యతగా ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, పథకం సూచికలను సక్రమంగా అమలు చేస్తే, ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఆర్డిఓ ముషాహిదా బేగం, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, నిజాయితీలే ఉద్యోగికి గుర్తింపు



ఖైరతాబాద్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) : క్రమశిక్షణ, నిజాయితీ మాత్రమే ఉద్యోగికి గుర్తింపు ఇస్తాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు అన్నారు. గురువారం ఎస్కీ ఉద్యోగి ఎల్లయ్య పదవీ విరమణ సందర్భం గా ఆయన మాట్లాడారు. ఉద్యోగానికి పదవీ విర మణ మధ్య వున్న సమయం అత్యంత విలువైన దని అన్నారు. 1991 ఎస్కీ లో విధుల్లో చేరిన ఎల్ల య్య క్రమంగా అసిస్టెంట్ మేనేజర్ స్థాయికి ఎదిగి 35 ఏళ్ల తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో అందరి చేత మంచివాడిగా అనిపించుకుని పదవీ విరమ ణ పొందుతున్న ఎల్లయ్య అదృష్టవంతుడని అ న్నారు. ఈ సమావేశంలో సుధాకర్, నాగ మల్లేశ్వర రావు, నాగేశ్వర్ రావు, కాలేజ్ చీఫ్ లక్ష్మి కాంత రావు, డా.పి.రాజారావు తోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# అడాప్షన్ హెల్ప్‌డెస్క్ ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం కార్యక్రమం, ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అడాప్షన్ హెల్ప్‌డెస్క్‌ను జిల్లా కలెక్టర్ మను చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు హెల్ప్‌డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం అందజేస్తామని తెలిపారు. దత్తతకు అవసరమైన పత్రాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, నమోదు విధానం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల ద్వారా దత్తత వంటి వివిధ రకాల దత్తత ప్రక్రియలపై ప్రజలకు వివరాలు తెలియజేస్తామని తెలిపారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు చట్టబద్ధమైన విధానాల ద్వారా మాత్రమే దత్తత తీసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ ఆసుపత్రులు లేదా నర్సింగ్ హోమ్స్ ద్వారా నేరుగా పిల్లలను దత్తత తీసుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. దత్తత ప్రక్రియను ఇంటి వద్ద నుంచే లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పిల్లల దత్తత, స్పాన్సర్‌షిప్ అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా దత్తత తీసుకున్నట్లు తెలిసినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. పోషణ్ సిబ్బంది, ఫోస్టర్ కేర్ బృందాలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కుటుంబాలతో మాట్లాడి దత్తతపై ఉన్న అపోహలను తొలగిస్తూ చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించాలని సూచించారు. మిషన్ వాత్సల్య పోర్టల్ ఒఒఒ.ఎఆంంఆశీఅజఖ్‌యిశ్రీఝ.ఒఎఎ.స్త్రశీజ.ఆఅ ద్వారా పిల్లల దత్తత ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. అక్రమ దత్తతపై కఠిన చర్యలు తీసుకుంటామని, పిల్లలకు సురక్షిత భవిష్యత్తు కల్పించడంలో చట్టబద్ధ దత్తత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే జరిమానా..



**కంది, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** గ్రామాలలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త పారవేస్తే జరిమానా విధించాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రమైన కంది గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని పారిశుద్ధ పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని ఆయా గ్రామాలలో చెత్త రోడ్లపై పారావేస్తే జరిమానా విధించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రోడ్లపై వేసిన చెత్తను చూసి వెంటనే ఆ చెత్తను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ప్రజలు రోడ్ల పక్కన చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచనలు ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లు , వార్డు సభ్యులతో సమావేశమై పరిశుభ్రత కార్యక్రమాలపై చర్చించారు. గ్రామ పరిశుభ్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
01 మే 2026

# మరోసారి అధికారుల పాలనలోకి జడ్చర్ల పురపాలక సంఘం

- మే 6వ తేదీతో ముగియనున్న పాలకవర్గం గడువు
- మే 7వ తేదీ నుండి స్పెషల్ పాలన
- స్పష్టత కరువైన ఎన్నికల షెడ్యూల్

**జడ్చర్ల, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీలో ఐదేళ్ల ప్రజాస్వామ్య పాలన ముగింపు దశకు చేరుకుంది. 2021 మే 7న బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం ఈనెల మే 6వ తేదీతో పూర్తి కానుంది. గడువు ముగియడానికి మరో వారం రోజులే సమయం ఉన్నా, తదుపరి ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుండి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో.. మే 7వ తేదీ నుండి జడ్చర్ల మున్సిపాలిటీ అధికారికంగా ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లడం ఖాయమైంది.

### తెరపడనున్న తొలి పాలకవర్గ ప్రస్థానం

మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లో కొలువుదీరిన ఈ పాలకవర్గం తమ ఐదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంటోంది. ఈ ఐదేళ్ల కాలంలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరిగినప్పటికీ, రాజకీయ కారణాలతో కో-




ఆప్షన్ సభ్యుల నియామకం జరగకపోవడం గమనార్హం. పదవీకాలం ముగుస్తుండడంతో గత నెలలో చివరి కౌన్సిల్ సమావేశం నిర్వహించి కొన్ని పనులకు ఆమోదం తెలిపారు.

### ఎన్నికల నగారా ఎప్పుడు..?

రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ జరుగుతున్నా, జడ్చర్ల మున్సిపాలిటీకి సంబంధించి మాత్రం ఎన్నికల ఊసే వినిపించడం లేదు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో కలిపి నిర్వహిస్తారా లేక ఆ తర్వాతే నోటిఫికేషన్ ఇస్తారా అన్నది మిస్టరీగా మారింది. అధికార పార్టీ వర్గాల అంచనా ప్రకారం, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం మరో రెండు నుండి మూడు నెలల సమయం పట్టవచ్చని తెలుస్తోంది. అప్పటి వరకు మున్సిపల్ వ్యవహారాలన్నీ స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి.

### ప్రజల్లో ఆందోళన.. ఆశావహుల్లో ఉత్కంఠ..

పాలకవర్గం లేని సమయంలో వార్డుల్లోని స్థానిక సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రజా ప్రతినిధులు అందుబాటులో లేకపోతే మౌలిక సదుపాయాల పనులు కుంటుపడతాయని, పరిపాలన యంత్రాంగం ప్రజలకు దూరం అవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు చైర్మన్ పీఠంపై కన్నేసిన నాయకులు, వార్డుల రిజర్వేషన్లు ఎలా మారతాయో తెలియక తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. మొత్తానికి జడ్చర్ల పురపాలక సంఘం మే 7 నుండి అధికారుల పాలనలోకి వెళ్లేందుకు సర్వం సిద్ధమైంది. ప్రజా ప్రతినిధులు లేని స్పెషల్ పాలనలో పట్టణ సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి వేచి చూడాలి.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణే ధ్యేయం



**జడ్చర్ల, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రధాన ధ్యేయమని 2వ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ అన్నారు. గురువారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు శ్రీ కృష్ణ కాలనీలో బాలవికాస ఫౌండేషన్ సౌజన్యంతో వేయించిన బోరు డ్రిల్లింగును కౌన్సిలర్ మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండలు ముదురుతుండటంతో భూగర్భ జలాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, దానిని ముందే గుర్తించి కాలనీలో నీటి వసతి ఏర్పాటు కొరకు బోరు డ్రిల్లింగ్ చేయడం జరిగిందని తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి నీటి సౌకర్యం కల్పించిన బాలవికాస ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బాలవికాస సభ్యులు ప్రశాంత్, మార్తా డేవిడ్, కాలనీ వాసులు శ్రీనివాసులు, రాజు, బుక్క నారాయణ, కుమార్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి ఇంటి కలను తీర్చడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** ప్రతి పేదవాడి ఇంటి కలను తీర్చడమే ప్రజాప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర క్రీడా, పాడిపరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మున్సిపల్ పరిధిలో ఇరవై మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రోసిడీంగ్ అందజేశారు. ప్రతి పేదవాడికి ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందని అన్నారు. దశలవారీగా మక్తల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేసి కొత్త ఇళ్లను మంజూరు చేస్తామని వెల్లడించారు. రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఇళ్ల మంజూరు పత్రాలను తీసుకున్న లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం కోసం అవసరమయ్యే ఇసుక, మొరం సరఫరాకు పోలీస్, రెవెన్యూ అధికారులు సహకరించాలని ఆదేశించారు. డబ్బుల విషయంలో ఆలస్యం కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మూడవ వార్డులో పురాతనమైన కర్రెమ్మ దేవాలయం ఉన్నా అమ్మవారి ఉత్సవాలు జరుపుకోవడానికి స్థలం లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా గుడి ముందు భాగంలో ఉన్న ఓ ఇంటిని తన సొంత డబ్బులతో ఖరీదు చేసి గుడికి కానుకగా ఇస్తానని స్పష్టం చేశారు. బాధితునికి స్థలం చూస్తే ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తానని వార్డు ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మే 2న ప్రజాపాలనపై ప్రత్యేక సమావేశాలు

- అదనపు కలెక్టర్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 2వ తేదీన నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశా లు నిర్వహించనున్నట్లు అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల అమలు పురోగతిని సమీక్షిస్తూ ప్రజల అభిప్రా యాలు, సూచనలు స్వీకరించేందుకు ఈ సమావే శాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశా లలో వివిధ ప్రభుత్వ శాఖల కు సంబంధించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్య క్రమాలు, రైతు సంక్షేమ చర్యలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతి తదితర అంశాలపై చర్చించ బడుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు సూచించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. అందువల్ల ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారు లు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత మరియు ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రజల భాగ స్వామ్యంతోనే అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవం తంగా అమలు అవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశం లో జిల్లా అధికారులు తది తరులు పాల్గొన్నారు.

# పండిత్ దీన్‌దయాల్ చేసిన సేవలు మరువలేనివి

- బిజెపి రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ గౌడ్

**తూప్రాన్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** దేశానికి పండిత్ దీనదయాల్ చేసిన సేవలు మరువరా నీవని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామమోహన్ గౌడ్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ తూప్రాన్ మున్సిపాలిటీలో నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వర్గంటి రామ్మోహన్ గౌడ్ విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్ అధ్యక్షత వహించగా, బిజెపి కౌన్సిలర్లు బొల్లం సత్యనారాయణ, మన్నే స్వామి ,చందా అశోక్ ,స్టేట్ కౌన్సిలింగ్ మెంబర్ సంకే యాదగిరి, సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్ ,తాటి విఠల్, సాయిబాబా యాదవ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ బిజెపి , సిద్ధిరాములు, టౌన్




జనరల్ సెక్రెటరీ పోతరాజు శరత్ ,బాసంపల్లి సంపత్ గౌడ్, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు నవీన్ ముదిరాజ్ ,బద్రి ,దేవత సాయి కుమార్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి పార్టీ ఘన చరిత్రను, జనసంఘ్ కాలం నుండి పార్టీ ఎదుగుదలకు నాయకులు పడ్డ శ్రమను వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని, దేశ భద్రత మరియు సమగ్రత కోసం ఆర్టికల్ 370 రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. ముస్లిం మహిళల సాధికారత కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేయడం, దశాబ్దాల కాలం నాటి హిందువుల కల అయిన అయోధ్య రామమందిర నిర్మాణాన్ని సాకారం చేయడం మోదీ ప్రభుత్వానికే దక్కిన గౌరవమని పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## పేదవారి సొంతింటి కళను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**సదాశివపేట, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలోని ఈశ్వర్ మందిర్ సమీపంలో మంగలి సురేఖ గోపాల్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత పేర్కొన్నారు. పట్టణంలోని 12వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును పులిమామిడి మమత మరియు సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాన్ని అభినందించిన మమత, గృహాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. మన సి.ఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు స్థిర నివాసం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా కృషి కొనసాగుతుందని, ఇంకా ఎవరైనా ఖాళీ స్థలం ఉండి ఇల్లు కట్టుకునే వారు ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు పెట్టు కోవలసిందిగా వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం నిరుపేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు మారుతి, తాలెల్మ రాము, బిళ్ళకంటి శ్రీనివాస్, శ్రవణ్, పిల్లోడి చందు, శివ, అఖిల్, సోమ శంకర్, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా కౌన్సిలర్ సేవలను ప్రజలు అభినందించారు.

## కన్నుల పండుగ కూర్మా నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం



**తూప్రాన్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** తూప్రాన్ శివారులోని రామాలయం సమీపంలోని అతి పురాతనమైన స్వయంభుగా వెలసిన కూర్మనారసింహస్వామి జయంతి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. బుధవారం, గురువారం రెండు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు ఆంజనేయ స్వామి వారికి చందన విలేపనం, ఆకు పూజ , ధ్వజారోహణం, సుదర్శన హోమం , లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం, ఓడి బియ్యం కార్యక్రమాలు కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వాహకులు దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని బజారు రూపేష్ అందించారు, నిర్వాహకులు కంటాయపాలెం వేణుగోపాల్ ఆలయ పురోహితులు అహోబిలం ప్రవీణ్, తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి, కౌన్సిలర్లు సబిత నాగేష్ ముదిరాజ్, కౌన్సిలర్ బొడ్డు జోత్స్న వేణు, మాజీ మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, మాజీ శివంపేట ఎంపీపీ కల్లూరు హరికృష్ణ, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బిల్ కలెక్టర్

- ఇంటి పన్ను తగ్గించడానికి రూ.35 వేలు డిమాండ్

**సదాశివపేట, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు సదాశివపేట బిల్ కలెక్టర్. తన ఇంటి ఆస్తి పన్నును అతను రెగ్యులర్గా చెల్లించలేదు. తీరా చూస్తే ఇంటికి సంబంధించిన ఆస్తి పన్ను లక్ష పైగా దాటింది. అధికారులు తగ్గిస్తే ఆ సొమ్మును తక్షణమే కట్టేస్తానంటూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే బిల్ కలెక్టర్ ను ఆశ్రయించాడు. అది ఎంత పని లంచం ఇస్తే తగ్గిచేస్తానంటూ అతను హామీ ఇచ్చాడు. ఈ వ్యవహారంలో ఆ బెల్ కలెక్టరు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్గా పనిచేస్తున్న నిఖిల్ రెడ్డి వద్దకు బాధితుడు వచ్చాడు. తన ఇంటికి సంబంధించిన టాక్స్ డబ్బులు గతంలో రూ.49 వేలు ఉండేది. ప్రస్తుతం అది కాస్త రూ. 1,0,4000/కావడంతో అతిపెద్ద మొత్తం చెల్లించలేనని బాధితుడు మొరపెట్టుకున్నాడు. రూ.50 వేలకు ఇంటి పన్ను తగ్గిస్తానని దానిపై తనకు రూ.35 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు కొద్ది రోజుల క్రితం రూ.20 వేలు లంచం కింద మొదటి విడతగా నగదును అందజేశారు. గురువారం సదాశివపేట మున్సిపల్



కార్యాలయంలో అదే బాధితుడి వద్ద నుంచి మరో రూ.15 వేలు లంచం తీసుకుంటూ నికిల్ రెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అయితే ఈ వ్యవహారంలో బిల్ కలెక్టర్ పాత్ర మాత్రమే ఉన్నదా..?.లేక ఇతర అధికారుల పాత్ర ఉందా అనే కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపడుతున్నారు. నిందితుడు నిఖిల్ రెడ్డిని అదుపులోకి అడిషనల్ స్పెషల్ జడ్జ నాంపల్లి కోర్టులో హాజరుపరచున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసిపి డిఎస్పి సుదర్శన్, ఇన్స్పెక్టర్ రమేష్ ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సెట్విన్‌తో మహిళలకు స్వయం ఉపాధి

- మక్తల్‌ను బ్రాండ్ హబ్‌గా తీర్చిదిద్దుతా..
- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** సెట్విన్‌తో వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలోని సెట్విన్ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ కంప్యూటర్ ట్రైనింగ్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలను నేరుగా కలుసుకొని, వారి శిక్షణ తీరుతెన్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సెట్విన్ రాకతో మక్తల్ పట్టణంలోనే మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు మార్గం సుగమయిందని అన్నారు. టైలరింగ్ తో పాటు అన్ని విభాగాల్లోని మహిళలకు రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుంచి పెద్ద పెద్ద కంపెనీలను తీసుకువచ్చి, వారికి నేరుగా ఉపాధిని మక్తల్ లోనే



అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అమరచింతలో ప్రత్యేకంగా షెడ్యూల్ నిర్మించి హైదరాబాద్ నుంచి కంపెనీల ద్వారా మహిళలకు ఉపాధి అందిస్తున్నామని తెలిపారు. మక్తల్ లో సైతం పెద్దపెద్ద షెడ్లు నిర్మించి మహిళలకు ఉపాధి అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని విద్యార్థులకు యూనిఫామ్ లను కుట్టే ఉపాధిని సెట్విన్ లో శిక్షణ పొందే వారికి అందించి, వారికి భరోసా కల్పిస్తామన్నారు. మక్తల్ ను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సెట్విన్ లో అన్ని ప్రాంతాల నుంచి ఆర్డర్లు తీసుకొని వచ్చి ఇక్కడి మహిళలు స్వయం ఉపాధి పొందే లాగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన శిక్షణ పొంది ఆయా విభాగాల్లో నిష్ణాతులుగా తయారు కావాలని సూచించారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరికి సెట్విన్ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, టైలరింగ్ ట్రైనర్ ఫర్జానా, బ్యూటీషియన్ ట్రైనర్ స్వప్న, మగ్గం వర్క్ జర్దోసి ట్రైనర్ వీరమ్మ, కంప్యూటర్ ట్రైనింగ్ ట్రైనర్ తిమ్మప్ప, సిబ్బంది ప్రవీణ్, నాయకులు బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య నీల గౌడ్, కో ఆప్షన్ మెంబర్ శంషుద్దీన్, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

- మార్కెట్ చైర్మన్ శివారెడ్డి



**నారాయణపేట, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా పాలన నడుస్తున్నదని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డిఅన్నారు. గురువారం నారాయణపేట మండలం మేక హనుమాన్ తాండ గ్రామపంచాయతీ ఒండు చెలమేతాండ లో నీటి సమస్య ఎక్కువ ఉన్నందు వలన ఎమ్మెల్యే నిధుల నుండి బోరు వేయించారు. అలాగే మండలంలోని కోట కొండ, ఉంటకుంటతాండా, అప్పక్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడు తూ ఎన్నో సంవత్సరాల నుండి తీరని నీటి సమస్య గ్రామ ప్రజల కోరిక మేరకు తాండ సర్పంచ్ ఆధ్వర్యంలో బోరు వేయడం జరిగింద న్నారు. ఈ ప్రభుత్వం అర్హు లైన ప్రతి పెదోడికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శరణప్ప, గ్రామ సర్పంచ్ శ్రీధర్ నాయక్ గ్రామ పెద్దలు లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్ ,గణేష్ నాయక్, గోపాల్ నాయక్ ,శంకర్ నాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యారేజీల పనులు వేగవంతం చేయాలి

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్



**మహదేవపూర్, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం మేడిగడ్డ, లక్ష్మీ బ్యారేజ్, అన్నారం సరస్వతి బ్యారేజీలను శుక్రవారం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పరిశీలించారు. మేడిగడ్డ అన్నారం ప్రాజెక్టుల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి బ్యారేజ్ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న బోర్ హోల్స్ పనులు రోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేడిగడ్డ అన్నాడం ప్రాజెక్టుల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి అనులను వేగవంతం చేయాలని ఇబ్బంది కోసం గతంలో సిఆర్పిఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్ నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కొరకు గదులను పరిశీలించి అన్నారం ప్రాజెక్ట్ ఆప్ స్ట్రీమ్ ను పరిశీలించి బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు సాంకేతిక పరిశీలన పనిలోని శుక్రవారం ను ప్రారంభించాలని ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ. బ్యారేజీలకు సంబంధించిన సాంకేతిక పరీక్షలను దశలవారీగా చేపట్టాలని అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలన్నారు. అలాగే డ్రిల్లింగ్ పనులు చేపట్టేటప్పుడు గట్టి శిలా పోర వచ్చేంతవరకు కొనసాగించాలని సూచించారు .సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తూ పనులను నాణ్యతంగా నిర్ధారించాలని విద్యుత్ సరఫరాను నిరంతరం అందుబాటులో ఉంచాలని ప్రతిరోజు ఇరిగేషన్ అధికారులు పనులను సమగ్రంగా పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ రమేష్ కుమార్ ,సి ఈ శ్రీనివాస్ గుప్తా, ఈ ఇల్లు తిరుపతిరావు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదం జరిగితేనే చర్యలు చేపడతారా!

- భయం గుప్పెట్లో మల్లూరు గుట్టకు భక్తుల ప్రయాణం...!
- ఇష్టారాజ్యంగా గుత్తేదారు బీటీ నిర్మాణ పనులు...
- రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయడంతో వాహనాలు జారుతున్న దుస్థితి...
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు...





**మంగపేట ఏప్రిల్ 30(జనంసాక్షి) :** ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు గుట్ట (హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం) రోడ్డు మార్గం ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా భక్తులకు మరియు వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. మల్లూరుగుట్ట రోడ్డుపై భయం గుప్పిట్లో భక్తులు ప్రయాణం కొనసాగాల్సిన దుస్థితి ఏర్పడింది అంటూ భక్తులు ఆరోపిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లూరుగుట్ట హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు కష్టాలు తప్పడం లేదు అంటే ఇది ముమ్మాటికి నిజమే అని భక్తుల ఆరోపిస్తున్నారు. ఇటీవల మల్లూరు గ్రామం నుండి హేమాచల క్షేత్రం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు చేపట్టాడు. కానీ స్వామి వారి బ్రహ్మోత్సవాలు దగ్గర పడడంతో తూతూ మంత్రంగానే నిర్మాణ పనులు పూర్తిచేసి చేతులు దులుపుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే రోడ్డు విరువైపులా మట్టి పోయడం మట్టి కాస్త రోడ్డుపై ఉండడం వలన వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు అంటూ భక్తులు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. హేమాచల క్షేత్రానికి చేరుకునే మార్గంలో రోడ్డు మూలమలుపుల వద్ద మట్టి ఉండడంతో వాహనాలు జారుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. ఘాట్ రోడ్డు అధ్వానంగా తయారవ్వడం, సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ఈ మార్గం ఇప్పుడు 'ప్రమాదాలకు నిలయం'గా మారుతోంది భక్తులు బహిర్గతంగా తమ ఆవేదనలను వ్యక్తపరుస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులపై గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కూడా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం పలు రకాల అనుమానాలకు సావిస్తున్నాయంటూ మల్లూరు గ్రామస్తులు బహిర్గతంగా చర్చించుకుం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డుపై నిలిచిన మట్టిని వెంటనే తొలగించి వాహనా దారులకు పడుతున్న ఇబ్బందులను అరికట్టాలని భక్తులు వాహనదారులు కోరుతున్నారు.

# కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం


- చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..



**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ కు వచ్చే ప్రజలకు, ఉద్యోగుల కోసం వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ( డిఆర్డిఏ ), తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా కలెక్టరేట్ లో ప్రజలు, ఉద్యోగుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. చలివేంద్రంలో చల్లని నీటితో పాటు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్డివో మేన శ్రీను, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, అడిషనల్ డీఆర్డీవో లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస స్వామి, టీజీవో నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపడా ఇంధన నిల్వలు

- క్యాన్లలో ఇంధన విక్రయం నిషేధం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి,ఏప్రిల్ 30 (జనంసాక్షి):** జిల్లాలోని అన్ని పెట్రోల్, డీజిల్ బంకుల వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో లిఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకుల్లో ఇండెంట్ విధానం, ఇంధన విక్రయాల వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయిల్ కంపెనీల ద్వారా నిరంతరం సరఫరా జరుగుతోందని, బంకుల వద్ద నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని, కూపన్ల వినియోగాన్ని అమలు చేయాలని, ముఖ్యంగా రైతులకు అందించే 25 లీటర్ల ఇంధన పరిమితి (కల్టివేటర్లు, హార్వెస్టర్లకు) విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. స్టాక్ వివరాలు, రికార్డులు సరైన విధంగా నిర్వహించాలని, అన్ని పెట్రోల్ బంకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన సరఫరా వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని లికలెక్టర్లి ఆదేశించారు. అదే విధంగా పెట్రోల్ బంకుల వద్ద క్యాన్లలో (ఝఅం) ఇంధనం ఇవ్వకూడదన్నారు. దీనిని ప్రతి బంకు నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లా పౌరులకు విజ్ఞప్తి చేస్తూ.. అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయకుండా సహకరించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఏఓ అంబికా సోనీ, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, డీఎం సీఎస్ హాథీరామ్, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, తూనికలు, కొలతల శాఖ అధికారి ఝాన్సీ, ఇతర సంబంధిత అధికారులు, పెట్రోలియం డిస్ట్రిబ్యూటర్లు, తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**బోథ్, ఏప్రిల్ 30(జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు.గురువారం మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు.రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేస్తూ శుభ్రపరచాలని అలాగే ల్యాబ్ వంటి యంత్రాలు ఏసి పరికరాలల్లో ఏలాంటి లోపాలు ఎదురైన త్వరగా మరమ్మతులు చేపట్టాలన్నారు.తీవ్ర ఎండల దృశ్య వడదెబ్బతో వచ్చిన వారికి ఆలస్యం చేయకుండా వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అలాగే నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనం త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్, ఆసుపత్రి సూపరిడెంట్ రవీంద్ర ప్రసాద్,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలు మన దగ్గరికి వస్తున్నాయి

- ప్రొఫెసర్ సుంకరి జ్యోతి..



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లోని ఉద్యోగ కల్పన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ కార్పొరేట్ కంపెనీ మ్యాట్రిక్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ భర్తీ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హైదరాబాదులోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలు మన కళాశాలకు వచ్చి ఉద్యోగ భర్తీ కోసం డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇటువంటి అవకాశాన్ని కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ఇంటర్వ్యూలలో ధైర్యంగా పాల్గొనడం ద్వారా మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ఉద్యోగ కల్పన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ జితేందర్, డాక్టర్ సరిత, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ కల్పత కేంద్రం నిర్వహించిన రాత పరీక్షకు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు

# గంజాయి, పోక్సో కేసుల్లో నిందితులకు కారాగార శిక్ష

- గంజాయి కేసులో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 50,000 జరిమానా...
- పోక్సో కేసులో 2 సంవత్సరాల కఠినకారాగర శిక్ష, 4200 జరిమానా...
- బాధితురాలికి రెండు లక్షల నష్టపరిహారం
- దర్యాప్తు అధికారులను,కోర్టు అధికారులను, సిబ్బందిని అభినందించిన ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్..



**ములుగు బ్యూరో, ఏప్రిల్30 (జనం సాక్షి) :** ములుగు జిల్లా కోర్టులో పస్ర పోలీస్ స్టేషన్ కి చెందిన గంజాయి కేసులో మరియు వెంకటాపూర్ కి చెందిన పోక్సో కేసులో నిందితులపై నేరము నిరూపణ జరిగి నిందితులకి గంజాయి కేసులో 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 50,000/- జరిమానా, పోక్సో కేసులో 2 సంవత్సరాల కఠినకారాగర శిక్ష, 4200/- జరిమానా విధించడం జరిగిందని ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. దానితో పాటు పోక్సో కేసులో బాధితురాలికి రెండు లక్షల నష్టపరిహారం అందించాలని కోర్టు తీర్పునిచ్చిందని తెలియజేశారు.

**కేసుల వివరాలు :**

1) పస్ర పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వారు ఎస్ఐ కరుణాకర్, దర్యాప్తు అధికారి ఇన్స్పెక్టర్ శంకర్,స్పెషల్ పిపి డి.రాంసింగ్, సిడిఓ: మౌనిక. నిందితుడు బొబ్బ సూర్య ప్రకాష్ తండ్రి వెంకటేశ్వరరావు, వయస్సు 26సం.లు,కమ్మ, వృత్తి వ్యవసాయం,గ్రామం బ్రాహ్మణపల్లి గ్రామం, మంగపేట మండలం, ములుగు జిల్లా చెందినవాడు. నిందితునికి విధించబడిన శిక్ష 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించారు.

2) కేసు నెంబర్14/2023, సెక్షన్ నెంబర్ 15/2023 యూ/ఎస్ 354-డి,448, 290, 506 ఐపిసి , సెక్షన్ 11 ఆర్/డబ్ల్యు 12 ను పోక్సో కేసు ను వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వారు హెడ్ కానిస్టేబుల్ బాలయ్య 393, దర్యాప్తు అధికారి ఎస్ఐ తాజుద్దీన్, స్పెషల్ పిపి డి.రాంసింగ్ కోర్టు కానిస్టేబుల్ స్రవంతి, నిందితుడు ల్యాదల్ల రజినీకాంత్ తండ్రి వెంకన్న వయస్సు 20సం.లు ముదిరాజ్, వృత్తి ఆటో డ్రైవర్, గ్రామం కొండాపూర్, వెంకటాపూర్ మండలం ములుగు జిల్లా. నిందితునికి విధించబడిన శిక్ష 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 4200/-- రూపాయల జరిమానా బాధితురాలికి 2 లక్షల రూపాయల నష్టపరిహారంపై కేసులలో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన దర్యాప్తు అధికారులు శంకర్, తాజుద్దీన్ లను, కేసు ట్రయల్ ను సమర్థవంతంగా నడిపించిన ఇతర పోలీస్ అధికారులను, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ్ సింగ్,కోర్టు కానిస్టేబుల్ మౌనిక, స్రవంతి లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# ట్రాన్స్‌ఫార్మర్లకు 'సిసి' కాపలా



**తాండూర్, ఏప్రిల్ 30( జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజక వర్గం తాండూర్ మండలం కాసిపేట రైతులు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. తరచూ పలు చోట్ల విద్యుత్ నియంత్రికలను దొంగలు ధ్వసం చేసి అందులో రాగి కాపార్ ను ఎత్తుకెళ్లారు.. దీంతో రైతులు మరల వేరొక నియంత్రిక రావడానికి నెలలు గాడిచాయి. దీనివల్ల రైతులు పంటను నష్టపోయారు. ఈ సమస్యకు పరిష్కారంగా పొలాల వద్ద సోలార్ సిస్టమ్ పనిచేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిత్యం నిఘా ఉంచడం ద్వారా దొంగల ఆట కట్టించేందుకు సిద్ధమయ్యారు.

# ములుగు జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



**ములుగు బ్యూరో,ఏప్రిల్30(జనం సాక్షి):** ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్ఖడే ని జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు కూడా పాల్గొన్నారు.ఈ భేటీలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పని చేయాలని నిర్ణయించుకున్నారు.జిల్లాలో శాంతి భద్రత, ప్రజా సంక్షేమానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్యంగా కలిసి పనిచేయాలని ఇరువురు అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో ములుగు డిఎస్పి రవీందర్ ములుగు సిఐ సురేష్,ఇన్స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ గుంతలో పడి చిన్నారి మృతి



**బచ్చన్నపేట, ఏప్రిల్ 30 (జనం సాక్షి):** మిషన్ భగీరథ లీకేజీ గుంతలో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో జరిగింది వివరాల్లోకి వెళ్తే మండలం ఆలీంపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ పైప్ లీక్ అవుతుందని మరమ్మతుల కోసం 20 రోజుల క్రితం నాలుగు మీటర్ల గుంత తవ్వి ఉంచిన అధికారులు ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయిన ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్వాడీ ఆయాగా పనిచేస్తున్న కవిత అనే మహిళ కూతురు మోక్షిత(5) మోక్షిత గుంతలో పడడం గమనించి తల్లికి చెప్పిన చిన్నారి అక్క దీక్షిత దీంతో గుంతలోకి దిగిన తల్లి మోక్షితను బయటికి తీయగా, అప్పటికే మృతి చెందిన చిన్నారి మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని మృతదేహంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు.

# డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా సిద్ధం

- ప్రజలు చురుకుగా పాల్గొనాలి
- ప్రభుత్వం-ప్రజల మధ్య వారధిగా మీడియా పాత్ర కీలకం
- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు




**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 30(జనంసాక్షి) :** జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు (సెల్ఫ్ ఏనుమేరేషన్) ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 545 మంది ఎన్యుమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు.

స్వీయ నమోదు కోసం ఒవ.ఏవఅ-ంబం.స్రశీజ.అఅ పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు.

జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, డిపిఆర్ఓ రఫిక్, కలెక్టరేట్ జనగణన పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు



**కల్లూరు, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా నూతన కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టిఎస్ ను ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభప్రతినిధులుమర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు మాజీ అధ్యక్షులు వనమా వేణుగోపాల్ రావు (సూరి) ప్రధాన కార్యదర్శులు వనమా కిరణ్ గోళ్ళ రాధాకృష్ణమూర్తి , ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్వాయి వెంకటేశ్వరరావు జవ్వాజి వీరాంజనేయులు పాల్గొన్నారు. వీరితో పాటు స్టేట్ కౌన్సిల్ సభ్యులు, చింతకాని మండల అధ్యక్షులు నాగుబండి వెంకటనారాయణ, రఘునాథపాలెం మండల అధ్యక్షులు మల్లికార్జునరావు, మధిర మండల సెక్రెటరీ కాజా చక్రధర్, జిల్లా సభ్యులు ధనుంజయరావు, రామకృష్ణ, చెడే రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొని కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కలెక్టర్ దివాకర టీఎస్ తో జరిగిన భేటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ఆర్యవైశ్యులకు సమగ్రంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సమాజ అభివృద్ధి కోసం ఆర్యవైశ్య మహాసభ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మీ ఆశీస్సులు, మార్గదర్శనం, సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంలో కలెక్టర్ ని హృదయపూర్వకంగా అభినందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అడుగులు

- విద్యతోనే అభివృద్ధి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**దేవరకొండ, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారి విద్యా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు దేవరకొండ నియోజకవర్గంలో ఒక బృహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్యమని,విద్య పైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.గురువారం అయన నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని కొండమల్లేపల్లి శివారులో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమా టోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, పేదలకు వీటిని అందించేందుకు పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళుతున్నదని ,ఇందులో భాగంగానే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 23,000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, 29 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 18 లక్షల 50 వేల మంది విద్యార్థులు



చదువుతున్నారని తెలిపారు. పెండింగ్లో ఉన్న ఎంవి ఐ ఆఫీసును మంజూరు చేయాలని ,అలాగే 20 పడకల ఆసుపత్రి పూర్తిచేయాలని కోరారు .దేవరకొండ నియోజకవర్గం లో తాగునీటికి ఇబ్బంది ఉందని డిండి నుండి దేవరకొండకు నీరిచ్చే 90 కోట్ల రూపాయల ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని, దీన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని, అలాగే దేవరకొండ జూనియర్ కళాశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసి జైపాల్ రెడ్డి పేరు పెట్టి విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఇదివరకే నియోజకవర్గంలో 5 కేజీ బి వి లు,ఐదు మోడల్ స్కూల్స్ తీసుకురావడం జరిగిందని, కేజీబీవీలన్నింటికీ కాంపౌండ్ వాల్ తీసుకొచ్చామని, పెళ్లి పాకాల రిజర్వాయర్ రీడిజైనింగ్ అంచనాలతో క్యాబినెట్ అనుమతిస్తే నియోజకవర్గం లో సాగునీటికి ఇబ్బంది లేదని, నక్కలగండి ప్రాజెక్టుకు సంబంధించి అటవీ అనుమతులు క్లియర్ చేయించాలని, డిండి ప్రాజెక్టు కు గతంలో ఇచ్చిన జీవో ప్రకారమే పనులు చేపట్టాలని, నియోజకవర్గంలో హ్యాం రోడ్ల ద్వారా 70 కోట్ల రూపాయలతో పనులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని నేరేడు గోమ్మ లో132/11 కెవి సబ్ స్టేషన్ మంజూరు దశల ఉన్నందున తక్షణమే మంజూరు చేయించాలని, కొండపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మించడం జరుగుతున్నదని, రెసిడెన్షియల్ విధానంలో 2563 మంది విద్యార్థులు ఒకేదగ్గర చదువుకోవచ్చని, చదువుతోపాటు, వివిధ రకాల కార్యక్రమాలను కూడా ఈ పాఠశాలలో నేర్పించడం జరుగుతుందని, విద్యార్థిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రత్యేకించి మారుమూల గిరిజన ప్రాంత విద్యార్థులకు కొండమల్లేపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ డబ్ల్యూ ఐ డి సి ఎస్ ఈ బాల ప్రసాద్, ఆర్డిఓ రమణారెడ్డి, డీఈవో, మున్సిపల్ చైర్మన్ ఉన్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్లు ఆలంపల్లి నరసింహ, స్థానిక సర్పంచులు రమావత్ సరస్వతీ రవి నాయక్, పసునూరి యుగంధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

- నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొల్ముంతల పహాడ్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొని మీడియా సమావేశంలో మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు రవాణా ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. టోకెన్ పద్ధతి ద్వారా వచ్చిన ధాన్యాన్ని అదే రోజు తేమ శాతం పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలని అనంతరం ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే అధికారుల



దృష్టికి తీసుకురావాలని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ధాన్యం తూకంలో మోసాలు లేకుండా చూడాలని తూకంలో తేడాలు వస్తే సహించలేదన్నారు. రైస్ మిల్లుల యజమానులు రైతులకు పూర్తిగా సహకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున టార్పాలిన్‌లు, గన్నీ బ్యాగులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ధాన్యం తేమ శాతంపై రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. స్థానిక అధికారులు ధాన్యం కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కలెక్టర్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతుల నుండి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసినా లేదా తేమ పేరుతో కోత విధించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. వేసవి ఎండల నేపథ్యంలో నిర్వాహకులు, రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారివెంట ఆర్డిఓ రమణారెడ్డి, ఆర్డీఓ సిసి హరీష్ రెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, డిప్యూటీ తహసిల్దార్ ప్రశాంత్, ఎంపిఓ సుధీర్ కుమార్, ఆర్ఐ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జానకిరాములు, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు ఉన్నారు.

## ఎల్ఆర్ఎస్ ఫీజులో 25% రాయితీతో చెల్లింపునకు దరఖాస్తుదారులకు మరో అవకాశం



కల్లూరు, ఏప్రిల్ 30 (జనం సాక్షి) : రాష్ట్రంలోని ప్లాట్ల అనధికార లేఅవుట్ లో ప్లాట్ కొనుగోలు చేసిన ప్లాట్ యజమానులకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) ఫీజుల చెల్లింపులపై 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ –2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం 2026 మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. కల్లూరు మునిసిపాలిటీ లోయల్ ఆర్ ఎస్ 2020 స్కీమ్ క్రింద 1851 మంది దరఖాస్తు చేసుకోగా 1747 మందికి ఫీస్ చెల్లించమని ఆన్లైన్ లో సమాచారంపంపగా అందులో కేవలం 242 మాత్రమే ఫీస్ చెల్లించారు.ఫీస్ చెల్లించిన వారికి అప్లికేషన్ పరిశీలించి ఇప్పటికే 147 మంది యల్ ఆర్ ఎస్ ప్రొసీడింగ్ ఇవ్వటం జరిగింది.మిగిలిన 1505 దరఖాస్తు దారులు ఈ 25% ఫీస్ రాయితీ ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ తెలిపారు. మీరు చెల్లించ వలసిన ఫీస్ వివరాలు యల్ ఆర్ ఎస్ –2020 వెబ్సైట్ లో మీరు దరఖాస్తు చేసుకున్న ఫోన్ నెంబర్ తో సిటిజన్ లాగిన్ లో తెలుసుకోవచ్చు అని టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ తెలిపారు. ఏమైనా వివరాలు కావలిస్తే మున్సిపల్ కార్యాలయం లో సంప్రాంచించాలని మేనేజర్ నందిశెట్టి నాగేశ్వర్ రావు తెలిపారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ డీకే అరుణకు వినతి



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** మండల పరిధిలోని గట్టెగాని తాండ గ్రామపంచాయతీకి సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం గ్రామానికి చెందిన బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ అనిల్ నాయక్, మండల బిజెపి నాయకులు ఉప్పరి జగదీష్, ఉప్పు జగదీష్ తో కలిసి మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి వినతి పత్రం అందజేశారు. తప్పకుండా నిధులు కేటాయించడం జరుగుతుందని ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

## ఏప్రిల్ నెలలో 103 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

**మణుగూరు, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** పెరిగిన ఉష్ణోగ్రత డీజిల్ కొరతతో కొంచెం ఉత్పతి తగ్గింది ఉద్యోగులు, కార్మికులు సమిష్టి కృషితో పనిచేస్తే వార్షిక లక్ష్యాన్ని చేరుకోవచ్చని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర పేర్కొన్నారు. గురువారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... ఈ ఏడాది ఆరంభం లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. గత ఏడాది పోల్చుకుంటే తగ్గిందన్నారు.. ఏప్రిల్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 9 లక్షల 58 వేల 500 టన్నులకు గాను 9 లక్షల 85 వేల 534 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. ఏప్రిల్ నెలలో సాదించిన బొగ్గు ఉత్పత్తి 103 శాతం. ఏప్రిల్ నెలలో 10 లక్షల 01 వేల 51 టన్నుల బొగ్గును రవాణా చేయటం జరిగింది. అలాగే ఓవర్ టర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 12 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 90 శాతం తో 10 లక్షల 83 వేల క్యూబిక్ మీటర్లు తీసారు.పదవి విరమణ/మెడికల్ ఉద్యోగులకు చెల్లింపులు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు




జియం శ్రీనివాసా చారి,ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్,రక్షణ డి వెంకట్ రామారావు,ఎస్.రమేష్, డిజిఎం (సివిల్) ఫ్రీ జి.శివ ప్రసాద్ , డివై. సిఎంఓ జ్యోతిర్మయి , డిజిఎం (ఏరియా వర్క్ షాప్) టి. శ్రీకాంత్ , క్వాలిటీ హెచడి నాగ రమేష్ , ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కల్లేపల్లి స్వప్నా, సీనియర్ (ఐటి) ప్రోగ్రామర్ సాయిల సురేశ్, డివైఎస్ఈ(సివిల్) డివిఎస్ఎన్ ప్రవీణ్ , తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లా కేంద్రంలో వృద్ధుడి హత్య



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఘోర ఘటన చోటుచేసుకుంది.అనంతరామారం గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య (70) అనుమానాస్పద పరిస్థితుల్లో హత్యకు గురైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.స్థానికుల వివరాల ప్రకారం, మల్లయ్య గత 20 ఏళ్లుగా లక్ష్మమ్మ (60) అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో వేరుగా కిరాయికి వెళ్లి శ్రీరాంనగర్ కాలనీలో నివసిస్తున్నట్లు తెలుస్తోంది.ఘటన జరిగిన రోజు ఇద్దరూ మద్యం మత్తులో మళ్లీ ఎదురుపడగా, మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ఈ క్రమంలో లక్ష్మమ్మ ఆగ్రహంతో మల్లయ్యపై కర్రతో దాడి చేసి, అనంతరం మెడ బిగించి హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది.ఈ సంఘటన వృద్ధాప్యంలోనూ హింసకు దారి తీసిన దురదృష్టకర ఘటనగా స్థానికులను షాక్‌కు గురిచేసింది.సమాచారం అందుకున్న టూ టౌన్ ఎస్సై సైదులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.నిందితురాలు లక్ష్మమ్మను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# అన్నం శ్రీనివాసరావుకు శ్రీ రామానుజన్ ఫౌండేషన్ పురస్కారం ప్రదానం




**ఖమ్మం, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు శ్రీనివాస శ్రీ రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా పురస్కారాలను అందజేశారు. నగరంలోని శిల్పకళా వేదికలో జరిగిన ఈ వేడుకకు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ అమరేష్, మోతే చిరంజీవి అధ్యక్షత వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు.

### అన్నం శ్రీనివాసరావుకు సత్కారం

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన అన్నం ఫౌండేషన్ చైర్మన్ లిలిఅన్నం శ్రీనివాసరావులిలి చేస్తున్న సామాజిక సేవలను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆయనను మెమొంటోతో సత్కరించారు. అనాథలకు, ఆపన్నులకు అన్నం ఫౌండేషన్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా మంత్రులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్. వెంకటనారాయణ, బ్లడ్ యాప్ సృష్టికర్త డాక్టర్ జై జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల నలుమూలల నుండి వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు హాజరుకావడంతో శిల్పకళా వేదిక కిక్కిరిసిపోయింది.

## రిత్వికను అభినందించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్టేట్ సెకండ్ మార్క్ 596 మార్కులను సాధించిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ స్టూడెంట్ డి.రిత్వికను మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అభినందించారు.భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో రిత్విక తల్లిదండ్రులు ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ చందన లోకే పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఆగ్రహం

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై మండిపాటు
- వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్

**భువనగిరి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** రైతులతో రాజకీయాలు చేయడం తగదని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్ రావు తీవ్రంగా విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హనుమాపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవ లక్ష్మీ నరసయ్య తో కలిసి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. హనుమాపురం కొనుగోలు కేంద్రంలో 20 రోజులుగా కేవలం రెండు లారీల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రంలో వందకు పైగా ధాన్యం కుప్పలు ఉన్నప్పటికీ కొనుగోళు నెమ్మదిగా సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల పరిస్థితులకు ఇదే నిదర్శనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీతో అందించడంతో పాటు గన్ని బ్యాగులు, సుతిలి వంటి అవసరమైన సామగ్రిని సమకూరుస్తోందని తెలిపారు. అయినప్పటికీ రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం చేసి కేంద్రంపై నెపం మోపే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. వెంటనే చర్యలు తీసుకుని రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని, లేకపోతే రైతుల పక్షాన భారతీయ జనతా పార్టీ పోరాటానికి దిగుతుందని స్పష్టం చేశారు. రైతులతో మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ రెడ్డి, ఏలే చంద్రశేఖర్, తుమ్మల మురళీధర్ రెడ్డి, జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, మోర్చా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## రిలయన్స్ రిటైల్ చేతికి ప్రియాంక చోప్రా బ్యూటీ బ్రాండ్

**న్యూఢిల్లీ:**రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ తన బ్యూటీ, పర్సనల్ కేర్ విభాగంపై మరింత దృష్టి సారించింది. ఇషా అంబానీ నేతృత్వంలోని ఈ సంస్థ ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న బ్రాండ్లను తమ పోర్ట్‌ఫోలియోలోకి చేర్చుకోవడం ద్వారా మార్కెట్లో పట్టు సాధించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే నటి ప్రియాంక చోప్రాకు చెందిన హెయిర్‌కేర్ బ్రాండ్ అనోమలీని కొనుగోలు చేసినట్లు తాజాగా ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా అనోమలీ బ్రాండ్‌కు సంబంధించిన ట్రేడ్‌మార్క్‌లు, ఆస్తులు, డిజిటల్ ప్రాపర్టీలన్నీ రిలయన్స్ రిటైల్ సొంతమయ్యాయి. 2021లో ప్రియాంక చోప్రా ఈ బ్రాండ్‌ను ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులను అందించడంపై దృష్టి పెడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో బలమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ కలిగి ఉంది. ఈ బ్రాండ్‌ను కొనుగోలు చేయడం ద్వారా రిలయన్స్ తనకున్న భారీ స్టోర్ల నెట్‌వర్క్ ద్వారా భారత్ సహా అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరించనుంది. బ్రాండ్‌ను రిలయన్స్ కొనుగోలు చేసినప్పటికీ ప్రియాంక చోప్రా క్రియేటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతారు.

# మళ్లీ 24వేల దిగువకు నిఫ్టీ

### నష్టాల్లో ముగిసిన సూచీలు..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఇరాన్ ఓడరేవులపై దీర్ఘకాలం పాటు దిగ్బంధనం కొనసాగించేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయించడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఓ దశలో ఏకంగా 120 డాలర్లు దాటింది. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, రూపాయి విలువ పతనం మన సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24 వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లు పతనమై రూ.469 లక్షల కోట్ల నుంచి రూ.464 లక్షల కోట్లకు క్షీణించింది.అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,014.21 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,496.36) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,258.86 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 582.86 పాయింట్ల నష్టంతో 76,913.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 180.10 పాయింట్ల నష్టంతో 23,997.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం ఓ దశలో 95 మార్కు దాటి 94.90కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు 4,634 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## పీసీ తరహా సదుపాయాలతో వన్‌ప్లస్ ప్యాడ్ 4..

**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్.. ప్యాడ్ 4ను దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. పీసీ తరహాలో వినియోగించేందుకు ప్రొడక్టివిటీ ఫీచర్లతో దీన్ని విడుదల చేసింది. క్వాల్‌కామ్ ఫ్లాగ్‌షిప్ ప్రాసెసర్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5తో ఈ ప్యాడ్ పనిచేస్తుంది. ధర, ఇతర వివరాలు చూద్దాం.వన్‌ప్లస్ ప్యాడ్ 4లో 13.2 అంగుళాల 3.4ఐ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 144 ఊళి రిఫ్రెష్ రేటుకు సపోర్ట్ చేస్తుంది. డాల్బీ విజన్, 1000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 12 బిట్ కలర్ డెప్త్ ఉన్నాయి. ఆక్సిజన్ ఓఎస్16తో పనిచేస్తుంది. ఇందులో పీసీ తరహాలో రీసైజెబుల్ విండోస్, డ్రాగ్ అండ్ డ్రాప్ సపోర్ట్, మెరుగైన ఫైల్ మేనేజ్‌మెంట్, సెకండ్ స్క్రీన్ ఫంక్షన్, క్రాస్ డివైజ్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఏఐ రైటర్, ఏఐ సమరీ, ఏఐ ట్రాన్స్‌లేట్, ఏఐ పెయింటర్, రియల్‌టైమ్ ట్రాన్స్‌స్క్రిప్షన్, సమరైజేషన్‌తో కూడిన ఏఐ రికార్డర్ వంటి ఏఐ ఫీచర్లు ఉన్నాయి.వన్‌ప్లస్ ప్యాడ్ 4లో మొత్తం ఎనిమిది స్పీకర్లు ఉన్నాయి. 40,670 స్క్వేర్ ఎంఎం వ్యాపర్ చాంబర్ కూలింగ్ సిస్టమ్ కూడా ఉంది. వైఫై 7, బ్లూటూత్ 6.0కు సపోర్ట్ చేస్తుంది. మెరుగైన సిగ్నలింగ్ కోసం ఏఐ పవర్డ్ స్మార్ట్ ఏంటెనా ఇచ్చారు. మెటల్ బాడీ డిజైన్, 5.94 ఎంఎం థిక్‌నెస్‌తో కూడిన ఈ ప్యాడ్ బరువు 672 గ్రాములు. వన్‌ప్లస్ స్టైలో ప్రో, స్మార్ట్ కీబోర్డ్‌కూ సపోర్ట్ చేస్తుంది. ఇందులో 13,380 ఎంఏహెచ్ బ్యాటరీ.. 80చి ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 20 గంటల పాటు వీడియో ప్లేబ్యాక్, ఏడు గంటల పాటు గేమింగ్ ఆడుకోవచ్చని కంపెనీ పేర్కొంది.

# బ్యాంకింగ్ రంగంలో పెను మార్పు

### 2027 ఏప్రిల్ నుంచి ఈసీఎల్ నిబంధనలు

### ప్రభుత్వ బ్యాంకులపై ఒత్తిడికి సంబంధించి భిన్నాభిప్రాయాలు



**న్యూఢిల్లీ:**భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద మార్పునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శ్రీకారం చుట్టింది. అంచనా వేసిన రుణ నష్టం (ఈసీఎల్- ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్) నిబంధనలను 2027 ఏప్రిల్ 1 నుంచి కచ్చితంగా అమలు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నిబంధనల అమలుకు గడువు పొడిగిస్తారని ఆశించిన మదుపరులకు ఈ ప్రకటన కొంత నిరాశ మిగిల్చింది. ఫలితంగా మంగళవారం స్టాక్ మార్కెట్లో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కనిపించింది.ప్రస్తుతం బ్యాంకులు తాము ఇచ్చిన రుణం ఎగవేతకు గురైన తర్వాతే.. నష్టాలను గుర్తిస్తూ, దానికి తగ్గట్టుగా నిధులను పక్కన (ప్రొవిజనింగ్) పెడుతున్నాయి. ఈసీఎల్ విధానంలో 'భవిష్యత్తులో రాబోయే నష్టాలను ముందుగానే అంచనా వేసి, దానికి తగిన నిధులను బ్యాంకులు కేటాయించాల్సి ఉంటుంది'. దీనికోసం బ్యాంకులు రుణాలను మూడు దశలుగా విభజిస్తాయి.

ఒకటో దశ: క్రెడిట్ రిస్కు ఏమాత్రం పెరగని, సక్రమంగా చెల్లింపులు జరుగుతున్న రుణాలకు, రాబోయే 12 నెలల్లో ఎదురయ్యే నష్టాలను ముందస్తుగా అంచనా వేసి నిధులు కేటాయించాలి.రెండో దశ: రుణగ్రహీత చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటూ, క్రెడిట్ రిస్కు గణనీయంగా పెరిగిన రుణాలకు.. కేవలం సమీప కాలానికి మాత్రమే కాకుండా, ఆ లోన్ జీవితకాలంలో రాగల మొత్తం నష్టాలను అంచనా వేసి, ఆ మేరకు నిధులను పక్కన పెట్టాలి. ఈ దశలోనే బ్యాంకులపై అత్యధిక భారం పడే అవకాశాలున్నాయి.మూడో దశ: మొండి బకాయిల (ఎన్‌పీఏ) కింద పరిగణించే ఈ దశలో, ఖాతాలకు జీవితకాల నష్టాలకు పూర్తి స్థాయిలో కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.

ఇదీ ప్రయోజనం :బ్యాంకింగ్ రంగంలో పారదర్శకత, స్థిరత్వం పెంచేందుకు ఈ విధానం తెస్తున్నామని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఖాతాలను మొండి బాకీలుగా గుర్తించేందుకు ప్రస్తుత 90 రోజుల గడువు నిబంధనను ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించనుంది.

అనుకూలమన్న మూడీస్:ప్రభుత్వ బ్యాంకులపై ఒత్తిడి ఉంటుందన్న వాదనను రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తోసిపుచ్చింది. నిబంధనల అమలును నాలుగేళ్ల పాటు దశలవారీగా అమలు చేయనున్నందున బ్యాంకుల మూలధనంపై 50-80 బేసిస్ పాయింట్ల పరిమిత ప్రభావమే ఉంటుందని మూడీస్ పేర్కొంది. మొదటి రోజే మూలధనం భారీగా పడిపోకుండా దశలవారీ విధానం కాపాడుతుందని, డివిడెండ్ల చెల్లింపులను కొంచెం తగ్గించుకోవడం వంటి చర్యలతో బ్యాంకులు ఈ మార్పును చాలా సులభంగా సర్దుబాటు చేసుకుంటాయని మూడీస్ విశ్లేషించింది.

ప్రభుత్వ బ్యాంకులపై భారం? :తాజా నిబంధనల వల్ల పీఎస్‌బీల నికర విలువపై ఒకేసారి 5-10% భారీ కోత పడే ప్రమాదం ఉందని బ్రోకరేజీ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకుల వ్యయాలు 20-25 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని మెక్వారీ బ్రోకరేజీ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. 30 నుంచి 90 రోజుల ఓవర్‌డ్యూ ఎక్కువగా ఉన్న హామీలేని రుణాలు, సూక్ష్మ రుణాలు, వాహన రుణాల విభాగాల్లో అధిక వాటా ఉన్న బ్యాంకులకు నష్టం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. గృహరుణాలు అధికంగా ఇచ్చే బ్యాంకులకు ఈ కొత్త విధానం సానుకూలమని విశ్లేషించింది.

**మారనున్న సమీకరణాలు..:**

ఇకపై రుణగ్రహీతల క్రెడిట్ రేటింగ్ గణనీయంగా క్షీణిస్తే, దాన్ని అధికారికంగా 'ఒత్తిడి సూచన'గా పరిగణించి, బ్యాంకులు తక్షణమే అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. గతంలో రేటింగ్ తగ్గితే బ్యాంకులు ముందుజాగ్రత్తగా ప్రొవిజనింగ్ పెంచేవి, కానీ అది కేవలం వారి పాలనా పద్ధతుల్లో భాగంగా ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం ఇది ఇకపై తప్పనిసరి కానుంది.

బ్యాంకింగ్ వ్యవస్థకు బలం..

'ఈసీఎల్ నిబంధనలపై బ్యాంకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది బ్యాంకింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసే ఒక నిర్మాణాత్మక మార్పు. ఈ నిబంధనల వల్ల బ్యాంకింగ్ పరిశ్రమపై మొత్తంగా రూ.50,000-60,000 కోట్ల కేటాయింపుల భారం పడనుంది. ఈ మొత్తం బ్యాంకులు తట్టుకోలేనిదేమీ కాదు

బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి: యూనియన్ బ్యాంక్ 3.07%, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.53%, కెనరా బ్యాంక్ 2.42%, బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.27%, బీఓబీ 2.26%, పీఎన్‌బీ 2.19%, ఇండియన్ బ్యాంక్ 1.88%, సెంట్రల్ బ్యాంక్ 1.26%, యూకో బ్యాంక్ 1.20%, ఐఓబీ 1.05% నీరసపడ్డాయి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,37,900 | ₹ 1,50,440 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,65,000

# సింగారానికే కాదు.. 'భవిష్యత్తు'కూ బంగారం

### జనవరి-మార్చిలో మొత్తం 151 టన్నుల పసిడి కొనుగోళ్లు

### ఇందులో 82 టన్నుల మేర బిస్కెట్లు, నాణేలు, ఈటీఎఫ్‌లే



భారతీయులకు సహజంగానే పసిడి ఆభరణాలపై మక్కువ ఎక్కువ. పండగలు, పెళ్లిళ్ల వంటి శుభకార్యాల్లో ఇంటి ఆడపడుచులు తళుక్కుమనేది బంగారు ఆభరణాల సింగారంలోనే. ధరలు గణనీయంగా పెరుగుతుండటం, ఆభరణాలు చేయించినప్పుడల్లా బంగారం తరుగు, తయారీ ఛార్జీల రూపంలో వెచ్చించే మొత్తం పెరుగుతుండటంతో.. మేలిమి (24 క్యారెట్ల) బంగారం రూపంలో కొనుగోలు చేసి, అట్టేపెట్టుకోవడం అధికమవుతోంది. బంగారం బిస్కెట్లు, నాణేల రూపంలో లోహాన్ని, డిజిటల్‌గా ఈటీఎఫ్‌ల రూపంలో పసిడిపై పెట్టుబడులు పెట్టేవారు పెరిగారు. ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా పెట్టుబడుల రీత్యా పసిడి కొనుగోళ్లు 54% పెరిగి 82 టన్నులకు చేరుకుంది. ఆభరణాల గిరాకీ 19% తగ్గి 66 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక వెల్లడించింది. విలువ పరంగా ఇది రూ.68,100 కోట్ల నుంచి 47% పెరిగి రూ.99,900 కోట్లకు చేరింది. పరిమాణం రీత్యా 2025 తొలి త్రైమాసిక మొత్తం గిరాకీ 137 టన్నులతో పోలిస్తే, సమీక్షా త్రైమాసికంలో 10% అధికమై 151 టన్నులకు; విలువ రీత్యా రూ.2,27,500 కోట్లకు చేరుకుంది.2026పై అంచనాలివీ: ఈ ఏడాది దేశంలో 650-750 టన్నుల పసిడికి గిరాకీ లభించొచ్చు. 2025లో ఇది 712 టన్నులుగా ఉంది. ఈ ఏడాది మొత్తం గిరాకీలో 41% వాటా పెట్టుబడుల రీత్యా కొనుగోళ్లదే అవుతుందని నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరం (34%) తర్వాత పెట్టుబడులకు గిరాకీ ఈ స్థాయిలో ఉండడం ఇప్పుడే. అంతర్జాతీయంగా ఈ గిరాకీలో భారత వాటా 13%.

బిస్కెట్లు, నాణేలు కళకళ: బంగారం బిస్కెట్లు, నాణేలకు గిరాకీ 2025 జనవరి-మార్చితో పోలిస్తే ఈసారి 34% పెరిగి 62 టన్నులకు చేరుకుంది. 2013 తర్వాత అత్యధిక త్రైమాసిక స్థాయి ఇదే. విలువ పరంగానూ 142% వృద్ధితో రూ.94,100 కోట్లకు చేరుకుంది. ఈటీఎఫ్‌లు జనవరి-మార్చిలో 20 టన్నుల నికర గిరాకీని కనబరచాయి. పసిడి ధరలు పెరగడం, దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్తబ్దుగా ఉండడంతో మదుపర్లు పసిడి ఈటీఎఫ్‌ల వైపు మొగ్గుచూపారు. పాత బంగారం మార్పిడి 31.2 టన్నులకు చేరుకుంది. 2025 తొలి త్రైమాసికంతో పోలిస్తే ఇది 20% అధికం. పసిడి దిగుమతులు 141.2 టన్నుల నుంచి 39% పెరిగి 186 టన్నులకు చేరుకున్నాయి.

**గిరాకీ ఎలా ఉండొచ్చంటే..**

సమీప కాలంలో ఆభరణాల గిరాకీకి అధిక ధరలు అడ్డుకట్టగా మారొచ్చు. అయితే పెళ్లిళ్ల సీజను, ప్రాంతీయ పండగలు కొంత మద్దతు ఇవ్వొచ్చు. అక్షయ తృతీయ నాడు కనిపించిన సానుకూల ధోరణి కొనసాగొచ్చు. అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య పసిడి ఒక సురక్షిత పెట్టుబడి సాధనంగా కొనసాగుతుంది.
డబ్ల్యూజీసీ భారత సీఈఓ సచిన్ జైన్

అంతర్జాతీయ గిరాకీ 2% పైకి

**విలువ పరంగా 74% వృద్ధి**

అంతర్జాతీయ పసిడి గిరాకీ 2% పెరిగి జనవరి-మార్చిలో 1231 టన్నులకు చేరుకుంది. విలువ పరంగా ఇది 74% పెరిగి 193 బి. డాలర్లకు దూసుకెళ్లింది. బిస్కెట్లు, నాణేలపై పెట్టుబడులు 42% పెరిగాయి. ఆభరణాలకు గిరాకీ ప్రపంచవ్యాప్తంగా 23% తగ్గి 300 టన్నులకు పరిమితమైంది. పసిడి సగటు ధర 2025 జనవరి-మార్చిలో ఔన్సు (31.10 గ్రా) 2860 డాలర్లుగా ఉండగా.. ఈ జనవరి-మార్చిలో 81% పెరిగి 4873 డాలర్లుగా ఉంది. పెట్టుబడుల రీత్యా కొనుగోళ్లు భారత్, దక్షిణ కొరియా, జపాన్‌లలో పెరిగాయి. అమెరికాలో 14%, ఐరోపాలో 50% వృద్ధి కనిపించింది. ఆభరణాలకు గిరాకీ చైనాలో 32%, పశ్చిమాసియాలో 23% తగ్గింది.కేంద్ర బ్యాంకులు 244 టన్నుల పసిడిని విదేశీ మారకపు ద్రవ్యంలో జత చేశాయి. ఇందులో ఆర్‌బీఐ వాటా 300 కిలోలుగా ఉంది.

## బెంగాల్ ప్రజలు మావెంటే..

ఎక్స్ వేదికగా మమతా బెనర్జీ ఓ వీడియో సందేశం పోస్టు చేశారు.ఎన్నికల ఫలితం ఇప్పటికే తమ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినా.. విజయం మాత్రం టీఎంసీదే అని తేల్చి చెప్పారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలపైనా మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. ఎగ్జిట్ పోల్ గణాంకాలను బీజేపీ కార్యాలయం నుంచే విడుదల చేశారంటూ ఆరోపణలు గుప్పించారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతల్లో భయాందోళనలు సృష్టించేందుకు బీజేపీ సంఖ్యలను తారుమారు చేసిందని మండిపడ్డారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తన మద్దతుదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నిక వేళ తన నియోజకవర్గం భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని మమతా ఆరోపించారు. ఓట్ల లెక్కింపు నాడు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపును నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం టీఎంసీదే అని మరోసారి స్పష్టం చేశారు

## ఎల్ఆర్ఎస్‌పై 25% రాయితీ

ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, మరియు పంచాయతీ రాజ్ కమిషనర్ సహా సంబంధిత అధికారులందరినీ ఆదేశించారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా పరిష్కారం లభిస్తుందని, తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే సువర్ణావకాశం ప్రజలకు దక్కిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# ఇన్ఫోసిస్‌లో లేఆఫ్‌ల్లేవ్

### సీఈఓ సలీల్ పరేఖ్

కృత్రిమ మేధ ప్రభావంతో దిగ్గజ కంపెనీల్లో కొనసాగుతోన్న లేఆఫ్‌లు ఆందోళనకు గురిచేస్తోన్న వేళ.. ఇన్ఫోసిస్ గుడ్‌న్యూస్ చెప్పింది. తమ సంస్థల్లో ఉద్యోగుల తొలగింపులు చేపట్టబోమని వెల్లడించింది. రానున్న రోజుల్లో కొత్త నియామకాలు, నైపుణ్యాల పెంపుపై తమ కంపెనీ దృష్టిసారించనున్నట్లు తెలిపింది.గతేడాది ఇన్ఫోసిస్‌లో ఎలాంటి లేఆఫ్‌లు చేపట్టలేదని కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్ మనీకంట్రోల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రాబోయే రోజుల్లోనూ తొలగింపులు ఉండబోవని వెల్లడించారు. ఏఐ రాకతో ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో కొన్ని మార్పులు ఉన్నప్పటికీ.. కృత్రిమ మేధతో పని పరిధి మరింత విస్తరిస్తుందన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాల కోతలు ఉండబోవని అభిప్రాయం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధను అందిపుచ్చుకుని తమ ఉద్యోగులకు ఆ నైపుణ్యాల్లో మరింత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో కంపెనీ కనీసం 20,000 మంది ఫ్రెషర్లను నియమించుకునే ప్రణాళికలో ఉందని ఇటీవల ఇన్ఫీ ప్రకటించిన సంగతి తెలిసిందే.ఇదిలాఉండగా.. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా టెక్ కంపెనీల్లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఏఐ సేవల కోసం బిగ్ టెక్ కంపెనీలు డేటా సెంటర్లు, ఇతర మౌలిక వసతులకు బిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరించాల్సి వస్తోంది. దీంతో ఆయా కంపెనీలు ఖర్చు తగ్గింపు పనిలో పడ్డాయి. ఇప్పటికే మెటా, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు ఈ ఏడాదికి కోతలను ప్రకటించాయి.




### ప్రతికూల వాతావరణ పరిస్థితులతో అదుపుతప్పి..

## లోయలో పడిన జీపు

ఖాట్మండు(జనంసాక్షి): నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోల్పా జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఓ ప్రైవేటు జీపు అదుపుతప్పి 700 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో 17 మంది మృతి చెందారు. స్థానికులు జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారి పడిందని పోలీసులు వెల్లడించారు. ప్రతికూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందన్నారు. ఘటన సమయంలో వాహనంలో ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదని అధికారులు పేర్కొన్నారు.




## పాత పీఎఫ్ ఖాతాలకు మళ్లీ ప్రాణం

### ఇ-ప్రాప్తి పేరుతో కొత్త వెబ్ పోర్టల్

### త్వరలోనే అందుబాటులోకి: ఈపీఎఫ్ఓ

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారుల కోసం ఒక శుభవార్త. ఏళ్ల తరబడి మూలనపడిన, మర్చిపోయిన పాత పీఎఫ్ ఖాతాలను ఆధార్ ద్వారా గుర్తించి, వాటికి మళ్లీ ప్రాణం (యాక్టివేట్) పోసేందుకు ఇ-ప్రాప్తి పేరుతో సరికొత్త డిజిటల్ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బుధవారం వెల్లడించారు. ఈ కొత్త పోర్టల్ ద్వారా పత్రాల సమర్పణ, వ్యక్తుల ప్రమేయం తగ్గి.. సేవల్లో పారదర్శకత, సామర్థ్యం పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోర్టల్‌కు ఇ-ప్రాప్తి (ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆధార్-బేస్డ్ యాక్సెస్ పోర్టల్ ఫర్ ట్రాకింగ్ ఇనాపరేటివ్ అకౌంట్స్) అని పేరు పెట్టినట్లు తెలిపారు.

**కంపెనీలు మారినప్పుడు:** చాలామంది ఉద్యోగులు కంపెనీలు మారినప్పుడు పాత పీఎఫ్ ఖాతాల్లోని చిన్న మొత్తాలను బదిలీ చేసుకోకుండా అలాగే వదిలేస్తుంటారు. 2024 ఆర్థిక సంవత్సరం చివరికి ఇలాంటివి 21.55 లక్షల నిష్క్రియ ఖాతాలు ఉన్నట్లు, వాటిలో ఏకంగా రూ.8,505 కోట్లకు పైగా నిధులున్నాయని అంచనా. 2019 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఇది 5 రెట్లు అధికం. ఈ సమస్య పరిష్కారానికి ఇ-ప్రాప్తి పోర్టల్ తోడ్పడనుంది. ఆధార్ ద్వారా సురక్షితంగా లాగిన్ అయ్యి, పాత ఖాతాలను లింక్ చేసుకుని, నిధులను సంబంధిత చందాదార్లు తిరిగి పొందొచ్చు.

**ఈపీఎఫ్ ఓ 3.0లో భాగంగా:**ఇ-ప్రాప్తి పోర్టల్ ఈపీఎఫ్ఓ పోర్టల్ 3.0 డిజిటల్ పరివర్తనలో ఒక కీలక భాగం. సేవలను మరింత వేగవంతం చేసి, వ్యక్తుల ప్రమేయాన్ని తగ్గించేందుకు, యాంత్రికంగా క్లెయిముల చెల్లింపులు, యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలు, సెంట్రల్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ (సీపీపీఎస్) వంటి పలు నూతన విధానాలను సంస్థ అందుబాటులోకి తీసుకురానుంది. దీనిద్వారా దేశంలో డిజిటల్ ఆర్థిక సేవలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నారు.

**నిబంధనల్లో మార్పులు..:**2014 నుంచి పీఎఫ్ ఖాతాలకు ఈపీఎఫ్ఓ 12 అంకెల యూఏఎన్ కేటాయిస్తోంది. ఇది వినియోగంలోకి రాకముందు పాత ఖాతాల గురించి తెలుసుకోవడం కష్టంగా ఉండేది. గతంలో నిష్క్రియ ఖాతాలకూ ఈపీఎఫ్ఓ వడ్డీ చెల్లించేది. 2011, 2016ల్లో నిబంధనలు మార్చి, 36 నెలలపాటు ఎలాంటి లావాదేవీలు లేకపోతే వడ్డీ చెల్లింపులు నిలిపివేశారు. రూ.1,000 కంటే తక్కువ నగదు నిల్వ ఉన్న ఖాతాలను నేరుగా వెనక్కి ఇచ్చే పైలెట్ ప్రాజెక్టును ఈపీఎఫ్ఓ గతంలో చేపట్టింది. ఈ నేపథ్యంలోనే పాత ఖాతాలను గుర్తించేందుకు 'ఇ-ప్రాప్తి' ఒక క్రమబద్ధమైన విధానాన్ని అందించనుంది.

**గుర్తు లేని ఖాతాలకూ..:**

తమ పాత ఐడీలు గుర్తులేని లేదా యాక్సెస్ చేసుకోవడం సాధ్యం కాని సభ్యులకూ ఈ పోర్టల్ సేవలను విస్తరించే ఆలోచనలో ఉన్నట్లు మాండవీయ వివరించారు. ఈపీఎఫ్ఓ సేవలు వేగవంతమయ్యాయని పేర్కొంటూ.. కొన్ని గణాంకాలు వివరించారు. 2025-26లో ఈపీఎఫ్ఓ రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిములను పరిష్కరించింది.అడ్వాన్స్ లేదా పాక్షిక ఉపసంహరణల కోసం 5.51 కోట్ల మంది సభ్యులు క్లెయిం చేసుకున్నారు. అడ్వాన్స్ క్లెయిమ్‌లలో 71.11% అభ్యర్థనలు ఆటోమేటిక్‌గా, 3 రోజుల్లోనే పరిష్కారమయ్యాయి.చెక్ అప్‌లోడ్ చేయాల్సిన ఇబ్బంది లేకుండా 6.68 కోట్ల మంది సభ్యులు క్లెయిము చేసుకోగా, 1.59 కోట్ల మంది తమ యజమానుల అనుమతి లేకుండానే తమ బ్యాంకు ఖాతాలను పీఎఫ్ ఖాతాలకు అనుసంధానం చేసుకున్నారు.




# అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ జీడిమెట్ల 'ఐలా'

## నిబంధనలు తుంగలోకి.. 40 ఏళ్ల నాటి అనుమతులతో షెడ్ల కట్టడాలు

- పట్టించుకోని టీజీఐఐసీ అధికారులు
- ప్రమాదాల అంచున కార్మికుల ప్రాణాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

**కుత్బుల్లాపూర్, (జనంసాక్షి) :**
జీడిమెట్ల టిజిఐఐసి పారిశ్రామిక వాడలోని "ఐలా"లో అవినీతి రాజ్యమేలుతోంది. నిత్యం పారిశ్రామికవాడలో జరిగే అనుకోని విపత్తులు, అగ్నిప్రమాదాల వల్ల కార్మికుల ప్రాణాలు పోతున్న ఇక్కడి అధికారులు, సిబ్బందిలో చలనం శూన్యంగా మారింది. ఇండస్ట్రీయల్‌లో వెలిసే కమర్షియల్ నిర్మాణాల్లో సరైన అనుమతులతో పర్మిషన్స్ ఇవ్వాల్సిన టిజిఐఐసి అధికారుల "ధనదహానికి" అడ్డు అదుపు లేకపోవడంతో అక్రమనిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి.
ఐలా అధికారులు, సిబ్బంది చేతివాటంతో జీడిమెట్ల పారిశ్రామికవాడలో అక్రమనిర్మాణాదారులు రెచ్చిపోతున్నారు. దీంతో ఇండస్ట్రీయల్ లోని కంపెనీల్లో పనిచేసే కార్మికులు, తమ కుటుంబాల జీవితాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. జీడిమెట్ల పారిశ్రామికవాడలో వెలిసే అన్ని నిర్మాణాలకు "ఐలా నిబంధనలతో కూడిన పర్మిషన్" లు తప్పనిసరి. ఇండస్ట్రియల్ లో వెలిసే ప్రతి కమర్షియల్ నిర్మాణాల్లో సరైన సెట్ బ్యాక్ లతో పాటు ఫైర్ సేఫ్టీ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీలతోనే నిర్మాణాలు చేపట్టాలి.రానున్న కాలంలో అనుకోని ప్రమాదాలు ఏమైన సంభవించినప్పుడు అందులో పనిచేసే కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు వీలుగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. కానీ జీడిమెట్ల ఐలా పరిదిలో మాత్రం పరిస్థితులు పూర్తిగా విభిన్నం..ఏళ్ల కాలంగా లేని పర్మిషన్స్ అయిన,ఐలా లో పర్మిషన్ కోసం అప్లై చేసుకోకున్నా విచ్చలవిడిగా ఇల్లీగల్ నిర్మాణాలు భేషరతుగా కట్టుకోవచ్చు. దానికి కావాల్సింది కేవలం ఇక్కడి ఐలా అధికారుల చల్లని చూపు అదే అక్రమనిర్మాణాదారులకు "శ్రీరామరక్ష".

**40ఏళ్ల క్రితం పర్మిషన్‌తో..**
జీడిమెట్ల ఇండస్ట్రియల్‌లోని పైప్ లైన్ రోడ్డులో గల సాయికాంట సమీపంలో దాదాపు 40ఏళ్ల క్రితం తీసుకున్న పర్మిషన్స్ తో వెలుస్తున్న ఈ అతిభారీ అక్రమషెడ్ నిర్మాణం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఐలాలో ఏదైన



నిర్మాణానికి అనుమతులు పొందితే కేవలం 6ఏళ్లవరకే దాని కాలపరిమితి.. 6ఏళ్లల్లో ఐలాకు సమర్పించిన ప్లాన్ కాపీ ఆధారంగా నిర్మాణాలు చేపట్టకపోతే పర్మిషన్‌లు రద్దు అవుతాయి. కానీ జీడిమెట్ల ఐలాలో ఓ "మేనేజర్ స్థాయి"లో ఉన్న వ్యక్తి ఈ ఇల్లీగల్ కట్టడాలన్నింటికి కార్యచరణ రూపుదాల్చుతూ అధికారులను సైతం తప్పుదోవపెట్టిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత గోడలపై వెలిసే కొత్త ఇల్లీగల్ షెడ్ల మొదలు,ఇండస్ట్రీయల్ లో వెలిసే ప్రతి అక్రమకట్టడానికి సంబంధమే లేని ఐలా కార్యవర్గ సభ్యులకు సంబంధించిన కట్టడాలంటూ,మరికొన్ని "ఐలా ఉన్నతాధికారులకు సంబంధించినవంటూ చెబుతూ కాలం వెల్లదీస్తూ అక్రమాలను పెంచిపోశిస్తున్నాడు.. దీనిపై సమగ్ర విచారణ జరిపి సదరు అధికారిపై చర్యలు తీసుకోని జీడిమెట్లలో పనిచేసే కార్మికుల ప్రాణాల రక్షణే ధ్యేయంగా పనిచేస్తూ,సరైన పర్మిషన్స్ రూపంలో ప్రభుత్వ కజానను సైతం నింపాలని స్థానికంగా డిమాండ్ చేస్తున్నారు.

**విరివిగా వెలుస్తున్న అక్రమభారీ షెడ్లు, గోదాంలు**
జీడిమెట్ల పారిశ్రామికవాడలోని జయరాజ్ స్టీల్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఓ భారీ ఇల్లీగల్ షెడ్ నిర్మాణం, నకోడా కెమికల్ ఫ్యాక్టరీ వద్ద వెలుస్తున్న ప్రమాదకరమైన గోదాంతో పాటు హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్ ముందు వెలిసే మరో షెడ్ నిర్మాణంతో ఇక్కడి ఐలా అధికారుల సహకారం అక్రమనిర్మాణాదారులకు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.. ఇప్పటికైనా ఇండస్ట్రీయల్‌లో వెలిసే ఆ ప్రమాదకరమైన ఇల్లీగల్ షెడ్లపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### రాజకీయాల్లో మహిళా సాధికారతకై

# 'తెలంగాణ శక్తి అభియాన్' ఉద్యమం

### కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ పిలుపు




**కరీంనగర్, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** రాజకీయ రంగంలో మహిళలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యంగా, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'తెలంగాణ శక్తి అభియాన్' కార్యక్రమాన్ని ఉధృతం చేస్తున్నట్లు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళల భాగస్వామ్యం లేని ప్రజాస్వామ్యం అసంపూర్ణమని, అందుకే రాజకీయాల్లో మహిళలకు 50% రిజర్వేషన్ సాధించడమే 'శక్తి అభియాన్' ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలను కేవలం ఓటర్లుగానే కాకుండా, నిర్ణయాధికారం కలిగిన నాయకులుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ లోని చైతన్యవంతులైన మహిళా సోదరీమణులు, యువతులు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని ఆయన కోరారు. రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న వారు, సామాజిక మార్పు కోసం పనిచేయాలనుకునే మహిళలు కింది సమన్వయకర్తలను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కృష్ణవేణి (తెలంగాణ శక్తి అభియాన్ కో-ఆర్డినేటర్) ఫోన్ 83677 37373, సి.ఎస్. శివలాల్ నేతికర్ ఫోన్ 9966482554 జిల్లాలోని ప్రతి డివిజన్, ప్రతి బస్తీ నుంచి మహిళలు ఈ ఉద్యమంలో చేరి, తమ గొంతుకను వినిపించాలని, రాబోయే రోజుల్లో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయడమే తమ ధ్యేయమని అంజన్ కుమార్ పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల మెరుపు దాడులు

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న చిన్నారుల అక్రమ రవాణా కేసులో గుజరాత్ పోలీసులు కీలక ముందడుగు వేశారు. కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లపై ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మురుగన్ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి సమాచారంతో నగరానికి చేరుకుని కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. అక్రమ రవాణాతో సంబంధం ఉన్న వారి వివరాలను సేకరించారు. పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, మురుగన్ గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఇటుక బట్టీలో కార్మికుడిగా పనిచేస్తూనే చిన్నారులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు విక్రయించేవాడు. ఒక కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించిన తర్వాత తిరిగి ఇదే దందాను విస్తరించినట్లు తెలిసింది. అతని భార్య కృష్ణవేణి కూడా మరో గ్యాంగ్‌ను నడుపుతూ ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగమైందని పోలీసులు గుర్తించారు. కేవలం ఏడాది కాలంలోనే ఈ ముఠా సుమారు 25 మంది చిన్నారులను విక్రయించినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పరచుకుని చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న ఈ ముఠా వెనుక ఉన్న పెద్ద నెట్వర్క్‌ను ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

# ఐదు రాష్ట్రాలలో బీజేపీకి అనుకూల ఫలితాలు

- కాంగ్రెస్ ఫెయిల్యూర్ గవర్నమెంట్ ... బిఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ
- మే 10న మోదీ సభ ద్వారా తెలంగాణకు దిశా నిర్దేశం
- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 30 (జనంసాక్షి):**
ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఉన్న రిపోర్టు, అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్లోని గణేష్ నగర్ బైపాస్ రోడ్డులో గల అదితి హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈనెల భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా ఈనెల 10న, "జనాగ్రహ సభ"ను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ పార్టీ సన్నాహాలు చేస్తుందని, ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏలా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని, ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్‌లో తొలి మేయర్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమని ఆయన అన్నారు.

## డంపింగ్ యార్డ్‌తో ప్రమాదంలో.. ప్రజల ప్రాణాలు

- వ్యాధులు విస్తరిస్తున్నాయంటూ మల్లారెడ్డి ఆగ్రహం
- తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



**దమ్మాయిగూడ, ఏప్రిల్ 30 (జనంసాక్షి):**
దమ్మాయిగూడలో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. స్థానిక ప్రజల ఆందోళనలకు మద్దతుగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి తదితర ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, కలుషిత మురుగునీటి వల్ల ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, వైరల్ జ్వరాలు, డెంగ్యూ వంటి సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రూ.150 కోట్లతో క్యాపింగ్ పనులు చేపట్టి, రూ.500 కోట్లతో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నగర చెత్తను ఒక్కచోటే వేయకుండా నాలుగు దిక్కులకు పంపించే ప్రణాళిక కూడా సిద్ధం చేశామని వెల్లడించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్రణాళికలను పూర్తిగా పక్కనపెట్టిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాల కంటే ప్రభుత్వానికి నిర్లక్ష్యమే ఎక్కువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు రోజుల్లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి డంపింగ్ యార్డ్ సమస్యపై మెమోరాండం అందజేస్తామని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ వసుపతి ప్రణిత శ్రీకాంత్ గౌడ్, అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపనబోయిన హరి నరసింహ గౌడ్, మాజీ కౌన్సిలర్లు వసుపతి రమేష్ గౌడ్, రామారం శ్రీహరి గౌడ్, వెంకటేష్, సీనియర్ నాయకులు నరహరి రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడా నరేష్, జేఏసీ కమిటీ సభ్యులు, నాగేశ్వరరావు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

### అవసరం మేరకు రసాయనాలు

# వినియోగించండి - ప్రకృతిని రక్షించండి





**పంట మార్పిడి పాటించండి - సుస్థిర ఆదాయం సాధించండి : మంత్రి పొన్నం ప్రభాకర్**

**చిగురుమామిడి, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** రైతులు అవసరం మేరకు మాత్రమే రసాయన ఎరువులు వినియోగిస్తూ ప్రకృతిని రక్షించుకోవాలని, సాగు ఖర్చులను తగ్గించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఆధునిక పద్ధతులు, కొత్త వంగడాలపై పరిశోధనలు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి పంటలపై అవగాహన కల్పించడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రైతులకు అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన వంగడాలు, యంత్రాలు, ఎరువులపై సూచనలు అందిస్తున్నారని చెప్పారు. రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలని, ముఖ్యంగా ఆయిల్ ఫామ్ సాగు ద్వారా మంచి లాభాలు పొందవచ్చని సూచించారు.
అలాగే సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, అందుకే శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వినియోగించాలని సూచించారు. చైతన్యవంతమైన రైతులు తమ జ్ఞానాన్ని ఇతరులతో పంచుకుంటే గ్రామీణ వ్యవసాయంలో పెద్ద మార్పులు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డా. ఝాన్సీ రాణి (డీన్, అగ్రికల్చర్, పీజేటీఎస్ఏయూ హైదరాబాద్), డా. ఎస్. హరీష్ కుమార్ శర్మ, డా. రాంప్రసాద్, డా. హరికృష్ణ, డా. కె. మదన్ మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్య లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి పున్నంచందర్ రెడ్డి, ఉద్యానవన అధికారి మంజువాణి తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జైలు శిక్ష

**ఒకరికి 14 రోజులు.. ముగ్గురికి 7 రోజులు**

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 (జనంసాక్షి):**
కరీంనగర్‌లో రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులకు గౌరవ న్యాయస్థానం జైలు శిక్షలు విధించింది. వీరిలో ఒకరికి 14 రోజుల జైలు శిక్ష విధించగా, మిగతా ముగ్గురికి తలా 7 రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో ఈ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా, నేరం రుజువవడంతో నాల్గవ స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ (ఎక్సైజ్ కోర్టు) ఈ తీర్పును వెలువరించారు.
శిక్ష పడిన వారిలో కరీంనగర్ పూదూరు ప్రాంతానికి చెందిన మామిడి కమల్ (25), రామగుండానికి చెందిన సయ్యద్ మజీద్ (30), పెద్దపల్లి జిల్లా కాసులపల్లికి చెందిన గుంజ సాగర్ (20)లకు తలా 7 రోజుల జైలు శిక్ష విధించబడింది. అలాగే కరీంనగర్ వల్లంపహాడ్‌కు చెందిన బొమ్మకంటి ప్రవీణ్ కుమార్ (40)కు 14 రోజుల జైలు శిక్ష విధించారు.
కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను జైలుకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు.

### దళితులను కులం మతం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

**గంగాధర, జనంసాక్షి :** దళితులను కులం, మతం పేరుతో దూషించినా అవమాణ పరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అంబటి రజిత అన్నారు.గురువారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధర తహసీల్దార్ అంబటి రజిత పాల్గొని మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమే అన్నారు. భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎస్.ఐ.వంశీకృష్ణ మాట్లాడుతూ దళితులను కులం మతం పేరుతో దూషిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దమ్మని రాము.గ్రామ సర్పంచ్ బాబాలక్ష్మి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్, నాయకులు ద్యావ శ్రీను, చిలుముల రాజయ్య, గంగాధర మోహన్, పాల్గొన్నారు.

# మే 1 నుండి విద్యుత్ భద్రత వారోత్సవాలు

- ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే లక్ష్యం
- వినియోగదారుల్లో భద్రతా అవగాహన పెంపొందించేందుకు 18 సర్కిళ్లలో ఘన కార్యక్రమాలు
- నిర్లక్ష్యం, అజాగ్రత్తలు ప్రమాదాలకు దారితీస్తాయి.. అప్రమత్తంగా ఉండాలి

**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** వినియోగదారుల్లో విద్యుత్ వినియోగ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మే 1 నుంచి 7 వరకు వారం రోజులపాటు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 18 సర్కిళ్లలో విద్యుత్ భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. గురువారం కరీంనగర్ సర్కిల్ హుజురాబాద్ డివిజన్‌లోని సింగాపూర్ సబ్‌స్టేషన్‌లో ఓ ఎ ఎం సిబ్బంది సమక్షంలో విద్యుత్ భద్రతపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి భద్రతా పరికరాలు ధరించి విధులు నిర్వహిస్తున్నారా అని తెలుసుకున్నారు. లైన్ల నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సర్కిల్‌కు నియమితులైన నోడల్ అధికారులు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి వినియోగదారులు, రైతులకు విద్యుత్ భద్రతపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం, అజాగ్రత్త, ఆలస్యం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, స్వీయ నియంత్రణ అత్యంత అవసరమని తెలిపారు.

**విద్యుత్ ప్రమాదాలకు ప్రధాన కారణాలు**
నిర్లక్ష్యంగా విద్యుత్ పరికరాల వినియోగం
నాసిరకం లేదా పాడైన వైర్ల వినియోగం
సరైన ఎర్తింగ్ లేకపోవడం
తడి చేతులతో విద్యుత్ పరికరాలను ఉపయోగించడం



**వినియోగదారులకు కీలక సూచనలు**
తెగి పడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు
వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి
తడి చేతులతో స్విచ్‌లు ఆపరేట్ చేయరాదు
గృహాలు, వ్యవసాయ క్షేత్రాల్లో సరైన ఎర్తింగ్ ఉండాలి
మీటర్లు, వైర్లు, స్విచ్‌బోర్డులను తరచూ తనిఖీ చేయించుకోవాలి
చిన్నపిల్లలను విద్యుత్ పరికరాల నుండి దూరంగా ఉంచాలి
విద్యుత్ శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రమాదకర లైన్లు, వంగిన స్తంభాలు, పాత వైర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడుతోంది. వినియోగదారులకు సురక్షితమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.
విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాద సూచనలు గమనించిన వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలి అని సీఎండీ సూచించారు.
విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎస్ఈ ఆర్. రవీందర్, డీఈలు లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, అనిల్ కుమార్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# లారీ డ్రైవర్ల అదనపు వసూళ్లు

- పెద్దవాల్గొట్ రైతుల ఆవేదన మరింత తీవ్రం
- రైస్ మిల్లుల వద్ద ఆలస్యం రైతులకు భారంగా మారింది

**సిరికొండ, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** సిరికొండ మండలం పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తూకం వేసిన వడ్లు కల్లాలలో ఎండిపోతుండగా, రైస్ మిల్లులకు పంపిన ధాన్యం కూడా సకాలంలో దించకపోవడం వల్ల రైతులకు నష్టం కలుగుతోంది. ఇప్పటికే సమస్యలతో సతమతమవుతున్న రైతులకు లారీ డ్రైవర్ల అదనపు వసూళ్లు మరో భారంగా మారాయి. ప్రతి సంచికి రూ.2 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రవాణా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ అదనపు భారం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు రైస్ మిల్లుల వద్ద లారీలను వెంటనే అన్‌లోడ్ చేయకపోవడంతో గంటల తరబడి, కొన్నిసార్లు రోజులు పాటు నిలిపివేస్తున్నారు. ఈ ఆలస్యాన్ని కారణంగా చూపుతూ డ్రైవర్లు రైతుల నుండి అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.
కాలూర్ ప్రాంతంలోని ఓ రైస్ మిల్ వద్ద లారీలను దించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు తెలిపారు. దీని వల్ల వడ్ల నాణ్యత దెబ్బతిని ఆర్థిక నష్టం కలుగుతోందని వారు వాపోతున్నారు. ఈ సమస్యలపై సంబంధిత డీఎస్ఓ అధికారిని సంప్రదించినప్పటికీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "తరుగు" పేరుతో జరుగుతున్న నష్టాలకు తోడు, లారీ డ్రైవర్ల అదనపు వసూళ్లు రైతులను మరింత కుదేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైస్ మిల్లుల వద్ద వెంటనే లోడ్లు దింపేలా చర్యలు తీసుకోవాలని, అదనపు వసూళ్లను అరికట్టాలని రైతులు డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కిషన్ రెడ్డి, పెద్ద గంగారెడ్డి, శ్రీనివాస్, ధర్మ రెడ్డి, చిన్న గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ మహిళ డిగ్రీ , పీజీ కళాశాలలో
# గ్రాడ్ గురు ఇన్నోవేషన్స్ కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్
### 40మంది విద్యార్థులకు ఉద్యోగాలు




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ , పీజీ కాలేజీలో బుధవారం రోజు నిర్వహించిన గ్రాడ్ గురు ఇన్నోవేషన్స్ కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా జరిగింది. ఈ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులకు రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మొదటిగా గ్రూప్ డిస్కషన్, తరువాత పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలను గ్రాడ్ గురు సంస్థకు చెందిన సీనియర్ మేనేజర్ మిస్ ఆర్తి చౌదరి, మేనేజర్ వినయ్ లు నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 150 మంది పాల్గొనగా 40 మంది విద్యార్థులు బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ హోదాకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3 లక్షల నుండి రూ.6 లక్షల వరకు ఇవ్వబడుతుందని కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... మా విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం మా కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం పై మేము ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు ఉత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పించడం మా లక్ష్యం అని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలతో కలిసి ఇలాంటి ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, టీపీఓ, అధ్యాపక వర్గం ఆనందం వ్యక్తం చేస్తూ, ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

# ధరిత్రి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
### సింగరేణి అర్జీ-1 జీఎం లలిత్ కుమార్



**గోదావరిఖని, జనంసాక్షి :** ధరిత్రి (భూమి) దినోత్సవం.. "ఎర్త్ మంత్" సందర్భంగా భూమిని కాపాడాలనే సంకల్పంతో రూపొందించిన "భూమి పరిరక్షణ ప్రతిజ్ఞ" పత్రాన్ని సింగరేణి ఆర్జ్-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ తన కార్యాలయంలో అధికారికంగా విడుదల చేశారు.
ఈ సందర్భంగా జి.ఎం. మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో గ్లోబల్ వార్మింగ్, పెరుగుతున్న కాలుష్యం కారణంగా మానవ జీవన విధానంలో అనేక ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అధికంగా రసాయనాల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటోందని, ఇది భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పుగా మారే అవకాశముందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణంపై బాధ్యతతో వ్యవహరించి, భూమిని కాలుష్య రహితంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జి.ఎం. ఆదేశాల మేరకు ఏరియా ఎన్విరాన్మెంట్ విభాగం ఆధ్వర్యంలో అర్జీ-1లోని వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (వీటిసి)లో భూమి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి "గ్రీన్ వారియర్" ఎన్జీఓ ప్రతినిధి జె.వి.ఎస్. చంద్రశేఖర్ పాల్గొని పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విటిసి మేనేజర్ మాధవరెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి వేణు, అధికారి వేణుగోపాల్, విటిసి ఇన్స్ట్రక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణము





### స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించిన విప్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా మరియు కన్నుల పండువగా జరిగింది. వైశాఖ శుద్ధ చతుర్దశి సందర్భంగా ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో గుట్టపై అంతా భక్తి ప్రపత్తులతో మార్మోగిపోయింది. ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చకుల వేద మంత్రోచ్చారణలు,మధ్య స్వామివారి కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా కొనసాగింది.
ఈ కళ్యాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో రమాదేవి ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి, ఆలయ సాంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలను అందజేశారు. అర్చకులు విజయ సింహచారి, రామకృష్ణ చారి, హర్షవర్ధన చారి ఆధ్వర్యంలో వేద మంత్రాలతో కళ్యాణతంతు నిర్వహించారు.కన్యాదాతలుగా రాచకొండ రామాచార్యులు సంధ్యారాణి వ్యవహరించారు.
అనంతరం వేద పండితులు,అర్చకులు మంత్రోచ్చారణల నడుమ కల్యాణ తంతును పూర్తి చేశారు.కల్యాణ వేడుక ముగిసిన తర్వాత, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు శేషవస్త్రాలను ప్రదానం చేసి, స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నాంపల్లి గుట్టను భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది పటిష్టమైన ఏర్పాట్లు చేశారని వారు ప్రశంసించారు. కళ్యాణ వేడుకల్లో సుమారు 1500 పైగా భక్తులు పాల్గొనగా కళ్యాణ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఆలయ ఈవో రమాదేవి,ఏఈవో అశోక్,సూపరిడెంట్ వెంకటరాజు, బిఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# సబితంలో పౌర హక్కుల దినోత్సవం

**పెద్దపల్లి, ఏప్రిల్ 30(జనంసాక్షి) :**
పెద్దపల్లి మండలం సబితం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో జరిగగా సర్పంచ్ నూనె సరోజ - రమేష్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ జిల్లా మాజీ కమిటీ సభ్యుడు కొంకటి లింగమూర్తి మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని అందరూ కలిసిమెలిసి ఉంటేనే సమాజం బాగుంటుందని అన్నారు. అలాగే పోలీస్ శాఖ కాని మెడికల్ శాఖ హాజరుకానందుకు లింగమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశాడు కొద్ది రోజుల కిందట రెండు కులాల మధ్య గొడవ జరిగిందనీ ఇంకా గొడవ పెద్దది కాకముందు పోలీసు శాఖ గాని రెవెన్యూ శాఖ దృష్టి పెట్టి గ్రామాన్ని సంతోషంగా ఉంచే విధంగా ప్రయత్నం చేయాలని లింగమూర్తి అన్నారు.ఎస్సీ కమిటీ సభ్యురాలు భాగ్యలక్ష్మి,కట్కూరు సందీప్, నవీన్ బాబు,రాజం కొంకటి,గ్రామ కార్యదర్శి దళిత నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో వాటర్‌మెన్ బదిలీలు నిలిపివేయాలి
### ఘట్కేసర్ డివిజన్‌లో నీటి సరఫరా సంక్షోభం తలెత్తే ప్రమాదం: అఖిలపక్ష నాయకులు



**ఘట్కేసర్, ఏప్రిల్ 30 ( జనం సాక్షి ):**
ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ఘట్కేసర్ సర్కిల్-6 పరిధిలో పనిచేస్తున్న వాటర్‌మెన్ బదిలీలను తక్షణమే నిలిపివేయాలని అఖిలపక్ష నాయకులు ఎంఎంసీ ఉప్పల్ జోన్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఘట్కేసర్ డివిజన్ పరిధిలోని ఘట్కేసర్, ఎన్ఎఫ్సీ నగర్, కొండాపూర్ ప్రాంతాలు ఇప్పటికీ గ్రామీణ పరిస్థితుల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాల్లో మిషన్ భగీరథ, బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, సరైన ప్రణాళిక లేకుండా పైపులైన్లు ఏర్పాటు చేయడంతో అనేక వాల్వ్ పాయింట్లు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కాలంలో ఏర్పాటు చేసిన పాత పైపులైన్ల ద్వారానే ఇప్పటికీ నీటి సరఫరా కొనసాగుతోందని, జీహెచ్ఎంసీలో విలీనం అయినప్పటికీ హెచ్ఎండబ్ల్యూఎస్ పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదని ఆరోపించారు. అధిక సంఖ్యలో వాల్వ్ పాయింట్లు ఉండటంతో ఎక్కువమంది వాటర్‌మెన్ అవసరం అవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం నేపథ్యంలో ప్రజలు తీవ్రమైన నీటి సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో వాటర్‌మెన్ బదిలీలు అమలు చేస్తే నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘట్కేసర్ డివిజన్‌లో గ్రౌండ్ లెవల్ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించి, ప్రణాళికాబద్ధంగా నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు వేముల సంజీవగౌడ్, మాజీ కౌన్సిలర్ బేతాళ నర్సింగ్ రావు, పన్నాల కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగరావు, పొట్లచెరువు శ్రీరాములు, మాజీ వార్డ్ సభ్యులు బురుగు శేఖర్ గుప్తా, భూషణం చారి, ప్రసన్న, గోరుకంటి రవీందర్, మేదరి సురేష్, కంది సాయిరాం, అక్బర్, ఖలీల్, సుబ్బారావు, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు
# రద్దు చేసేంతవరకు పోరు కొనసాగుతుంది

- ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసూఫ్
- సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పై మే రెండో వారంలో సమ్మె నోటీసు ఇస్తాం
- గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్ కుమార్




**గోదావరిఖని, జనంసాక్షి :** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసి, కార్మికుల కు నష్టం కల్గించే విధంగా ఏప్రిల్ లో అమలు లోకి తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ ల రద్దు కోసం మే డే స్ఫూర్తితో ఉద్యమాలను నిర్వహిస్తామని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసూఫ్ అన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బిజేపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల అమలు జరిగితే దాని వల్ల కలిగే కష్టనష్టాలను వివరించారు. ముఖ్యంగా పని గంటలు పెరుగుతాయని, జీతాల పెంపు యాజమాన్యం దయా దాక్షిణ్యాల పై ఆధారపడి ఉంటుందని, ఉద్యోగ భద్రత ఉండదని ఆయన అన్నారు, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడే ఉత్సవాల్లో ప్రతిన బూనాలని ఆయన కార్మికులకు పిలుపు నిచ్చారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ మెడికల్ బోర్డు పునరుద్ధరణ, మారుపేర్ల అంశం కార్మికులకు ప్రమోషన్ సహా సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను మే మొదటి వారంలోగా పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు, లేనియెడల అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని రెండో వారంలో సమ్మె కు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి, సిపిఐ నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజ్, మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, పి.విజయ లక్ష్మి, ఎం.ఎ.గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్సియల్స్‌గా మార్చాలి
### అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

- ప్రైవేటు విద్యా వ్యవస్థను రద్దు చేయాలి
- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ
- ఎస్వీకే లో టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు



**ముషీరాబాద్, ఏప్రిల్ 30 (జనం సాక్షి):**
సమాజంలో కొనసాగుతున్న అంతరాలను నిర్మూలించడంలో విద్య ప్రధాన భూమిక వహించాలని, అందుకుగాను అందరికీ సమానమైన, శాస్త్రీయ విద్య ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం విద్యా విధానాలను రూపొందించాలని టీపిటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరా బాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ అధ్యక్షతన కామన్ స్కూల్ విద్యా విధానం, శాస్త్రీయ విద్య అమలు, ప్రైవేట్ స్కూల్స్ రద్దు ఎజెండాగా రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఏఐఎఫ్ ఆర్టిఇ అధ్యక్ష వర్గ సభ్యులు ప్రొ. జి. హరగోపాల్, యం.ఎల్.సి ప్రొ.ఎం.కోదండ రాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతిలు పాల్గొని మాట్లాడారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వంచే ఏర్పాటైన విద్యా కమీషన్ రిపోర్టు సామాజిక, మానవీయ కోణంలో విద్యారంగ సిఫార్సులు లేవని, అందరికీ సమానమైన, నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే మౌలికమైన రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా సిఫార్సులు ఉన్నాయన్నారు. ప్రజా విద్యా వ్యవస్థను పటిష్ట పర్చడం, ప్రభుత్వ బడుల పరిరక్షణ, కామన్ స్కూల్ వ్యవస్థ వంటివి ప్రభుత్వాలు ప్రాధాన్యతా అంశాలుగా గుర్తించేటట్లు ప్రజా ఉద్యమ ఒత్తిడి పెరగాలన్నారు. అన్నివర్గాల ప్రజలను, యువతను, విద్యార్థులను, మేధావులను, ప్రజాస్వామిక వాదులను, విద్యావేత్తలను సమీకరించి విశాల ప్రజా ఉద్యమము నిర్మించబడాలని. ఈ కృషిలో ఉపాధ్యాయ ఉద్యమ కార్యకర్తలుగా టిపిటిఎఫ్ పాత్ర క్రియాశీలకంగా ఉంటుందన్నారు.

**జాతీయ విద్యా విధానం -రాజ్యాంగ విలువలు**

ప్రొ. జి. హరగోపాల్ మాట్లాడుతూ.. విద్య ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాశాయీకరణ ద్వారా తమ లక్ష్యాన్ని రాజకీయ ఎజెండాను పాలకులు సాధించాలనుకుంటున్నారనీ, భారతదేశం లౌకిక దేశమని మరిచి పాఠ్య పుస్తకాలలో మతభావజాలాన్ని చొప్పించి, దేశభక్తి జాతీయవాదం పేరుతో హిందూ మతతత్వాన్ని తరగతి గదుల్లో ప్రవేశ పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సృజనాత్మకత, హేతుబద్ధ ఆలోచనలను ధ్వంసం చేసి, నామ మాత్రంగానైన విద్యకు ఉన్న సెక్యుల ర్, ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేసి ఆధిపత్య సామాజిక నిర్మాణాలైన కులవ్యవస్థను, మతతత్వాన్ని పాలకులు దృఢపరిచే ఆలోచనలో ఉందన్నారు . భారత సమాజంలో అంతర్లీనంగా కొనసాగుతున్న శ్రామిక ప్రజల ప్రజాస్వామిక సాంస్కృతిని, మానవీయ విలువలను కాపాడుకునే కృషిలో ఉపాధ్యాయ ఉద్యమం ముందు వరుసలో నిలవాలని కోరారు.
యం.ఎల్.సి ప్రొ.ఎం. కోదండరాం మాట్లాడుతూ ఉపాధ్యాయునికి తరగతి గదే సమాజమని, ప్రభుత్వ విద్య సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ విద్యను కాపాడడానికి ప్రగతిశీల సంఘాలన్నీ ఉపాధ్యాయ సంఘాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు పి.నాగిరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం ప్రకాష్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.తిరుపతిరెడ్డి ,ఎం.రవీందర్ ,పి.నారాయణమ్మ ,డి.శ్రీనివాస్, లక్ష్మయ్య యాదవ్, యం.కృష్ణారెడ్డి ,రావులరమేష్, ఏ భుజంగరావు, డి. రాజయ్య, బి. రాజు, యస్. విజయ్, భోగ రమేష్, టీపీటీఎఫ్ జిల్లాల సభ్యులు, విద్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే యువతలో చైతన్యం : దాసరి ఉష

**పెద్దపల్లి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** నియోజకవర్గ వ్యాప్తంగా గత 15 రోజులుగా బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహంగా సాగిన జ్యోతిబా ఫూలే-అంబేద్కర్ జై యుగం కప్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో విజయవంతంగా ముగిసింది.ఓదెల మండల పరిధిలోని కనగర్తి పాఠశాల మైదానంలో ఆర్గనైజర్లు కళ్యాణం మహేష్,మద్దికుంట సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన ఫైనల్ పోరులో కొలనూర్ సందీప్ టీం వర్సెస్ కొమ్మిరె అనిల్ టీం జట్లు తలపడగా,కొలనూర్ జట్టు విజేతగా నిలిచి షీల్డ్ మరియు రూ.10వేల నగదు బహుమతిని గెలుచుకుంది.రన్నరప్‌గా నిలిచిన కొమ్మిరె జట్టు షీల్డ్ తో పాటు రూ.5వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది.అలాగే సుల్తానాబాద్ టౌన్ పరిధిలో జరిగిన పోటీలలో 8వ వార్డు జట్టు విన్నర్‌గా,6వ వార్డు జట్టు రన్నర్‌గా నిలిచాయి.ఫైనల్ మ్యాచ్‌కు బీసీ జేఏసీ జిల్లా చైర్పర్సన్ దాసరి ఉష ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కనగర్తి సర్పంచ్ చొప్పరి సంధ్యారాణి-కుమార్,ఉప సర్పంచ్ మచ్చ సాయి రాణికొలనూరు సర్పంచ్ పల్లె కనకయ్య,బీఆర్ఎస్ గ్రామ వైస్ ప్రెసిడెంట్ పిట్టల సదయ్య,మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజయ్య,మాజీ సర్పంచ్ తాళ్లపల్లి లక్ష్మణ్,వార్డు మెంబర్లు కుమార్,అమర్ తో పాటు అసెంబ్లీ ఆర్గనైజర్ మాలిక్,సాతూరి అనిల్, బండా నిఖిల్,దొడ్డి అశోక్,పరికిపండ్ల రామ్,పెండెం కుమార్,గ్రామ యువకులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి
- బడిబాట ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా పెంచాలి




**చిగురుమామిడి, ఏప్రిల్ 30 (జనంసాక్షి):**
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తహసీల్దార్, ఎంపీడీవో, ఏవోలు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని మండల కార్యాలయంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. చిగురుమామిడి మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండగా, 7 ఎమ్మార్వో, 7 ఎంపీడీవో, 7 వ్యవసాయ అధికారులు ఇన్‌చార్జీగా ఉంటారని, మొత్తం పర్యవేక్షణ డిపిఓ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రంలో ఒక జీపీవో, గ్రామ కార్యదర్శి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. టార్పాలిన్ సమస్యలు రాకుండా, లారీల సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.
చిగురుమామిడి మండలంలో వేసవి కాలంలో తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, పాత బావులు పూడికతీత చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. సుందరగిరిలో వేసిన బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంపై విద్యుత్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నీటి వనరులు ఉన్న బావుల నుండి పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. కొత్తపల్లి-హుస్నాబాద్ మధ్య నిర్మిస్తున్న నాలుగు లైన్ల రోడ్డులో పైప్‌లైన్ ఎందుకు షిఫ్ట్ చేయలేదని అధికారులను ప్రశ్నించారు. రాజీవ్ రహదారి కొత్తపల్లి నుండి హుస్నాబాద్ మధ్య జరుగుతున్న నాలుగు లైన్ రోడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, వర్షాకాలం వస్తే పనులకు ఆటంకాలు అవుతాయని సూచించారు. బడిబాట ద్వారా ఇంటింటికి తిరిగి పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. చిగురుమామిడి మండలంలో అన్ని పాఠశాలలకు పెయింట్స్ వేయడంతో పాటు, మౌలిక సదుపాయాలు, బెంచీలు, వాష్ రూములు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో ఒక్కో విద్యార్థికి ఉపాధ్యాయునికి నిష్పత్తి తక్కువగా ఉందని, విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు. చాలా గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రతిజ్ఞ చేస్తున్నారని, ఈసారి ప్రీ-ప్రైమరీ నుండి విద్యార్థులపై ఫోకస్ చేయాలన్నారు. స్వయంగా బడిబాట కార్యక్రమంలో తాను పాల్గొంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.
మండలంలో ఉన్న 31 పాఠశాలల్లో 1225 మంది విద్యార్థులున్నారని, వారి సంఖ్యను గణనీయంగా పెంచాలని సూచించారు. చిగురుమామిడి మండలంలో ఈసారు వన మహోత్సవం ద్వారా 80 వేల మొక్కలు నాటాలని అధికారులు పెట్టుకున్న లక్ష్యానికి మించి అదనంగా ప్లాంటేషన్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేసి వారి సహకారంతో మొక్కలు నాటాలని అన్నారు. మండలంలో కొత్త రోడ్లు పూర్తయిన ప్రాంతాల్లో ఇరువైపులా మొక్కలు నాటాలని ఆదేశించారు. మండలంలో 341 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవగా 42 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయి పని ప్రారంభం కాని 9 ఇళ్లు నోటీసులు ఇచ్చి రద్దు చేయాలని ఆదేశించారు. 193 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తయ్యాయని, జూన్ 2లోపు భారీగా ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం జరగాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.
పంచాయతీరాజ్ ఆర్ అండ్ డి రోడ్లు మంజూరు అయి పనులు ప్రారంభం కాని రోడ్లు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో విద్యుత్ లూస్ కేబుల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ప్రతి గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు.
అంగన్వాడి కొత్త భవనాలు నిర్మాణం పూర్తయినవి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ప్రారంభించుకోవాలి.
గ్రామాల్లో ఎక్కడ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, డిపిఓ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీధర్, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు గీకురు రవీందర్, సాంబారి బాబు, దాసరి ప్రవీణ్ కుమార్ నేత, పోలు స్వప్న, బోయిని వేణుగోపాల్, బోయిని వంశీకృష్ణ, పలు గ్రామాల సర్పంచులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కరెంటు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం
### 20 ఎకరాల్లో వరిగడ్డి దగ్ధం.. కాలి బూడిదైన రైతుల వ్యవసాయ పనిముట్లు
### ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



**గన్నేరువరం, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని చాకలివాని పల్లె గ్రామ శివారులో విద్యుత్ వైర్లు ఒకదానితో ఒకటి తగిలి నిప్పు రవ్వలు రాలాయి. దీంతో మంటలు ఎగిసిపడడంతో రేపాక బాలయ్య 4 ఎకరాలు, బోయిని లక్ష్మణ్, బోయిని నాగవ్వ, బోయిని సంపత్ కి చెందిన 12 ఎకరాల వ్యవసాయ పొలం వారి నుండి కూన శేఖర్ కౌలుకు తీసుకున్నాడు, రేపాక బాలయ్య, కూన శేఖర్ చెందిన గడ్డి కట్టలతో పాటు పైపులు, మామిడి చెట్లు, జామ చెట్లు, వ్యవసాయ పనిముట్లు,కాలి బూడిద అయ్యాయి, స్థానికులు తీవ్రంగా శ్రమించడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. గన్నేరువరం రెవెన్యూ అధికారులు జిపిఓ బండిపెల్లి తిరుపతి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**సమయానికిరాని ఫైర్ ఇంజన్...**

గురువారం చాకలివానిపల్లె గ్రామంలో దాదాపు 20 ఎకరాల వ్యవసాయ పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో గడ్డి కట్టలు, పైపులు వివిధ పనిముట్లు కాలిపోయాయి, అగ్నిమాపక వాహనం వచ్చేసరికి నష్టం జరిగింది. అగ్నిమాపక శాఖ సకాలంలో స్పందించకపోవడం వల్ల ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. పశుగ్రాసం తగలబడి పోతుంటే స్థానిక రైతులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అగ్నిమాపక సిబ్బంది మాత్రం ఘటన స్థలానికి రావడానికి ఎక్కువ సమయం పట్టింది, అంత కాలి బూడిద అయిన తర్వాత వచ్చారు. రోడ్డు సరిగా లేకపోవడం వల్లనే సమయం పట్టిందని ఫైర్ సిబ్బంది అన్నారని రైతులు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది స్పందించకపోతే అగ్నిమాపక కేంద్రాలు ఉండి ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులను అగ్నిమాపక అధికారులు చిన్న చూపు చూస్తున్నారనే వదంతులు వినిపిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉండి సకాలంలో మంటలను అదుపు చేసి ఆస్తులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి

- మంత్రి సీతక్క సూచన



**హైదరాబాద్, ఏప్రిల్30 (జనంసాక్షి)** : పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- మే డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వ పాలన
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి)** : కార్మిక లోకానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు 'మే డే' సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కార్మికుల శ్రేయస్సుకే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే శ్రామిక వర్గం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన కొనియాడారు. ముఖ్యంగా సింగరేణి చరిత్రలో నిలిచిపోయేలా కార్మికులకు రూ. కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించామని, అలాగే సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తూ కొండంత అండగా నిలుస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేసే కాంట్రాక్టు కార్మికుల కష్టాన్ని గుర్తించి, సంస్థ చరిత్రలోనే తొలిసారిగా వారికి రూ. 5 వేల బోనస్ అందించడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేసి కార్మిక బిడ్డలకు ఉపాధి కల్పించామని వివరించారు. ఇంధన శాఖ పరిధిలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేసే ఉద్యోగులకు సైతం రూ.కోటి ప్రమాద బీమాను వర్తింపజేస్తూ ప్రభుత్వం భరోసా ఇచ్చిందని తెలిపారు. ఆర్టీసీలో గత ప్రభుత్వ అణచివేత ధోరణిని పక్కనపెట్టి, కార్మిక ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు, త్వరలోనే ఎన్నికలు నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నామని, వారి 32 ప్రధాన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఆధునిక కాలంలో పెరుగుతున్న గిగ్ వర్కర్ల రక్షణ కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమాతో కూడిన ప్రత్యేక సంక్షేమ బిల్లును తీసుకువచ్చామని, అలాగే గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు.

# రేవంత్ తీరుతో పోలీస్ శాఖకు అప్రతిష్ట

**బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**



**హైదరాబాద్, ఏప్రిల్30 (జనంసాక్షి)** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పోలీసు డిపార్ట్‌మెంట్ బలి అవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కేసులో 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని విమర్శించారు. ఛార్జ్ షీట్‌లో బీఆర్ఎస్ నాయకుల పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఒక సీనియర్ జర్నలిస్టును ఇరికించి, అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తే బీఆర్ఎస్ నాయకుల పేర్లు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

# గాంధీ హాస్పిటల్‌లో స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్

**శుక్రవారం ప్రారంభించనున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**హైదరాబాద్ (జనంసాక్షి)** : గాంధీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రోత్సహించేందుకు, ప్రజలకు ఉచితంగా అవయవ మార్పిడి వైద్య సేవలను అందించేందుకు అత్యాధునిక సౌకర్యాలతో ప్రభుత్వం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. గాంధీ హాస్పిటల్ 8వ అంతస్తు, సౌత్ వెస్ట్ బ్లాక్‌లో సుమారు 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

ఈ సెంటర్‌లో లివర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు, ఎండోకాక్లియర్ ఇంప్లాంట్స్, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. మొత్తం 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఆపరేషన్ థియేటర్లకు అనుసంధానంగా ఆడిటోరియం, 3 ట్రాన్స్‌ప్లాంట్ ఐసోలేషన్ రూములు, 25 పడకల సామర్థ్యంతో 3 ఐసీయూలు, సర్జన్లు, అనస్థీషియా నిపుణుల కోసం ప్రత్యేక లాంజ్‌లు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ప్లాంట్ పేషెంట్ల తరలింపు కోసం ప్రత్యేకంగా లిఫ్ట్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌కు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, పవర్ కట్ సమయంలో ఆటోమేటిక్ పవర్ బ్యాకప్ కోసం జనరేటర్లు ఏర్పాటు చేశారు. మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ట్రాన్స్‌ప్లాంట్ ఐసోలేషన్ గదుల్లో 9 ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, 24 గంటల పాటు శుభ్రమైన గాలి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీని ద్వారా ఇన్‌ఫెక్షన్ నియంత్రణలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఈ సెంటర్ ప్రారంభంతో రాష్ట్రంలో అవయవ మార్పిడి సేవలు మరింత విస్తరించి, అత్యవసర చికిత్సల కోసం ప్రైవేటు హాస్పిటళ్లపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుందని డాక్టర్లు చెబుతున్నారు. మరోవైపు, సనత్‌నగర్ టిమ్స్‌లోనూ అత్యాధునిక వసతులతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవాలు వృథాగా పోకుండా, జిల్లాల్లో ఆర్గాన్ రిట్రైవల్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

### మదర్ మిల్క్ బ్యాంక్

ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌తో పాటు.. గాంధీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మదర్ మిల్క్ బ్యాంక్‌ను కూడా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ సెంటర్‌లో తల్లి పాల సేకరణ, స్టోరేజ్ కోసం ఏర్పాట్లు చేశారు. అవసరమైన పిల్లలకు ఇక్కడి నుంచి తల్లిపాలు అందించనున్నారు. ధాత్రి అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్, మదర్ మిల్క్ ప్రారంభించిన అనంతరం.. గాంధీ విద్యార్థుల స్నాతకోత్సవంలో మంత్రి పాల్గొంటారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

- ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన

**హైదరాబాద్, ఏప్రిల్30 (జనంసాక్షి)** : ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధపడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితంగా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్రభుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

# మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు

- నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్
- బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు
- మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసులో చర్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి)** : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది. రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మరోవైపు నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో తమ పేర్లను అనవసరంగా లాగుతున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఆరోపిస్తున్నారు. కాగా, నిందితుడు రమావత్ మధు.. అధిక వడ్డీ పేరుతో వేల మంది నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

# సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

- భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన
- తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ
- సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి)** : రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది. అయితే రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారాం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ లేఖలో నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో అక్రమంగా శారీరక సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావాలి. ప్రేమనా లేక శృంగారమా..? నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతోపాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏసిబికి చిక్కిన లంచగొండి అధికారి



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్30 (జనంసాక్షి)** : జిల్లాలోని ఓ ఫారెస్టు బీట్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. జిల్లాలోని గుండాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నడిమిగూడెం ఫారెస్టు బీట్ అధికారి బానోత్ నరేష్‌ను గురువారం రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. తన తండ్రికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల పోడు భూముల్లో అటవీ అధికారులు జోక్యం చేసుకోవద్దని కోరగా బీట్ అధికారి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి బీట్ అధికారిని పట్టుకుని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# కుప్పం విమానాశ్రయానికి తొలగిన అడ్డంకులు

**భూసేకరణపై పిటిషన్లు కొట్టివేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్30 (జనంసాక్షి)** : చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ముందుగా ఏపీ హై కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెరుగుదల వంటి అంశాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధి, టూరిజం అభివృద్ధి వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.

# జనగామ మున్సిపల్ కౌన్సిల్‌లో ఉద్రిక్తత

**వైస్‌చైర్మన్‌కు గౌరవం ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ ఆందోళన**



**జనగామ, ఏప్రిల్30 (జనంసాక్షి)** : జనగామలో శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలుకు వేదికపై కుర్చీ ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమావేశం ప్రారంభమైన వెంటనే వైస్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకారం స్థానం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది బీఆర్ఎస్ నేతలు స్వయంగా కుర్చీ తీసుకువచ్చి వైస్ చైర్మన్‌ను కూర్చోబెట్టడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. వివాదం మరింత పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు వేదికపై కూర్చున్న వైస్ చైర్మన్‌ను పోలీసులు కిందకు దించారు. ఈ చర్యతో బీఆర్ఎస్ నాయకులు మరింత అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడమంచి బాలమణి ఈ వివాదంపై స్పందించారు. ఈ వేదికపై కూర్చోవడానికి ప్రత్యేక హక్కు లేదా నిబంధన లేమీ లేవని, కమిషనర్ మార్గదర్శకాల ప్రకారమే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఈ వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు వేదిక ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వైస్ చైర్మన్‌కు కనీస గౌరవం ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# రుణాల ఎగవేత కేసులో రఘురామకు ఊరట

- అరెస్ట్ చేయవద్దంటూ ఢిల్లీ కోర్టు బెయిల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్30 (జనంసాక్షి)** : ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట దక్కింది. బ్యాంకుల రుణ ఎగవేత కేసులో రఘురామకు బెయిల్ మంజూరు చేసింది. కోర్టుకు వ్యక్తిగతంగా రఘురామ గురువారం హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో అరెస్ట్ చేయొద్దని ఆయనకు న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. రూ. 50,000 షురిటీ బాండ్‌పై బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆయనతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా ఊరట లభించింది. సీబీఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సుమారు 15 వేల పేజీలకు పైగా ఉండటంతో, ఆ పత్రాల పరిశీలనకు నిందితుల తరపు న్యాయవాదులు సమయం కోరారు. పత్రాల పరిశీలన కోసం తదుపరి విచారణను జులై 6, 2026కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కంపెనీల లిక్విడేషన్ స్థితిగతులను తెలపాలని సంబంధిత అధికారులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370